కోకిల

(నాటకం)

రచన:

పానుగంటి లక్ష్మీనరసింహారావు

రోహిణీ పబ్లికేషన్స్
మెయిన్ రోడ్ రాజమండ్రి-533101

KOKILA

By
Late Panuganti Lakshminarasimha Rao

Edition: **May 1994**

Cover Design: **BALI**

Price : **Rs. 20-00**

Published by :
ROHINI PUBLICATIONS
Main Road, Rajahmundry-533 101.
Phone : 73444

Printed at :
Sri Arunodaya Printing Press
Seetharampuram, Vijayawada-2.
Phone : 431422

మా మాట

ప్రజలకు నాలుగు కాలాలపాటు పనికివచ్చే ఉత్తమ గ్రంథాలను సైతం ముద్రిస్తూ ముందుకు వెళ్ళాలని మా సంకల్పం.

సుప్రసిద్ధులైన పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి రసవత్తర నాటక గ్రంథం ఈ 'కోకిల' పునర్ముద్రణ మా ఈ సంకల్పంలోని భాగం.

విశ్వ వ్యాప్త కీర్తి రావలసిన పానుగంటివంటి గొప్ప కవిగారి నాటకం ముద్రించి ప్రకటించిన మేము ప్రజల ప్రతిస్పందన గమనించి ఇంకా ఇటువంటి సద్గ్రంథాలను ప్రచురించాలని మా ఆశయం.

1865-1940 నడుమ జీవించిన శ్రీ పానుగంటి — సాక్షి పానుగంటిగా తెలుగు ప్రజలకు చిరపరిచితులు. ముఖ్యంగా కంఠాభరణం' వంటి గొప్ప నాటకాలకర్త శ్రీ లక్ష్మీనరసింహారావు గారు.

రసజ్ఞ పాఠకులు అందించే అండదండలే మా భవిష్య ప్రచురణలకు బాటలు వేస్తాయి.

రోహిణీ పబ్లికేషన్స్
మెయిన్‌రోడ్ - రాజమండ్రి

ఈ నాటకమునందు వచ్చు పాత్రలు

పురుషులు

వసంతుడు : కథానాయకుడు, శ్రీపుర రాజకుమారుడు

మోహనుడు : బుద్ధిమతికి ప్రియుడు, కోకిలను దొంగిలించినవాడు

విజయసారధి : శ్రీపుర సేనానాయకుడు, భ్రమరికను వలచినవాడు

జగన్నాథుడు : విజయసారధి చెలికాడు

రుద్రదేవవర్మ : విజయపుర ప్రభువు, కోకిల తండ్రి

కృష్ణశంకరులు : శ్రీపుర బ్రాహ్మణులు

రామచంద్ర గోపాలురు : శ్రీపుర పౌరులు

కోకిల పురుష వేషములో శ్రీపుర ప్రభువుగా వచ్చును.

స్త్రీలు

కోకిల : కథానాయిక, వసంతుని భార్య, విజయపుర రాజకుమార్తె

భ్రమరిక : కోకిల దాసి, విజయసారధి వలచినది

బుద్ధిమతి : మోహనుని వలచినది

చంద్రిక : వసంతుని తల్లి, శ్రీపుర రాణి

వాహిని : వసంతుని స్త్రీ రూపము

ఇంకను సేవకులు, సువాసినులు మొదలగువారు వత్తుర

శ్రీ

కోకిల

ప్రథమాంకము

ప్రదేశము : విజయపురము

[ప్రవేశము — కారాగృహస్థుఁడగు వసంతుఁడు.]

వసం : గీ. మొదట భరియింపరాని యా ♦ పదనైనఁ
క్రమముగాఁ గొంత సహ్యత ♦ కానిపించుఁ;
బ్రబలదర్శ గాఢాంధకా ♦ రమునసైన
నడుగు వెట్టినకొలఁదిఁ దె ♦ న్నానునట్లు

అదిగాక.

గీ. రాజపుత్త్రిక, కోకిలా ♦ రాజవదన
కంటఁ బడునంతకాల మీ ♦ కారబాధ
బంచ బంగాళమగు; నాఁడు ♦ వారి యోర
చూపులను బోని యిడుమ లె ♦ చ్చోటఁ గలవు?

(కోకిల ప్రవేశించును.)

కోకిల: (నవ్వుచు) వసంతా! ఏమనుచుంటివి? 'ఆఁడువారి యోరచూపులను బోని యిడుమ లెచ్చోటఁ గలవు?' అనియా? కాంతావలోకనము లసమాన కష్ట ప్రదములా? ఆ సంగతి తెలియక తఱచుగ నిక్కడకు వచ్చి నీకు శ్రమ మిచ్చినందులకు క్షమింపుము.

వసం: (నవ్వుచు) ఆహా! కోకిలా! వచ్చితివా? ఈ రాత్రి యింత యాలసించితివేల?

గీ. వత్తువో, రావో యని కళ ♦ వళము నొంది
యటు లిటులు చూచి చిటుకన్న ♦ నదరిపడుచుఁ
బడుచు, లేచుచు, నూఁగాడు ♦ చడలు వొడమి
గడియ లేండ్లుగ నీకయి ♦ కాచియుంటి.

కో : వసంతా! నీవు కాచియుండినప్పుడు నేను రావలసినదా? ఈ సమీపమున నున్న పుష్పవనమున విహరించుట కిష్టానుసారముగ వచ్చుచుందునుగాని, నిన్నుఁ జూచుటకుఁ గావని నీ వెఱుఁగవా?

వసం: (తనలో) హా! హృదయమా! ఇన్ని నెలల నుండి యెంత వెఱ్ఱిపడుచుంటివి!

గీ. లతలు తల లూఁచి పూలు జ ♦ లజలరాల్పఁ
గ్రింది తృణచయ మానంద ♦ మందఁదగునె ?
సురభిళానిల మేతేర ♦ సూకరంబు
తన్నుఁ గౌఁగలించుట కంచు ♦ నెన్నఁదగునె?

గీ. పక్కనను జంద్రకళనవ్వఁ ♦ గొక్కెఱ తను
నద్ది ప్రేమించెనని యెన్న ♦ నగునె? మింటఁ
జుక్క మినుకని మెఱయఁగా ♦ జక్కవ తను
నద్ది కన్గొనె నని వెఱ్ఱి ♦ నందం దగునె?

ఆలాగే,

గీ. సహజ లీలావిలోల యౌ ♦ చంచలాక్షి
యగపఱచుచున్న హావభా ♦ వాదికములఁ
గాంచి యది నన్ను మోహించె ♦ నంచు నెంచి
యిపుడు మొండిచేఁ గని యిగి ♦ లింపవలసె.

గీ. చూడనట్టి చూపును, మాట ♦ లాడనట్టి
పలుకులును, వేడ్కలేని న ♦ వ్వులును, నలుకఁ
గనని బొమముళ్ళు, చేసి చే ♦ యవి పనులును,
బుట్టు వన్నెలు చిన్నెలు ♦ పొలఁతుకలకు.

(ప్రకాశముగా)

హా! కోకిలా! ఏమంటివి? 'నా పుష్పవనమున విహరించుటకే వచ్చుచుంటినిగాని నిన్నుఁ జూచుటకుఁ గావని నీ వెఱుఁగవా?' అని వచించితివి. హా! అట్టిసంగతి నే నెఱుఁగనా? సార్వభౌమ పుత్రికవైన నీ వెక్కడ? మాతా పితరులనుండి, రాజ్యమునుండి వేఱుచేయఁబడి నీ తండ్రిచే నిట్లు కారాగృహబద్ధుడనై యధమాధమస్థితిలో నుండు నే నెక్కడ? అట్టి నీవిట్టి నన్నుఁ జూచుటకు వచ్చుచుంటివని యోజించుటకంటె బుద్ధిమాంద్యమును సిగ్గుమాలినతనము నుండునా?

గీ. కలుగులోనుండు నీచక ♦ ర్కటక మేదఁ?
గంధిజామూల్యతమసుధా ♦ కలిక యేదఁ?
బంకనిర్మగ్నతనుపైన ♦ బా తదేద?
స్వర్ధునీస్వర్ణసరసీజ ♦ వల్లి యేద?

నన్నుఁ జూచుటకే నీవు రాకపోయినను వచ్చి నన్నుఁ జూచుచుంటివికదా! అందువలన నే నింతింతనరాని యూహోహము నొందుట విరుద్ధమా?

గీ. భవ్య కేళీవనిని జూడ ♦ వచ్చు నీదు
వదన మీక్షింప సంభ్రమా ♦ పడుట తగదె?
చంద్రికల భువి కీవచ్చు ♦ చందమామఁ
గనుటకై సంబర పడదె ♦ కలువపూవు?

కో : (తనలో) ఆహా! ఇదివఱకు నే నన్న యూహామాత్రపు మాటకే యాతఁడెంత వగచినాఁడు! కొంచెము వేఁడిగాలిచే కోషిల్లి యొక్క నీటితుంపరచే వికాస మొందు పుష్పముకంటె నీతని హృదయము మెత్తనిదని తోఁచుచున్నది. (ప్రకాశముగా)

ఇంత మాత్రమునకే యెంత చదివితివి! ఎన్ని పూర్వగాథలఁ దడవితివి! ఇపుడు మాతాపితృవిశ్లేషణ సంభాషణమేల? రాజ్యపరిత్యాగ వార్తలేల? అథమాధమస్థితి యని విలపింప నేల? మా తండ్రి నీకిక్కడ నేమి లోపమొనర్చుచున్నాఁడు? నిన్ను సమస్త వైభవములతోఁ బెంచుచు నీకు సర్వవిద్యలను నేర్పించి జాగరూకతగ నీ క్షేమ మరయుచునే యున్నాఁడుగదా! ఒక్క స్వచ్ఛంద వివాహారమునకున్న లోపముతక్క నితరలోప మేమున్నది? ఆ లోపము గూడ దీఁనయెడల నీకు మేమే కావలయునినిన మాట యేమి?

వసం: హాహా! ఏమి మాటాడితివి! (నవ్వుచు) ఏదీ కోకిలా! ఒక్కసారి నావంక దేటిపాఱఁ జూచి, నీ విప్పు డనిన చిత్రవాక్యమును దిరిగి వచియింపుము.

కో : (తలవంచుకొని నవ్వును)

వసం: (తనలో) ఆహా! ఎంత సవికాసముగ మందహాసము చేయుచున్నది!

గీ. పై పెదవి గదలఁగ, నడ్డ ♦ బాస ముత్తె
మదర, బుగ్గ లిట్టె యుబుక, ♦ నజులింత
సన్నపడఁ, జుబుకముపైని ♦ జిన్నగుంట
పడ, రదములు వెన్నెలగాయఁ ♦ బడఁతి నవ్వె.

ఆహా! ఈ మహావైభవ దర్శనమునకై సంతసింపనా? ఖింతకుమ్ముందు,

గీ. కన్గొలుకులతోఁ జెక్కులు ♦ కందఁగఁ గుచ
శిఖర హారాళితో నోష్ఠ ♦ సీమ యదర
భ్రూయుగముతోడ మూతియు ♦ ముడివడంగ
దృష్టితోఁ బల్కు తీండ్రింపఁ ♦ దెఱవ యలిగె.

ఇందులకు విచారింపనా !

గీ. రస పరిద్రవన్మ న్మనో ♦ రంగ మబల
పరిపరి విధంపుఁ జిత్రరూ ♦ పంబు లెల్ల
సంగ్రహించెను సమ్యక్ప్రి ♦ శస్తసరణి
నాకృతి విలేఖకంబను ♦ యంత్రమట్లు.

(ప్రకాశముగ)

హా! కోకిలా! ఏమంటివి? 'నీకు మేమే కావలయునన్న మాట యేమి' అనియా? ఇది న్యాయమేనా? నాకు నీకంటె మఱెవ్వరున్నారు? నేను నా తల్లి నెఱుఁగను. తండ్రి నెఱుఁగను. రాజ్యము నెఱుఁగను. నేను మూఁడేండ్ల పిల్లవాఁడనై యుండఁగ నీ కారలోనికిఁ దీసికొని రాఁబడితినఁట! నా దోష మేదియో నే నెఱుఁగను.

కో : ఎఱుఁగకేమి? సామంతరాజగు నీ తండ్రి సార్వభౌముఁడగు నా తండ్రిని ధిక్కరించి నందుల కాతని విధేయతా సాంతత్యమున కతని పుత్త్రుఁడవైన నిన్నుఁ బూఁటకాఁపుగం మా తండ్రి తెచ్చినాఁడు.

వసం: అయినను మా తండ్రికి నాకు నెంత భేద మున్నదో చూడు!

కో : ఏది?

వసం: నా తండ్రి నీ తండ్రిని ధిక్కరించినందుల కతని పుత్త్రుఁడనైన నన్ను నీ తండ్రి కారాబద్ధుని జేసినాఁడు. పరిశుద్ధాంతఃకరణముగల నన్ను నిష్కారణముగ నీ తండ్రి యీ రీతిగ నిన్ని సంవత్సరములనుండి బంధించి యుంచినను, నే నట్టివాని పుత్త్రికవైన నిన్ను మనసులోఁ దలఁచి యువ్విళులూరుచుఁ బ్రాణాధికఁగ నెంచుచు సమస్తమునకుఁ గతిగా నెంచుచున్నాఁడను గదా! (నవ్వుచు) నీ తండ్రి నాకుఁ జేసిన యుపకారమునకు నే నిట్లు చేయఁ దగునా?

కో : (నవ్వుచు) నాకుఁగూడ నీవలెనే కారాగృహబంధము లేదని విచారించుచుంటివా?

వ : నావలెమాత్రమే కాదు. నాతోపాటీ కారయందే నీకుఁగూడ 'బంధము లేదని విచారించుచుంటిని.

కో : నీ కిట్టి యపాయ తగదుసుమా! స్వేచ్ఛావిహారము గల వారికి బంధమగు నెడల నీ బంధబాధ నెట్లు శమింపఁగలదు? నీకు బంధవిముక్తి కావలయునని కోరుకొనవలయును గాని——

వ : బంధమునుండి విముక్తికైనను నాకు నీ బాహుపంజరమున గాఢతరబంధమే కదా! అట్టి మహానందదాయకమగు నీ బాహుబంధముయొక్క యనుభవము నా కీ కారాగృహమందైన నేమి? వెలుపల నైన నేమి? బంధమున బంధము మఱింత గాఢతరముగ నుండు నని యటు లంటిని.

కో : ఇట్టి మాటలు నీ నోటినుండి రావచ్చునా?
(నేపథ్యమున) రావచ్చునా? అమ్మా! అటులు రావచ్చునా?

వ : (తనలో) ఆ రవము నా ప్రియురాలి చేటికయగు భ్రమరికదివలెఁ గానిపించు చున్నది. 'రావచ్చునా' అని యది పలికినది. తాను స్వేచ్ఛగా నిచ్చటకు వచ్చుట కేదియో యవరోధ మున్నట్లు భావించియే కద యట్లు పలికినది. నేనును గోకిలయు నన్యోన్య ప్రియవాక్య పరామర్శన లీలాలోలత నుండ నెంత యిష్టురాలయ్యు నట్టి సమయమునం దాను వచ్చిన మా కానందభంగ మగునని యిటు లనినట్లెంచవలసి యున్నది. నాయందు గోకిల కనురాగ మనిన సంగతి నీమె వలననే భ్రమరిక తెలిసికొని యుండును. నొకపు డుదాసీనతయు, నొకపుడు నిరాదరణము, నొకపుడు కోపము నీమె నాయెడఁ గనంబఱచిన నంతరంగమున ననురాగమునకు లోపము లేదనుటకీ భ్రమరికా వాక్యము కొంత నిదర్శనమైయున్నది. (నేపథ్యమున) కోకిలా! 'నేను రావచ్చునా' యని యొనరించిన ప్రశ్నమునకు నీవు నిరుత్తరివై యుండుట చేతను రాఁగూడదని తోఁచుచున్నది. నా వెఱ్ఱిగాని నీ ప్రియునితో నీవు సంభాషించునపుడు నేను గావలయునా?

వ : (తనలో) సుధాప్రవాహ మాధురీధురీణ గంభీరాలాపములు చేటిక ముఖము నుండి వచ్చినవి.

గీ. సతికి నాయెడఁగల మన ♦ స్స్థితులు దురవ
గాహము లయినఁ జేటివా ♦ క్యములఁ దెలిసెఁ,
గవిత దుర్భేద్యభావమై ♦ కష్టపఱుప
నమలిన వ్యాఖ్యచే స్పష్ట ♦ మైన యట్లు.

కో : అసందర్భ ప్రలాపినీ! ఇంక రావేమి?
(భ్రమరిక ప్రవేశించును)

భ్ర : అమ్మో! నాపైఁ గోప మేల?

కో : ఛీ! మూర్ఖురాలా! వదరుఁబోతా! ఈతఁడు నాకుఁ బ్రియుఁడని నీతోఁ జెప్పి యుంటినా?

వ : (తనలో) భ్రమరికా! ఏమని ప్రత్యుత్తర మిచ్చెదవో? నా బ్రతుకంతయు నీ జిహ్వాగ్రమున నున్నది.

గీ. ప్రియులు ప్రియ లటంచును పద ♦ రెవరుగాని
వారి యసువులు దత్పాళి ♦ వశ్యము లగు ;
రాజ కృపయంచు శ్రితులు సం ♦ భ్రమ పడెదరు
గాని వారు తత్సేవకా ♦ ధీను లహహ!

భ్ర : కోకిలా! ఈతడు నీ ప్రియుఁడని నీ నోటితోడనే చెప్పవలయునా? నీ కన్నులతోఁ జెప్పలేదా? కనుబొమలతోఁ జెప్పలేదా? భావముతోఁ జెప్పలేదా? పులకాంకితమగు నీ యొడలితో నిప్పుడు చెప్పుచుండుట లేదా? నోటితో జెప్పని లోపమేమున్నది? అదిగాక, 'ఈతడు నా ప్రియుఁడని నీతో జెప్పి యుంటినా' యని నీ వింతకుముందనిన వాక్యములో 'ఈతడు నా ప్రియుఁడని' నీ నోటితోనే పల్కితివి కాదా! అదిగాక పల్కిన పల్కులకంటెఁ జేష్టలే ప్రబలతరములై యుండఁ బల్కవలె ననినమాట యేమి?

వ : (తనలో) సెబాస్! భ్రమరికా!

కో : ఓసీ! అవిధేయురాలా! నా చేష్టలలో నీ వెంచిన తప్పేమిచె?

వ : ప్రియురాలా!

కో : ఆఁ! అటు లనకుము.

వ : నీవు నీ సఖిపైఁ గోపింపవలదు. నీ చేష్టలలో నది యెంచిన తప్పేమియు లేదు. నీ చేష్టలు నాయం దనురాగమును సూచించుచున్న వనెను.

కో: వసంతా! నీవుకూడ నట్టి వెఱ్ఱి పడుచుంటి వేమి?

వ : ఓ మోహనాకారా! నీ యనురాగమునకు వెఱ్ఱిపడఁదగినవాఁడను నేనే. నే నొక్కఁడనే.

(మోహనుఁడు ప్రవేశించును.)

మో: (తనలో) నీ నొక్కఁడవే కావు. నేనుఁగూడ నున్నాఁడను.

గీ. లలిత లలనాంగలావణ్య ♦ లహరి నాశ్ర
యించుకొని యుంటి మీవును ♦ నేనుఁగూడ
నమృతసన్నిభవాఃపూర్ణ ♦ మైన నదిని
నెపుడు కూలద్వయం బాశ్ర ♦ యించుపోల్కి

హా! కోకిలా!

గీ. రాగవశమున మనసులో ♦ రమణి! నిన్ను
ముద్దుఁగొని కౌఁగిలించి, స ♦ మ్మోదమంది,
మైమఱచి యుంటి; స్వప్నస ♦ మ్యక్సమాగ
తాంగనాశ్లిష్టనిద్రావ ♦ శాత్ముఁడట్లు.

నీ విప్పు డిచ్చట నుందువని యెంచి యిచ్చటి కెన్ని యభ్యంతరములనైన దాఁటి వచ్చితిని. ఆహా! రాగమున కెన్ని యద్భుతశక్తు లున్నవి?

గీ. కవికివలెఁ గల్పనమును, ఱె ♦ క్కలును బక్షి
కటులు, యోగికివలెఁ గామ ♦ యానశక్తి,
యఖిలవిస్తృతి పవనుని ♦ కటులు, సిద్ధు
నకటు దూరశ్రవణదర్శ ♦ నంబు లుండు.

గీ. ఏతదనురాగశక్తిచే ♦ భీతిలేక
కంటకం బీది బురు జెక్కి ♦ గాఢలఘుత
నుపవనపుగోడ దాఁటిపో ♦ నుఱికి యిటకు
వచ్చినాడఁను నేత్రోత్స ♦ వంబు కొఱకు.

ఇక్కడ వీ రందఱు మాటలాడుకొనునట్లున్నారు. ఈ నందివర్ధన నికుంజము చాటున దాఁగి విందును.

కో : భ్రమరికా! నోరు మూసికొని యూరకుంటివేమి? నా చేష్ట లేవియో చెప్పవైతి వేమి?

భ్ర : అమ్మా! మతితగ్గినదాని చేష్టవలె మదనవికృతిహెచ్చగు దానిచేష్ట లసంఖ్యములు గాదా! ఎన్ని యని చెప్పఁగలను?

కో : నీవు మతితగ్గినదాన వగుటచే నా చేష్టలు నీ కంటికి విపరీతములుగ నున్నవి.

భ్ర : నాకు మతి తగ్గుటకు నే నీ మహానుభావుని గాఢముగ వలచితినా?

కో : ఆఁ! నోరు గట్టిపెట్టికొనుము!

భ్ర : ఈ మాత్రపుమాటకే యసూయపడుచుంటివా?

మో : (తనలో) కోకిలా నీ యసూయయే నీ రాగాధిక్యమును సూచించునది.

గీ. జను నహంభావ మెంతొ య ♦ జ్ఞాన మంత,
జను నతుష్టి యెంతొ యిహవాం ♦ ఛయును నంత,
గవి కసహన మెంతయొ యశ ♦ స్కతయు నంత,
సతి కసూయ యెంతయొ రాగ ♦ గతియు నంత.

కోకిలా !

గీ. బద్ధునెడ నీవు వినియోగ ♦ పఱుచు ప్రేమ
మంతయును నిష్ఫలం బగు; ♦ నబ్జబద్ధ
భృంగమునఁ దేనె చిలికిన ♦ రీతి, విషయ
విహ్వలున కిచ్చు వేదాంత ♦ విద్య పోల్కి.

భ్ర : అమ్మా! నేనుఁగూడ వచ్చువఱకుండుమని నీతోఁ జెప్పినను నీవు నాకంటె ముం దిచ్చటి కేల వచ్చితివి?

కో : ఏల వచ్చితినో నీ కేల చెప్పవలయును?

భ్ర : చెప్పనక్కఱలేదు. రహస్య మంటివా, అదియే చాలును.

కో : అదిగో! అసంబద్ధము లాడుచున్నావు. రహస్య మేమున్నది? నేను వచ్చుటకు నా యిష్టమే కారణము.

భ : యీతనిపై—అంతియేనా?

వసం: సతీమణీ! ఔ ననరాదా? పోనీ! అంతమాట నాడ నక్కఱలేదు.

గీ. తల నిటుల వంచి మొగ్గదం ♦ తము లగపడ
నింత నగరాదె? చెవులపూ ♦ లిట్టె కదల
మొగము నింత యూపంగరాదె? ♦ ముద్దు లొలుక
నోరఁ గనరాదె? వలదూర ♦ కుండరాదె?

కో : మీ రిద్ద ఱేకమై నన్నుఁ బరిహసించుచుంటిరా?

వ : మే మిద్దఱ మేకమగుట యసత్యము. ఎన్నటికైన నీవును-నేనును.

మో : (తనలో) నీవు నదియుఁగాదు; నేను నదియును.

గీ. చిర పరిచయముచేఁగూడఁ ♦ జెలుల కథము
పయి మనసు దగులుఁ; దగిన ♦ వారిఁ గన మ

నను దిరుగు; లఘుసూత్ర స ♦ నాథసూచి
చుంబకముగఁజేరి విడుచు దా ♦ రంబుగాదె?

వసంతా!

గీ. తగిన వారలలోన ను ♦ త్తముఁడ నేను;
నీచుఁడవు నీవు; ♦ కోకిల ♦ నీకుఁ దగదు;
నిన్నుఁ ద్రోసి రాజని కాంత ♦ నేను గొనఁగ
వచ్చినాఁడ నాకంతటి ♦ భాగ్యమున్న.

కో : (కోపముతో) వసంతా! నీ విప్పు డేమంటివో మఱియొక్కసారి యనుము.

వసం: (నవ్వుచు) ఏమంటినో చెప్పనా? కర్ణ రసాయనముగ వింటువా? ఒక్కసారి యననేల? నా జన్మము కృతార్థమగునట్లు వేయిసారులైన నందును. నీవును నేనును—నేనును నీవును—సర్వ్వయానందానుభవమున—

కో : చాలు! చాలు! నీ ప్రజ్ఞాలాపముల నుడుగుము.

మో : (తనలో) సెబాస్! కోకిలా! అతని మాటలకంటెఁ బై మాటలను సత్యవాక్యములును నేనాడితిని. నీవు వినఁదలఁచుకొనవా? 'నీవు నదియుఁ గాదు, నేను నదియు' నని నే నంటిని.

కో : వసంతా! నీ కట్టి యౌద్ధత్యము కూడదుసుమా!

మో : (తనలో)— ఔద్ధత్యము కాదు; అద్వైతము

కో : నే నింటికిఁ బోవలయును. నీవు నాతోఁగూడ వచ్చెదవా? లేక నేనొక్కతెను బోవుదునా?

భ్ర : నేను నీతోడనే వచ్చెదనని చెప్పినప్పటికిని నన్నుఁ ద్యజించి పోవుటకు వసంతుఁ డింటియొద్ద నున్నాఁడా?

కో : ఇఁక నీవు వసంతుని పేరెత్తకుము.

వసం: కోకిలా! నాపేరు నీవెత్తఁగూడదు కాని, భ్రమరిక కేమి?

భ్ర : చూచితివా సఖీ! వసంతుఁ డేమనుచున్నాఁడో! నీ వాతని భార్యవు కావున భర్త పేరెత్తఁగూడదని యభిప్రాయ పడుచున్నాఁడు.

వసం: రాజపుత్త్రికా! నా కట్టి మహాభాగ్యము నీవు లభింపఁ జేయరాదా?

మో : (తనలో) పోవోయి! అట్టి భాగ్యము నాకుఁగాని, నీకుఁగాదు.

కో : ఎన్నిమాఱులు చెప్పుమంటివి? నీపై నా కనురాగం లేదు. నీ విట్టి యడి యాసలు మానుకొనుము. తెలిసినదా? నీవు నా కక్కఱలేదు. తఱచుగ వచ్చి

చూడటవలనఁ గలిగిన చనువు నాధారము జేసికొని యెన్నిమాటలు పల్కు-చుంటివి?

(భ్రమరిక వంకఁ దిరిగి) ఏమీ, వచ్చెదవా?

వసం: హా! భ్రమరికా! నా ప్రియురాలు పోవుచున్నది. నేను వృద్ధుఁడను. బద్ధుఁడను. నీవు నా మాఱుగ దాని నాఁపరాదా? చూచెదవేమి? అయ్యో! పోవనున్నదికదా!

గీ. ఇట్టె శర మడ్డుపెట్టి మో ♦ మట్టె త్రిప్పు
కొనిన కాంతను బతిమాలు ♦ కొనెడుమిషను
గడ్డము గ్రహించి దాని మొ ♦ గంబు నాదు
వైపునకుఁ ద్రిప్పి పుణ్యాన ♦ వఱలగాదె.

గీ. నేను నీవాఁడ, నినుఁ బాసి ♦ నిలువఁగలనె
యనుచు నా మాటలుగఁ బల్కి ♦ యబలపైఁట
నొడిసిపట్టి యాఁపఁగరాదె? ♦ యడుగులందు
వ్రాలి నా మాఱుగా నడ్డు ♦ పడగరాదె?

భ్ర : (పైఁటచెఱఁగు బట్టి యాఁపును.)

మో : (తనలో) ఆఁడుదాని ప్రకృతి రహస్యములు దెలియని వసంతుఁ డాందోళనము బడి కోకిలను బట్టుకొనుమని సంభ్రమపడినఁ బడునుగాక! భ్రమరికా! నీకైనఁ దెలివి లేదా? నీ వాఁడుదానవు కావా? నీ సఖి హృదయమును నీ వెఱుఁగవా? నీ వేల యంత తొందఱపడి యామె చేలచెఱఁగు గ్రహింపవలయును? వదలివేయుము ఒక్క యడుగు ముందునకుఁ బెట్టిన నే నీ శిరముఁ దెగ నఱికికొందును.

గీ. స్వచ్ఛతమరాగపూర్ణ మీ ♦ సకియ మనసు
తరళతమమైన దత్యద్భు ♦ తగతి కలది;
యాఁపిన మఱింత గతికల ♦ దగును; వ్రేల
నడఁపఁబడు శుద్ధరసబిందు ♦ వటులె యెపుడు.

గీ. మాట బడబడకాని, యా ♦ మగువ మనసు
మసృణిత మగభీర రస సం ♦ భరితమంచు
నెఱుఁగవే? వసంతా! భయం ♦ కర విశేష
గాఢ గర్జాఢ్య ఘనఘనా ♦ ఘనముమాడ్కి.

భ్రమరికా! నీవు తెలివితక్కువ పనిఁ జేసినను నా కామోద మొసఁగితివి!

ఆ. వె. వదలు పైఁటలోని ♦ వనితచన్గవ బిగి
నింతదనుకఁ గాన, ♦ నిపుడు నీవు
పైఁటలాగ నద్ది ♦ ప్రబలి యున్ముఖమౌచు
మనసుకనుల నొక్క ♦ మాఱు పొడిచె.

వసం: భ్రమరికా! నీ చెలి నాఁపి నీవు పుణ్యముఁ గట్టుకొని నన్నుఁ గృతార్థుని జేసితివిగదా!

కో : (వసంతునివంకఁ జూచుచు) అది యూఁపునది; నే నాఁగెడుదానవా? సఖీ! నీవు నన్ను వదులుదువా, లేదా? లేనియెడల శిక్షాపాత్రవు వగుదువు జాగ్రత్త! (ముందునకుఁ బోవ యత్నించ భ్రమరిక యాఁపును.)

భ్ర : నీవలని శిక్షకు నేను భయపడుట లేదు. నీ వింటికిఁ బోయిన యెడల నీకు మదనునివలన శిక్ష యని నేను జడియుచుంటిని.

వసం: (తనలో) కోప మున్న ట్లగపడుచుండె కాని, కోపచిహ్నములు మోమందు గానఁబడుట లేదు.

గీ. నాతి వీక్షణములు ప్రస ♦ న్నంబు లగుచుఁ
జల్లఁగా నుండెఁ; బలుకులు ♦ చండములయి
బాధనిచ్చు; హాయిగా జల్లు ♦ వాన నిచ్చు
చు వడగండ్ల రాల్చు వసంత ♦ శోభఁబోలె.

గీ. ఉవిదమన సొకతీరు; ప ♦ ల్కొక్కతీరు;
చేష్ట మఱియొక తీ; రిట్లు ♦ చెలఁగు దీని
ప్రకృతి చిత్రంబు; శ్రుతికి సం ♦ బంధ మొంద
నట్టి పాటకు నపలయ ♦ దొర్లినట్లు.

మో : (తనలో) ఓ వెఱ్ఱి వసంతా!

ఆ. వె. ఒడలు బయలుసేయు ♦ నువిద గర్వ్వ యెటులొ
మనసు బయలుసేయు ♦ మగువ యటులె;
జిహ్వ లూఱయఁబడెను ♦ జిత్తగతులఁ గప్ప
నొడళిగతులఁ గప్ప ♦ బిడియమటులె.

కో : నన్నింక నేల పట్టుకొందువు?

భ్ర : నీ వాగుదు ననిన విడువకుందునా? సఖీ? నా మనవి నంగీకరించి కొంతసే పింక నిచ్చట నుండుము.

వసం: నీ మనవియే కాదు; నా ప్రార్థనగూడ నదియే!

కో : వీలు లేదు. నేనింటికిఁ బోవలయును.

భ్ర : ఇంటియొద్ద నే మున్నది.

కో : ఇచట మాత్రమో?

భ్ర : ఇచ్చట జగన్మోహనుండగు వసంతుడున్నాఁడు.

మో : (తనలో) భ్రమరికా! తప్పు. జగన్మోహనుఁడు, వసంతుఁడు నున్నారనుము.

కో : అతఁడు జగన్మోహనుఁడని పెద్ద పేరు నీవు పెట్టిన నే నేల కాదనవలయును? కాని నా యిష్టము మదధీనము. నీవు మాఱు చెప్పక యూరకుండుము.

భ్ర : నేను మాఱు చెప్పకపోయిన వసంతుఁ డూఱకుండునా?

వసం: కాంతామణీ! త్వదధీనమైనది నీ యిష్టమే కాదు; నా యిష్టము, నా మనసు, నా యాత్మగూడను. బంధనాల యాధీనమైన యీ గాత్రముఁగూడఁ ద్వదధీనమును చేసికొని నన్ను సర్వవిధములఁ గృతార్థుని చేయ వేడుచున్నాను.

కో : నీ కెంత యస్వతంత్రతయో నాకుఁ గూడఁ నంతియే యని యెఱుఁగవా? నీ కిక్కడ బంధము; నాకంతఃపురమున బంధము. నీసైఁ గాపు గాయువారల కంటె నన్నుఁ గాపుగాయువా రధిక సంఖ్యఁ గలవారై యున్నారు. అట్టిచో నేను నీ కెట్లు బంధవిముక్తిఁ జేయఁగలను? వ్యర్థములగు నాశలఁ బెట్టుకొనక ప్రస్తుతావస్థతో సంతుష్టి నొంది యుండుము.

వసం: సరే! ప్రస్తుత స్థితితోడనే సంతుష్టి నొందెదను. నే నడియాసల నొందను. నా కేమియు నక్కఱలేదు. ఒక్క సంగతి మాత్రము చెప్పవలయును. 'నేను నిన్ను వలచితిని' అను సుధామధురాక్షరములు నీ నోటితో నా చెవిని వేయ వలయును. ఇదియే నా కోరిక. ఇంతతో సంతుష్టిఁ జెందెదను. ఊఁ! కర్ణ రసాయనముగ వచియింపుము.

భ్ర : అమ్మా ! సందేహింపకుము. ఏదీ ? నేను—నిన్ను—పలుకవేమి ?

కో : ఆఁ ! నా కిది ఏమి బలత్కారమా? సఖీ! నాకిప్పుడు నీవు నేను మాటలను జెప్పుచుంటివా? ఎంత యవిధేయతగ నుంటివి ? జాగ్రత్త! నే నట్టి మాట లాడుదానను గాను. ఆడుట నా కిష్టముగాదు.

మో : (తనలో) ఆహా! సముద్రప్రవీచికలలో నెన్ని జాతు లున్నవో స్త్రీలలో నన్ని ప్రకృతులున్న వికదా! నక్కలు పీఁతలను గ్రహించినట్లే జిత్తులమారి స్వభావముఁగలవారే స్త్రీల స్వాధీనలగఁ జేసికొందురు. తన్నుఁ గోకిల వలచినట్లింక దెలియనేలేదు జాఁబోలు!హా! ఎంతటి బుద్ధిశాలి! నేను నిన్ను వలచితి నని కోకిల తనతోఁ జెప్పునా? ఎంతకాల మాశ్రయించిన సరే, ఎన్ని సేవల జేసిన సరే, యీ జాతియాత్ర మెంతసేపటికి సుహుల్లాసుటమేహాని, ఊఁ యనునదిమాత్రము కాదు.

ఆ. వె. మాట కరకుదనము ♦ మనసు మెత్తఁదనంబుఁ
గలుగుదీని బలిమిఁ ♦ గవయనిద్ది
యిట్టె లోకు వగును ♦ గుట్టుబాధను ద్రోచి
చేరఁ దేనెపట్టు ♦ చిక్కినట్టు.

వసం : ఎంత దయలేకుంటివి? ఈరెండుమాటలు ననలేవా? అనుట కిష్టతయేలేదా ? నేను నీ రాజ్యమును గోరితినా? నీ ధనమును గోరితినా? నీవు నన్నుఁ బరిణయ మాడవలయు నంటినా? ఏమియుఁ గోరలేదు. రెండు మాటలే కదా! ఆ మాత్రమే పలుకలేవా?

మో : (తనలో) ఈపరమ విరాగునకు, నీ మహావేదాంతశిఖామణికా రెండు మాటలు మాత్ర మెందులకో? అవి తత్త్వమసివాక్యములా యేమి?

కో : ఇన్నిమాటలు పలుకుచున్నదాన నా మాటలుమాత్రము పలుకలేకుందునా? వట్టిమాటలు పలుకుట నాకిష్టములేదు.

వసం : అంత దయఁగలదానపైన యెడల వట్టిమాట లేల? క్రియానిదర్శకము లగు మాటలే పలుక వచ్చును.

కో : అయిన నీకిట్టి మాటలతో నేమి ప్రయోజనము ?

వసం : ప్రయోజన మున్నదికాదా?

కో : అది యెట్టిదో?

వసం : నేను జీవించియుండుటయే.

గీ. కుసుమ మొక్కటి వేఱొక్క ♦ కుసుమమునకుఁ
పరిమళం బిచ్చి తత్సౌరభము ♦ గ్రహించు;
దీప మొక్కటి వేఱొక్క ♦ దీపమునకు
స్వప్రభ నొసంగి తత్కాంతి ♦ సంగ్రహించు.

గీ. ఆత్మ యుండుట వేఱొక్క ♦ యాత్మకొఱకుఁ
గాని, తనకొఱకును మాత్ర ♦ గాదు; కాన
నీకొఱకు మేనఁ బ్రాణము ♦ ల్నిలిపినాఁడ
ననుఁ గృతార్థుని జేయవే ♦ నలిననేత్ర !

గీ. దేహమే బద్ధమైనది; ♦ దీని కిహసు
ఖానుభవ మేదియును గల్గ ♦ దైనఁ, జింత
లేదు; మదికి శృంఖల లేవి ♦ లేవు, కాన
నీపయిని బ్రాలె నద్ది ని ♦ ర్ణిద్రఫణితి.

గీ. దాని మోదంబునకు నిరో ♦ ధంబు లేదు
నిన్ను వలచితిని ననుచును ♦ జిన్నిముద్దు
పలుకులను జల్లఁగా వీను ♦ లలరఁ బలుకఁ
జాలు నదియె; ముమ్మాటికిఁ ♦ జాలు నదియె.

గీ. ఏమి లేకున్న నన్నుఁ బ్రే ♦ మించునద్ది
యొకతె కలదని సంతుష్టి ♦ నొంది తద్వి
నిశ్చలతమదృష్టినె యుందు ♦ నిశ్చలోత్త
రముఖదిక్సూచీ కంట ♦ కమునుబోలె.

కో : (తనలో) అనురాగపూర్ణ మగు మాటలు నాడుచున్నాఁడు.

భ్ర : అమ్మా! వసంతుని యనురాగమహిమ మెట్టిదో చూచితివా ?

మో : (తనలో)

గీ. వనితయఁట; దూరగతయైన ♦ బాధగలుగ
దఁట ! వలచితి ననఁగఁ జాలు ♦ నట! ముదమట !
దవ్వునుండి యన్నము నివే ♦ దనముఁ జేయ
నాఁకలి శమించు బ్రబలవే ♦ దాంతి యితఁడు.

గీ. మహితవస్త్వాళి విషయసం ♦ పర్క మొంద
వలయు, ననుభవమున శాంతిఁ ♦ బడయవలయు,
నింద్రియోద్ధతి యురక శాం ♦ తించునె ? యిలు
గాల నాఁకునే? స్వస్తివా ♦ క్యములచేత.

వసం : కోకిలా! ఊరకుంటివి. ఆ మాటలు నీవు నాతో ననుటకు నీకు లజ్జయైన నీ చెలితోఁ జెప్పుము.

భ్ర : పైకిఁ బలుకుటకుగూడ నీ కంగీకారము లేనియెడల నాచెవిలోఁ జెప్పుము ఏదీ? ఏదీ? (తనమోమును గోకిలమోమునొద్ద నుంచును.)

మో : (తనలో) పశ్చైరముననుండు సాలగ్రామతీర్థమును మొదట గిండిలోఁ బోసి, తరువాత భక్తునినోటఁ బోసినట్లు కోకిలా! నీమాటలను మొదట భ్రమరిక కిచ్చి దానిగుండ నీ వీతని కర్పింపుము.

భ్ర : ఏదీ? నా చెవి నీ వదనముయొద్ద నుంచితిని. ఊఁ!

వసం : ప్రియురాలా! సందేహింపకుము.

గీ. నవ్వ్ర కేగంటు నలరఁ గం ♦ ధర యిటింత
చాఁపి, యెడమచే సకియ బు ♦ జమున నునిచి
యోష్ఠచలనంబు బుగ్గల ♦ నొందకుండ,
నా యొడలు జల్లుమనఁ బల్కు ♦ నాతిచెవిని.

భ్ర : ఏదీ? ఊఁ!

మో : (తనలో) ఆహా! ఏమి విలాసయుతముగ నున్నది!

ఆ. వె. చేటిచెవినిఁ గల్గు ♦ చెంగల్వ కోకిలా
స్యమున వ్రాలె; నాకె ♦ యట్టి జనన
మున్న నిట్టులిట్టు ♦ లెన్నొముద్దులు గొని
యెనఁగియుందు నడవి ♦ యేడ్పుమాని.

భ్ర : సఖీ! నీవు నాపైఁ జేపై వకపోయినను నీ నాథుని యభిప్రాయమది కావున నీ కరమును నా భుజముపై వేసికొందును.

(అట్లు చేయుచున్నది)

వసం : అటులేని సఖీ! హృద్గతాభిప్రాయమునుగూడ నీ చెవిని పైచుకొనవలయును.

కో : భ్రమరికా! నీకుఁ బిచ్చియా యేమి ?

మో : (తనలో) ఇట్టి యస్వతంత్రుఁడైనవానిని వలచినందులకుఁ బిచ్చి నీకు: తన స్థితి గతుల నెఱుఁగక యాకాశనదీగతాంభోజ పరీమళమునకు ముక్కుపుటము లుప్పరమున కుంచి వేచియుండుటకుఁ బిచ్చి వసంతునకుఁగాక, నడుమ భ్రమరికకుఁ బిచ్చి యేమి ?

కో : వసంతా! నీ వను మాటలు నేను నీతో బిగ్గరగఁ బలుక నా కిష్టము లేదు; వానిని నా సఖీ కర్ణమున నిమ్మళముగ వచింప నీకు వినఁబడవుకదా! అంటి ననియే భావింపలేవా ?

వసం : మహాప్రసాదము. అంటివి కదా!

కో : అనుకొంటిని—అటుమీఁద ?

మో : అటుమీఁద నింకేమున్నది? కారాగృహమం దుండియు, శయన గృహమున నీతో హంసతూలికాతల్పమం దున్నట్లు భావించుకొనుము. ఒక ఇనుప జాల కట్టును గౌఁగిలించుకొని నిన్ను గాఢముగఁ బరిరంభమును జేసికొనినట్లు భావించుము. ఆజ్ఞబాలురు కట్టెముక్కను గాళ్ళనడుమ నిడుకొని కాళ్ళవిరుగఁ బరుగెత్తుచు మహావేగ పరిధావదశ్వారోహణామితానందానుభవమున నుప్పొంగుట లేదా! ఉన్మత్తుఁడు చిల్లపెంకులను ఏనుఁగుల గుడ్డను మూటఁగట్టుకొని తన్నాశ్రయించుటకు వచ్చిన మహాపండితు లందఱకును బంగారునాణెములు పెదఁజల్లుచుండ వారందఱు తన త్యాగపరాయణత కుత్కంఠులై స్తోత్రముల సేయఁ దాను మోదాతిశయమున శిరఃకంపము సేయుచుండుటలేదా! ఇది గాక తనప్రక్కనున్న చిలుముగొట్టమును దన సహధర్మచారిణి యని దాని ముద్దుఁగొని మతిగల సంసారికిలేని సరస సంసార సౌఖ్యానుభూతిని సంతసించుట లేదా! ఇట్టిదే నీబ్రతుకుగూడను. భావనాసంభాషణములకు, భావనా పరిరంభమునకు, భావనాభోగములకు నీ ప్రార్థనలేల? ఈ దైన్యము లేల? ఈ బాధలేల?

వసం : తరువాత నేమో చెప్పనా ?

కో : కానిమ్ము.

వసం : కొంచె మిటు రమ్ము.

మో : (తనలో) ఎందులకో ! వచ్చిన దనుకొనుము.

కో : ఎందులకు ?

వసం : ఒక్క చిన్నసంగతిని జెప్పుటకు.

మో : (తనలో) హే! హే! ఓ భావనామమా! చెప్పితి ననుకొనరాదా?

గీ. సత్య మగు నీ జగం బంత ♦ సర్వమిథ్య
యనుచు నద్వైతమతము బో ♦ ధనము సేయు
భావనవిపరీతాద్వైత ♦ భావ యగు న
సత్య మంత సత్యంబుగా ♦ సంగ్రహించు.

భ్ర : సఖీ! అతనిని గొంచెము సమీపింపుము.

కో : వసంతా! నే నిక్కడనే యుందును. నీవు చెప్పఁదలఁచుకొనిన దేదియో చెప్పుము. నే నక్కడ కేల రావలయును? అక్కడఁ గ్రొత్తవా రెవ్వరున్నారు?

మో : (తనలో) నేను లేనా? నే ననేక పర్యాయములు నిన్నుఁజూచి యుండుట చేత నీవు నాకుఁ గ్రొత్తకాదు. కాని నేను మాత్రము నీ కిప్పటికిఁ గ్రొత్త. ఇఁక ముందు ప్రాత గావలసియున్నది.

వసం : ఎందులకుఁ ఖిలిచితినో యొకసారి యనుగ్రహించి యిటురమ్ము.

భ్ర : మెచ్చు. నీ మన సాతనికిఁ దెలిపితివి. అతని మనసు నీ విదివరకే గ్రహించితివి ఇఁక నాతో నీకుఁగాని, యాతనికిఁగాని పని యేమున్నది? చత్వారపు గంటికి జోటిని దగిల్చిన పిమ్మటఁ దగిల్చిన చేతితోఁ గంటికిఁగాని జోటికిఁగాని పని యేమున్నది?

మో : (తనలో) ఊడఁదీయునప్పుడు పనియున్నది కాదా? అప్పు డీ జోటిని నా ముక్కునకుఁ దగిలింపవలదా?

కో : ఏమి భ్రమరికా? నీ కిట్లనుట తగునా?

భ్ర : ఇది తగునో తగదో నే నెఱుఁగనుగాని యాతఁడు రమ్మని పిలుచుచుండ నీ విచ్చటనే యుంట మాత్రము తగదు.

వసం: భ్రమరికా! ఏమిమాట లాడుచుంటివి? నేను నా ప్రియురాలినిరమ్మని పిలువఁగ నీవు దానిని దీసికొని రమ్మని నా యభిప్రాయమని నీ వెఱుఁగవా? నేను నిన్ను వదలుకొనుట కింతలోఁ నాకుఁ గలిగిన మహావైభవ మేమి?

మో : (తనలో) ఇంతలోనే కాదు ఎప్పటికి నింతే.

వసం : గీ. అభిమతవిహారయోగ్య లౌ ♦ నట్టివారె
ప్రియుల కొఱకుఁ దచ్చేటికా ♦ బృందమునకె
ప్రాణములైన నర్పింప ♦ వలసియుండ,
బద్ధుఁడను నిన్ను నేనెట్లు ♦ వదలగలను.

కావున, భ్రమరికా! అలుకమాని నా కాంతను నాయెడ ననుగ్రహవతిగఁ జేసి నన్ను ధన్యుని జేయుము.

మో : (తనలో) ఈ విచిత్ర చరిత్రములో భ్రమరికా కోపోపసంహార మనునది యొక్క యుపాఖ్యానము!

కో : భ్రమరికా! నీకుఁ గోపము తీరినదా?

భ్ర : నాకుఁ గోపము తీరినది. నీకు సిగ్గును గొంత తీరినది. రమ్ము అతనియొద్దకుఁ బోవుదము. (చేయిపట్టుకొని లాగును.)

మో : (తనలో) ఆఁ! భ్రమరికా! ఎంత సాహసము! ఇంతవరకుఁ గోకిలావసంతుల కన్యోన్య సంభాషణ శ్రవణానందము మాత్రమే యనుభవించితిని. ఇప్పుడు నీవు వారి కంతకంటె నానంద మీయఁదలఁచితివా?

గీ. వలపు లేనిచోటనయిన ♦ లలనలకును
వలపుఁ గలిగించు జాణ వీ ♦ వౌనిన లహా!
వలపుగలయెడ సంధాన ♦ పాటవప్ర
శస్తరచనకు వీరి కా ♦ శ్చర్య మేమి?

భ్ర : రావేమి? (లాగుచున్నది.)

కో : (తనలో) ఈ మహానుభావునియొద్దకు నన్నాకర్షించుచున్నది భ్రమరికయే కాదు. నా ప్రేమముగూడను. నే నిప్పు డేమిచేయుదును? (ప్రకాశముగ) సఖీ! నన్ను లాగుటచేత నా కరము నొప్పుచున్నది. వదులుము.

భ్ర ; నేను లాగుటచేత నొప్పుటలేదు. నేను ముందునకు లాగ నీవు వెనుకకు లాగుకొనుటచేత నొప్పుచున్నది. నిస్సందేహముగ, నిరంకుశముగ ముందడుగు వైచి యాతని సమీపించినయెడల నీ కరమూ నొవ్వదు. నా కరమూ నొవ్వదు. అతని మనసూ నొవ్వదు రమ్ము. (లాగును.)

మో : (తనలో) నా ప్రాణములు నొప్పునుగదా!

కో : అబ్బ! నొప్పియెత్తుచున్నదనఁగ వదలఁగూడదా?

భ్ర : పోనీ! ఈ యెడమచేతిని వదలి కుడిచేతిని గ్రహింతును.

వసం : వలదు; భ్రమరికా! నీ వామె కుడిచేయి నంటవలదు. అది నా కర్హమైనది.

గీ. బ్రహ్మహీరాంగుళీయక ♦ ప్రాంచితంబు
నవరసాలక్తిసాలారు ♦ ణంబు మంజు
కంకణోపేత మల్పఘు ♦ ర్మాంకమైన
దానికుడిచేయి నాపాలి ♦ ధనముగాదె !

మో : (తనలో) స్వప్నధనము.

కో : (తనలో) ఒడ లుప్పొంగుచున్నది. (ప్రకాశముగ) అబ్బ! వెనుక కాలిపై నేమో ప్రాఁకుచున్నది.

(తొందరగ నొక్క యడుగు ముందున కిడును.)

భ్ర : వెనుకవైపునఁ గాలిని త్రాఁచుట గావున్నా! ముందువైపున మనసు పీఁకుచున్నది.

మో : (తనలో) ఆహా! ఈ కాంత యెంత విలాసవతి!

గీ. వెడఁద కనులు బెదరి యట్టె ♦ వెనుకఁ జూచు
సందడిని పైఁటజాఱఁ గాల్ ♦ తొందరగను
దులుప నందెలు మ్రోయ గు ♦ బ్బలు వడంక
నటివలె శ్రవణాక్షియుగళా ♦ నంద మొసఁగు.

భ్రమరికా! నీవు దీనిని గాంతుని యొద్దకుఁ బ్రోత్సాహవఱచుచుంటివని యింతకు ముందు నిన్ను దూషించితిని. నేను పొరపడితిని. క్షమింపుము. నీవు దాని నిప్పుడు లాగుటయే నాకు క్షేమకరమయ్యెను.

గీ. ఇట్టె యీతని జేరుట ♦ కెగయు నున్న
దీని లాగుటచేతనే ♦ దీనినడక
తొందర యడంగె నినుమంత; ♦ దొంగగొడ్డు
దాఁటులు గుదియచే గొంత ♦ తగ్గినట్లు.

అయిన నే నెంత నిర్భాగ్యుడను!

గీ. కనఁబడకయుండ పీరి దు ♦ ష్కార్యచయము
నిచట నిల్చి యాఁపఁగ శక్తి ♦ నెనయక శ్రమ
మున గణింపవలసెఁ, బ్రాణ ♦ లొనరఁజేయు
కుటిలకృతుల వ్రాసెడు చిత్ర ♦ గుప్తులట్లు.

వసం: కోకిలా! నేత్రపర్వముగ నొక్కయడుగు ముందునకు వైచితివి! అడుగున కొక్క ప్రాణము నాకు లేచి వచ్చుచున్నట్లున్నది.

మో : (తనలో) నా కొక్క ప్రాణము గతించుచున్నట్లున్నది.

భ్ర : సఖీ! నీవును, నేనును సమవయస్కుల మగుటచే నీవు చిన్నతనములో విద్దెముల జేయుచుండఁ జూచు వేడుక నాకు లభించకపోయెను. కాని, యా లోపము నాకు లేకుండ నీ విప్పుడు నన్నానంద పెట్టుచున్నావు. ఏదీ! ఏదీ! ఇంకొక్క తప్పటడుగు ఏదీ?

కో : చాలు! చాలు! నీ వెంత గడుసుదానవు! నేను వెనుకకుఁ బోఁదలఁచినఁ బోనీయకుండ నాఁపితివి. ఆఁగియున్న నాఁగు టేల? యని ముందునకు లాగితివి. ముందునకుఁ బోవుచున్న విద్దెముల జేయుచుంటినని యధిక్షేపించితివి. నన్నింక నేమిచేయు మంటివి? (కారాగృహము నొద్దకుఁ బోవును.)

భ్ర : ఇందుకొఱకే నేను నిన్ను బలవంత పెట్టుటయు. నీ నాథుఁడు ప్రార్థించుట యును. అహ్యా! నీ పైకము నీకిచ్చి ఋణము తీర్చుకొంటిని.

వసం: భ్రమరికా! నీవు నా కింక నెంత మహోపకృతిఁ జేయవలసి యున్నదో యెఱుఁగుదువా?

మో : (తనలో) వర్ష్ద్రక్రింక భ్రమరిక నపేక్షించుచున్నాఁడా యేమి? హా! కోకిలా! నంగ నాచిపై యింతవఱకుఁ దెగసాఁగి టిట్టిబిగిసి యిప్పు డిట్టె బుడుగు బుడుగున నీతని పాపములఁ బడుటకు వచ్చితివా?

ఆ. వె. మనుజుఁడధముఁడైన ♦ ధనహీనుఁ డైనఁ గు
రూపుఁ డైన దుష్ట ♦ రోగుఁడైనఁ
బిఱికిపందయైన వెలఁదికి ♦ నచ్చిన
నతఁడె గురుఁడు మరుఁడు ♦ నతఁడె వరుఁడు

గీ. పాత్రదానంబు సేయని ♦ ప్రభుని జనులు
తిట్టుదురు; దైవమా! యీతఁ ♦ డెట్టిపాత్ర
మనుఁచు గోకిల నిచ్చితి! ♦ కనులఁబడవు
కాని ని న్నేమి చేసినఁ ♦ గలదె తప్పు?

హా! వసంతా! మహాదృష్టశాలివి గదా! నీ సౌఖ్యమును నా పాపపు నేత్రములతోఁ జూడవలసి వచ్చెను.

వసం : గీ. ఘనతరానంద మాకస్మి ♦ కముగ మృదుల
హృదయమును జేర నతిశోక ♦ మెనసినట్లు
చిత్తము తపించు, జడతను ♦ జెందుఁ జంద్ర
కలిత మగు కన్ను మండి నీ ♦ ర్గ్రమ్ముఁగాదె!

కావునఁ గోకిలా! ఇంతసేపటి నుండియు మాటలాడలేకుంటిని, క్షమింపుము.

మో : (తనలో) ఇంతసేపటినుండి దేవులాడుచుండియు నాకస్మిక మోదమేమిటో! మృదుల హృదయమని యాత్మస్తుతిఁగూడఁ జేసికొనుచున్నాఁడు. ఇతని హృదయమున కాఠిన్యజడిమ గాని యానందజడిమ గాదు.

వసం: గోకిలా! నీ కింత కాలమునకుఁగదా నాయందు దయ గలిగినది! నీ విప్పటికిఁగదా, నా కత్యంత సన్నిహితబంధు వైతివి!

మో : (తనలో) ఇప్పటికి మాత్ర మత్యంత సన్నిహితత్వ మెచ్చటిది! ఓ కారాగృహో యనస్తంభములారా! అస్మదీయ ప్రాణరక్షక దేవతలారా!

గీ నాదుప్రార్థన మీరు క ♦ ర్ణముల నిడుఁడుఁ
మిడుతు మిడుతని వట్టిచూ ♦ పులకు మాత్ర
మంతరం బీయవలె వీరి ♦ కంతెకాని
చేయి చేయియుఁ గలియఁగాఁ ♦ జేయకుండి.

ఓ వసంతా!

గీ. ఉవిద దరిఁజేరె నని పొంగు ♦ చుంటి వేమొ?
ఇప్పు డేమి చేసెదవో వీ ♦ క్షింతుఁగాక!
బిట్టుకౌఁగిలి కందని ♦ యట్టిదూర
మంగుళంబైన యోజననా ♦ యతముగాదె!

భ్ర : మహానుభావా! మా చెలిని మీరు దయతోఁ బరిగ్రహింపవలయు.

వ : విపరీతముగఁ బలుకుచుంటి వేమి? నన్ను మీ చెలి దయతోఁ బరిగ్రహింప వలయునని నా ప్రార్థనము.

భ్ర : బాగుగనే పలికితివి! అయినను, ఎన్ని బింకములైన, నెన్ని పట్టుదలమాట లైన, నెన్ని గుర్వోక్తులైన, నెన్ని ధిక్కృతులైన, నెన్ని యధిక్షేపణము లైన, నెన్ని నిర్లక్ష్యతలైనఁ గాంతలు పురుషులకు మనసీయకున్నంతవఱకె: ఇచ్చిన యుత్తర క్షణమునఁ దూలముకంటె లఘుతరలై, యతిదీనలై, పరివర్జిత సర్వస్వాతంత్ర్యలై సర్వథా కింకరగణమై—

మో : (తనలో) యమకింకరగణమై-

భ్ర : పాదపరాగలేశాశలై యుండుటఁ దఱచుగ నాచారమై యున్నదికదా!

వ : ఎట్టి కఠినోక్తులు పలికితివి! ఈమె మహారాజపుత్రిక. నేను దత్త్వామంత రాజపుత్రుఁడను. నే నెప్పుడీమెకు విధేయుండనై యుండవలసినవాఁడనేకదా! ఆ మాట యటుంచుము. ఇదేమి? పురుషుని కర్తమైన యాధిక్యమును స్త్రీ కసంబద్ధమైన నైచ్యము నారోపించితివి! సృష్టిలో స్త్రీకిఁ బురుషునకు భేద మేమున్నది? స్త్రీకంటెఁ బురుషుఁ డధికుఁ డెట్లగును?

మో : (తనలో) మాయకంటె బ్రహ్మ మధిక మైనట్లు.

వసం : గీ. సహజముగ మగవాఁడు పా ♦ షాణహృదయుఁ
డబ్జలోచనాసాహచ ♦ ర్యమునఁ గాని
వానిహృదయము మృదులత ♦ వడయ, దమృత
కరకరస్పర్శ రహితాబ్జ ♦ కాంతమట్లు.

గీ. మగలమనుసుల మృదురీతిఁ ♦ దగనిపనుల
నుండి మఱలించి సుగుణంబు ♦ లొదవఁ జేసి
వారి శుభదేవతలుగాఁగ ♦ వరలుచుండు
కొమ్మలను నెత్తిపైఁ బెట్టు ♦ కొనుట తగదె?

గీ. ప్రబలసత్యావనాది శుం ♦ భద్గుణాళి
కమితయశ మొందు పూర్వర ♦ సాధినాథు
లందఱును స్త్రీలమహిమచే ♦ సట్టులైరి
చంద్రమతి గలుగని హరి ♦ శ్చంద్రుఁ డెంత?

గీ. మగలకీర్తియు, విత్తము, ♦ మనసు, దేహ,
మసుపు, లాత్మయు స్త్రీలవై ♦ యలరుచుండు
వారి వీ రేలవలయునో? ♦ వీరి నేల
వలయు వారొ? యెవ్వరు చెప్ప ♦ వలయు నింక!

మో : (తనలో) ఆహా! విచిత్రోపన్యాసము. ఆఁడుది పురుషునకు విధేయమై యున్నఁ బురుషునికి ఘనతయుఁ, ద్వ్యతిరేకమైయున్న నీచతయు నెంతమైన నున్నవి!

గీ. పడఁతి వెలలేని దీశు స ♦ వ్యస్థయైన
దశగుణాధికుఁగాఁ జేయుఁ, ♦ దద్విధాన్య
యైన శతగుణాధమునిగా ♦ నాచరించు,
నొకటి ముందు, వెనుక సున్న ♦ యున్నయట్లు.

వసం: ఇది గాక—

గీ. వరస సహధర్మచారిణీ ♦ సాహచర్య
సంపదయె లేక పురుషుఁడు ♦ సత్క్రియాచ
రణ మెటులు కాంచు, జ్ఞాన సా ♦ మ్రాజ్యపదవి
యెట్లు లభియించు, భవముఁ ద ♦ రించు టెట్లు?

గీ. తత్ప్రియమలోపకార ని ♦ స్తంద్రభావ
లట్టివారల నే రీతి ♦ నాదరింప
వలయునో చెప్పవలయునె ♦ వస్తుతత్వ
మునను బురుషునికంటెను ♦ ముదిత యధిక.

కోకిలా! నే నదృష్టవంతుఁడనై నా రాష్ట్రమును బొందుట తటస్థపడినను,

గీ. ఉర్విజనులకు ముదమిచ్చి ♦ యున్నతగతి
నుండ నేను, నాపైని నీ ♦ వుండి, నాకు
సౌఖ్యమిడు; భువి నలరించు ♦ చందమామ
కళకుఁ గళనిచ్చు దినమణి ♦ కాంతిఁబోలె.

మో : (తనలో)

గీ. బ్రతుకు బద్ధత, గొందిలో ♦ పల సతంబు;
పలుకు లవిచూడ రాజ్యంబు ♦ లిలయుఁ జంద్ర
తరణి మండలములు గూడ ♦ దాఁకె; వ్యర్థ
నాశలకుఁ జోటుగలదె బ్ర ♦ హ్మాండమందు?

కో : వసంతా! రాష్ట్రమును బొందఁగలనను ధైర్యము నీ కున్నదా?

వ : మన బుద్ధు లెంత! మన ప్రయత్నము లెంత! మన ధైర్యము లెంత! బద్ధుఁడ నైన నేను నీ కొఱ కేమి ప్రయత్న మొనర్చితిని? నే నే మంత యున్నత ధైర్యుండనై యుంటినని యీ యంపరాని కొమ్మ నాచేతి కిట్టె యందినది!

(కోకిల కుడిచేయిని యినుప స్తంభములగుండ గ్రహించును.)

మో : (తనలో) ఆహా! ప్రమాదము సంభవించినది. ఈతఁడు కోకిలాహస్తము నయోమయశలాకల మధ్యమునుండి లాగి గ్రహించినాడు. ఆహా! ఇది యెంత టక్కులాఁడితనముఁ గనబఱచుచున్నది.

గీ. మొగ మెడమ కిట్టె త్రిప్ప జా ♦ ర్ముడి కుడిబుజ
మునను వ్రేల శ్రవణపుష్ప ♦ ములు నటింప
నెడమచేతను గుడిచేతి ♦ నొడిసి లాగు
కొనుమిషమున ముందునకె తాఁ ♦ జొనుపుచుండె.

హా! నే నెట్టి మందభాగ్యుడను! నా కర్హమైన యానందమును వేఱొక్కఁ డనుభవింప గ్రుడ్లు మిడుకరించుకొనుచుఁ జూడవలసి వచ్చెను. హా! ప్రారబ్ధము. కోకిలా!

గీ. నీకరం బాతఁ డదుముఁగ ♦ నీవు నతఁడు
మోదభూమోదయమున ను ♦ ప్పొంగుచుంద్రు,
మీదు చేతులే కవగూడి ♦ నాదు గొంతు
నొక్కినట్లుండు నుక్కిరి ♦ బిక్కి రగుదు.

వ : కోకిలా! నావంటి మందభాగ్యుని గోరుటచే నీ హస్తమున కింతవఱకుఁగారాగార ప్రవేశయోగము తటస్థించెను.

కో : (తనలో) ఇప్పటివఱకు నా దేహమున ధన్యమ్మైన భాగ మదియే.

వ : క్రూరములైన యాయసస్తంభముల నిరోధమున నీ చెక్కుల ముద్దుఁగొనజాలను. ఈ చేతినే చుంబింతును. క్షమింపుము. (అట్లు చేయును.)

మో : (తనలో) హా! అదృష్టదేవతా! ఎంత విపరీతచర్యఁ గలదానవు.

వ : మంగళరేఖాకలితమైన నీ పాణిపుండరీకమును గ్రహించుటకు నే నెంత తగనివాఁడనయ్యు నఘటనా ఘటనాచాతుర్యుఁడైన పరమాత్ముని యాజ్ఞ యిటులున్నది. ఇదియే పాణిగ్రహణ మంగళ మహోత్సవము. (చేతిని హృదయమున నుంచుకొని)

గీ. హృదయమ! శమించు మీవు వ ♦ రించుదాని
పాణిచే హాయిగా స్పృశిం ♦ పంగఁ బడితి!
ఏది లభియింపరానిది ♦ యెంచినావొ
యదియె నీపాలిదైవమై ♦ యాదుకొనియె.

కో : (తనలో) ఆనందముచే నవశత నొందుచుంటిని.

భ్ర : కోకిలా! మీ యిద్దరి సమాగమము నాకు సంతోష మిచ్చుటకు మాఱుగ దుఃఖ మొసంగుచున్నది.

మో : (తనలో) భ్రమరికా! పీతి యనుబంధ మింతమట్టుకైన నేల వచ్చిన దని నే నేడ్చుచున్నాను. ఇంతకంటెను హెచ్చుట కవకాశము లేకపోయె నని నీ వేడ్చుచున్నావా?

వ : పెఱ్ఱిదానా! దైవాభిసంధి యిప్పటి కింతయే. ఎక్కడ కక్కడకే సంతోషింపవలయును. ఈ మాత్రమైన లభించునని నే ననుకొంటినా?

మో : (తనలో) కాకేమి? దొంగకు దొఱికినంతతోడనే తృప్తి.

భ్ర : మీ రిద్దఱు వేఱువేఱుగ—

వ : మీరు—ఇద్దఱు—వేఱు—అని చెప్పకుము.

గీ. ఏ మొకటియె, యీ యడ్డుచే ♦ నిద్దఱముగ
దోచుచున్నార; మడ్డు పోఁ ♦ ద్రోయ వస్తు
వొక్కటియె; ద్వంద్వవిభ్రాంతి ♦ నొసంగుమాయ
మాయమైన నున్నదొక బ్ర ♦ హ్మంబుగాదె!

మో : (తనలో) హా హా! ఎన్నిరసములు! శృంగారములో వేదాంతము! అమితాశలో సంతుష్టి! స్త్రీ వాంఛలో నింద్రియ నిగ్రహము.

కో : వసంతా!

భ్ర : అమ్మా! ఇఁక నాథా యని పిలువ వచ్చును.

కో : ఈ కారాబంధ విముక్తి నీ కెట్లు కలుగునని యున్నది.

వసం: దైవసాహాయ్యముచేత—

కో : నా కొక్క యాలోచనము తోఁచినది. చెప్పనా?

వసం: అభ్యంతర మేమి?

మో : (తనలో) అదేదియో సావధానముగ వినివలయును.

కో : రాజార్భకుఁడవు నుదారగుణుఁడవు నగు నీకీ బంధము తగదని నీబంధవిమోచనమునకై నేనిదివరకే యాలోచించితిని. ఒక త్రాటినిచ్చెనఁ జేయించియుంచితిని అది యొకకొనను దక్షిణపు దిశనున్న గవాక్షమునకుఁ గట్టి, రెండవది యీ నీ పవృక్షశాఖకు గట్టవలయును. దానిమీఁదుగ నీ వవలీలఁగ వెలుపలికి రావచ్చును. దానిని వేపు నీకుఁ బంపెదను. దాని రెండవకొనను జెట్టునకు నేను గట్టింతును.

వసం: కోకిలా! నే నొక్కఁడనే పోవలసినదా?

కో : బంధవిముక్తి నీకుఁగాక నాకేమి?

వసం: ఆబంధ విముక్తితో నాకీ బంధవిముక్తి కూడనా? అటులైన నాకుఁ గారామోచనము వలదు. నీవుకూడ నాతో నా రాష్ట్రమునకు వచ్చునెడలఁ గలిసి పోవుదము నీకెప్పు డవకాశముండునో నాకుఁ దెలియఁజేసిన నేనప్పుడా త్రాటి నిచ్చెన నుపయోగించెదను. కోకిలా! దయయుంచి రమ్ము. వచ్చెదవా? మాటలాడవేమి? భ్రమరికా! నీవు దాని "నూ" యనిపింపవా?

భ్ర : ఒక రనిపించక్కరలేదు. తా నన నక్కఱలేదు. అనినట్లే. నేనందులకుఁ బూఁటగా నుందును.

మో : (తనలో) హా! వినఁదగిన మాటలు వినఁబడినవి. కోకిలా! నిన్నెట్లు స్వాధీనగఁ జేసికొందునని యింతవఱకుఁ దపించుచుంటిని. ఇఁక నీ జుట్టు నాచేతఁ జిక్కినది. వసంతుఁ డేమో మాటలాడఁబోవునట్లున్నాఁడు.

వసం: ఏమి? కోకిలా! అంగీకరించినట్లేనా?

కో : భ్రమరికా! నీవుఁగూడ వచ్చెదవా?

వసం: సెబాస్!

గీ. కాంత! నీ తండ్రిచే నాకుఁ ♦ గల్గినట్టి
బంధ సంక్షోభమింక నీ ♦ వలన శాంతిఁ
బడయుఁ, గర్మముచేఁ గల్గు ♦ బంధబాధ
జ్ఞానకళను బటాపంచ ♦ లైనయట్లు.

మో : (తనలో) ఎవని కర్మమువలనఁ గలిగిన జ్ఞానము వాని బంధమోక్షణమునకుఁ గారణమై యుండఁగ నిట్లనుచున్నాఁడేమి? తనకు నొకనికి భేదములేని యద్వైతము గదా!

భ్ర : అమ్మా! నీ కనురూప యౌవన సంపన్నుఁడగు పతి లభించెను: కనుక నీ వతని రాష్ట్రమునకుఁ బోవుచున్నావు. నాకేమున్నదని రావలసినది?

మో : (తనలో) పర రాష్ట్రమందైన జానికుఁ బతియును, వాయసమున కన్నమును దొరకకపోవునా? నీవుకూడ నడువుము.

కో : భ్రమరికా నీవు రాకతప్పదు. నిన్నువదలి యుండఁగలనా?

భ్ర : నే ననఁదగిన మాటలు మీరనుచున్నారేమి?

కో : సంతోషమే నాథా! ఎల్లుండి రాత్రి యీ సప్తర్షిమండలమా చెట్టుమీఁదికి వచ్చినపుడు నే నీ కడిమిచెట్టు క్రింద నీ కొఱకుఁ గనిపెట్టియుందును. భ్రమరికా! నీవు నాయొద్ద నుండవలదు. గ్రామదేవత యాలయమునకుఁ దూర్పుననుండు తాళవనమున నుండవలయును. నిన్ను మేము గలిసికొందుము. ఏ మార్గమునఁ బోవలయునో మనము తరువాత మాటలాడుకొందము. వసంతా! నాకిప్పటికి సెలవా?

వసం: కాని, దొంగతనమ్మునఁ బాఱిపోవుట నాకు గౌరవహానికాదా?

మో : (తనలో) ఇది యొక రసభేదము. బింకములు పలుకుచున్నాఁడు.

కో : నీ వెఱుఁగకుండ నిన్ను నా తండ్రి యిక్కడి కెట్లు తీసికొనివచ్చెనో, నా తండ్రి యెఱుఁగకుండ నన్ను నీవట్లే తీసికొనిపోవుటలోఁ దప్పులేదు.

వసం: నీ యిష్టానుసార మాచరింపుము.

కో : సరే! నేను పోవలయును.

వసం: వెళ్లెదవా? తిరిగి నీ దర్శన మెప్పుడు?

కో : ఎల్లుండి రాత్రి.

మో : (తనలో) కాదు. పునర్జన్మముననే మో!

వసం: నీ చేతి నొకసారి ముద్దుఁగొందును. దుఃఖమునఁ జిరకాలమునుండి తపించిన నా కన్నుల కమృతాంజన మగునట్లు నీ చేతిని గనుల కద్దుకొందును. (అట్లు చేయును.)

కో : నేను బోయెదను. ఎల్లుండి రాత్రి—

వసం: మఱుతునేమో యని తిరిగి చెప్పుచుంటివా? ఇదివరకు జరిగిన సంవత్సరము లెంత దీర్ఘములో యంతకంటె నీ పరిమితి దీర్ఘతరముగ నుండునుగదా! ఈ రాత్రి-రేపు—రేపు రాత్రి—ఎల్లుండి— ఎల్లుండి రాత్రి—అబ్బ!

మో : (తనలో) ఇదివఱ కమితశాంతము నోర్పును గనఁబఱచిన యాతఁ డిప్పుడు సంభ్రమపడుచున్నాఁడేమి?

కో : ఇదిగో! వెళ్లుచున్నాను. ఇదివఱకే యాలస్యమైనది. నీవుకూడ రా! (భ్రమరిక; కోకిల నిష్క్రమింతురు.)

వసం: హా! ఇంక నా కన్నులకుఁ జీకటియే; పోయి శయనింతును. (నిష్క్రమించును.)

మో : ఆ కడిమిచెట్టు తొఱ్ఱలో దాఁగి యెల్లుండి రాత్రి కోకిల వచ్చు వెంటనే యామెను గ్రహించుకొని పోదును. కాని నేను వలచినది—కాదు. నన్ను వలచినది బుద్ధిమతి యను నొక కన్య గలదు. దానిని వదలిపెట్టి పోయెదను. వదలి పెట్టనేల? నేను గోకిలను గ్రహించి వెడలిన తరువాత నా త్రాటి నిచ్చె నను గదుపుమని దానితోఁ జెప్పెదను. దానిని జూచి చీఁకటిచాటునఁ గోకిల యనుకొని వసంతుఁడు దానితోఁ బోవును. ఇంకను మఱికొన్ని యావశ్యకములైన సంగతులను బుద్ధిమతితోఁ జెప్పవలయును:

గీ. తనదు విద్య నొకనికిచ్చి ♦ తా గ్రహింప
వలె నొకని విద్యయంచు ర ♦ తులుగ నాడు
వనిత నతనికిచ్చి యతని ♦ వనిత నేను
సరస సమ్మోదసరణి ♦ సంగ్రహింతు.

ఈ రీతిగా నాకుఁ బ్రియార్జనమే కాక పీడా విసర్జనముకూడఁ గాఁగలదు. కోకిల కనర్హుఁడైన వసంతునిపైఁ బ్రేమము. నాకుఁ గోకిలపై ననురాగము. నన్నుఁ గోకిల యెఱుఁగదు, బుద్ధిమతికి నాపై ననురాగము. నాకు దానిపై నుదాసీనత. ఆహా! దైవదుర్విపాకదార్ఢ్యము! కాని యేమగునో చూచెదను. ఆలస్యమైనది పోవలయును. ఇదివఱకుఁ గోకిలా వసంత సంబంధమైనది. ఇంకముందుఁ గోకిలా మోహన సంబంధము గావలసి యున్నది.
(నిష్క్రమించుచున్నాఁడు)

శ్రీ

కోకిల

ద్వితీయాంకము

ప్రదేశము : అరణ్యము

(ప్రవేశము - కోకిలా మోహనులు)

కో : ఇది నీకుఁ దగదు.

మో : నీవు తగినపని జేసినపుడుగదా, నీవు న న్నధిక్షేపించవలసినది!

కో : నేను దగనపని నేమి యొనర్చితిని?

మో : అంతఃపురములలో నుండఁదగిన మహారాజపుత్రికవైన నీవీ మహారణ్యమున కేలవచ్చితివి?

కో : నీవు తీసికొని వచ్చుటచేత.

మో : అసత్య మాడుచున్నావు. నేను నిన్ను రమ్మంటినా ?

కో : రమ్మంటి వని నేనుమాత్ర మంటినా? నీవు నన్నుఁ దీసికొని రాలేదా?

మో : నేను నిన్నుఁ దీసికొని వచ్చితినా ? ఈచేయి పట్టుకొని, ఈచేల చెఱఁగు గ్రహించి 'రా' యని తీసికొని వచ్చితినా? తెల్లవారులోపల మన ప్రయాణములో నొక్కమాటయైన నాడితినా? న న్నేల నిందింతువు?

కో : నీవు మోసకాఁడవై మాటలాడకుండ నాము0దేల నడచుచు దారిఁ జూపవలయును?

మో : నీవు వెనుక వచ్చుచుంటివికాన నేను ముందు నడచుచుంటిని. నీకు దారి తెలియదని నేను జూపితిని. ఇది నా దోషమా? కాని, నీవు నావెనుక నేల వచ్చితివి ?

కో : నీవు మంచివాఁడ వనుకొని—

మో : అనఁగ?

కో : నాకిష్టమైనవాఁడ వనుకొని—

మో : ఇష్టుఁడైనవాని ననుసరించుట నీ కెట్లు లుచితమో, నాకిష్టమైన ని న్నాశ్రయించుట నా కట్లు లుచితము కాదా?

కో : నీకు నాపై నిష్టతయుండునేమోకాని నీపై నాకు మనసు లేదని నీ వెఱుగువా?
మో : నీ స్వభావము నే నెఱుఁగనా? ఉన్న నున్నదని చెప్పుదువా?

గీ. ఆఁడువారి కాదనుట కౌ ♦ ననుచు, వలద
నుటకు వలయు ననుచుఁ, బొమ్మ ♦ నుటకు రమ్మ
టంచు, నూహూహూనుట కూఁ ♦ యటంచు నర్ధ
మని యెఱుఁగనె ? స్త్రీమర్మజ్ఞుఁ ♦ డైన నేను.

కో : ఎందులకట్టులు బహుమానించుకొందువు? నేను త్రికరణశుద్ధిగఁ జెప్పుచు న్నాను. ఈ సూర్యనారాయణమూర్తితోఁడు: నాయనురాగము నీపై లేదు.

మో : ఇది న్యాయమా!

కో : కా కేమి?

మో : ఒకఁ డొకనికి ధనమిచ్చినాఁడు. వినుచున్నావా? ధనగ్రాహి యగువాఁడు ధనదాతకుఁ దిరిగి ధన మీయనక్కఱలేదా? మాటలాడ వేమి?

కో : అయిన నేమి?

మో : నా యనురాగము నీకిచ్చితిని గాదా?

కో : నే నిమ్మంటినా?

మో : లేదులే. ఇచ్చితినిగాదా? తిరిగి నీయనురాగము నాకీయ నక్కఱలేదా?

కో : నేఁగోరకుండ నీవిచ్చిన యనురాగ మిదిగో! గిరగిరఁ ద్రిప్పి నీ మొగమున పైచుచున్నాను, పో! మోసకాఁడా! నీదారిని నీవుపో! హా దైవమా! నాగతి! యిట్లు చేసితివా?

మో : అదే మంచిది. అతలఁపే సర్వోత్కృష్టమైనది. నీవు వసంతునితోఁ బోవు టకుఁ యత్నింప నది భగవంతుని కంగీకారము గాక నిన్ను నాతో నిటకుఁ బంపినాఁడు నా యిచ్ఛయు దైవేచ్ఛయు నేకీభవింపని దీవు నేను నేల యేకీభ వింపరాదు?

కో : మూర్ఖుఁడా! వసంతుని సహధర్మచారిణినైన నన్నిట్టిమాట లాడఁదగునా?

మో : హా! హా! పరదారవని సందేహింపు మంటివాఁ ఏమి! అతని సహధర్మ చారిణివా? అబ్బ! నిన్నరాత్రి రెండుయామముల వఱకుఁ గారాబద్ధుఁడైన వానికి ధర్మదార వెటులైతివి?

కో : ఎటులా? పాణిగ్రహణముచేత.

మో : నీకునతనికిఁ బాణిగ్రహణమా? నీచేతిని భ్రమరిక ఎన్నిమారులు గ్రహింప లేదు? దానికి నీవు భార్యవైతివా? పద్మభ్రాంతి నీచేతిపై భ్రమరము వ్రాలిన నది నీకు భర్తయగునా? అటులే—

కో : అటులే యెటులు?

మో : నీచుఁడైన వసంతుఁడు—

కో : రాజబాలకుఁడు నీచుఁ డెట్లగును?

మో : కారాబద్ధుఁడు కాఁడా?

కో : అయిన నేమి? అతని దోషమున నతఁడు బద్ధుఁ డయ్యెనా?

మో ; అతఁడు నిర్దోషుఁడై యుండవచ్చును.

కో : ఉండవచ్చు నన్నసందేహ మేమి? అతఁడు నిశ్చయముగ నిర్దోషుఁడు. సర్వ విద్యాపారంగతుఁ డగు రాజార్భకుఁడు. నేనుఁ బరిశుద్ధనైన కన్యను; రాజ పుత్రికను. 'నీకు నతనికిఁ బాణిగ్రహణమా?' యని యధిక్షేపించితివే! ఇందున దప్పేమియున్నది?

మో : గీ. అతఁడు నీవు నిర్దోషులై ♦ యుండవచ్చుఁ
గాని మీకలయిక దోష ♦ కలితమె య
న పరిమళసారజనకనీ ♦ రానిలములు
గలసి దుర్గంధవస్తువు ♦ గాఁగఁ గావె?

కాని కోకిలా! మీసమాగమము దోషమని నీకుఁ దోఁచకుండిన యెడల నర్ధరాత్రమున నేమి? పుష్పవనముల విహారములేమి? తస్కర సంభాషణము లేమి? జాల కట్టులమధ్యమున నుండి పాణిగ్రహము లేమి? రజ్జునిశ్రేణికా బంధములేమి? పగలు లేదా? కార్తాంతికులగు బ్రాహ్మణులు లేరా! సామ్రా జ్యధురంధరు లగు వరులు లేరా! నివాసమున కంతఃపురములేదా? నిన్నొకని కిచ్చుటకు నీ తండ్రి లేఁడా? మంగళవాద్యములు లేవా? దీపావళీశోభ లేదా? మహాదాశీర్వచనములు లేవా? జీబురని భయంకరమగు చీఁకటిలో గుడ్ల గూబలు తొఱ్ఱలలోఁగూయఁ జీకురువాళ్ళు చెవులుపగుల రొదఁ బెట్ట మీరు కిచకిచలాడుచు నినుపకణికెలగుండఁ జుంబనములా? ఇది తప్పని నీ వెఱుఁగ వేమి? ఎంతముగ్ధవాలవు! మహాసన్నిపాత రోగికి నడుమ నడుమ తెలివి వచ్చిన ట్లప్పుడు వెలుతురు నిచ్చు మిడుఁగురుఁ బురుగుల గముల సాహాయ్య మున మీ విచిత్ర చరిత్ర మంతయు నేను నాలుగు దినముల క్రిందటఁ గని పెట్టలేదా?

కో : హా! వక్రహృదయా! దొంగతనమున నాయుపవనముఁ జేరి, మే మాడుకొనిన మాటలను దొంగతనమున విని, మా సంకేతస్థలమున దొంగతనమునఁ బొంచి యుండి నేను నా ప్రాణనాథుని కొఱకు రాఁగా దొంగ వేషమునఁ నన్ను మోసపుచ్చి దొంగలలో నగ్రగణ్యుఁడైన దొంగవై యుండియు నేను దొంగ

నని దూషించుచుంటివా? నీ వింత తప్పుఁ జేసియు నేఁ దప్పుఁ జేసితినని నన్ను నిందించుచుంటివా?

మో : పోనిమ్ము. నీదియుఁ దప్పే, నాదియుఁ దప్పే. నీదియు దొంగ తనమే నాదియు దొంగతనమే. నేను నిన్ను నిందింపవలదు. నీవు నన్ను దూషింప వలదు.

ఆ. వె. నీదు దొంగతనము ♦ నీ తప్పు, దోషంబు,
నేను జేయువాని ♦ నెరసి యడగె;
నట్టితప్పుఁజేసి ♦ నట్టివారము మన
మేల కూడి శాంతి ♦ నెనయరాదు?

కో : హా! ద్రోహీ! నాకొంప నిట్లు తీసితివా?

మో : కొంపఁ దీయలేదే? అసత్యమాడుచున్నావు. నిన్నొక్క యింటిదానిఁ జేసి నీ కొంప నిలువఁబెట్టి నీ భృత్యుఁడనై నీ సన్నిధిని నే నుండి—

కో : ఇఁకఁ జాలింపుము హా! ఎంతపాపమున కొడిఁగట్టితివి? భార్యాభర్తల నెడఁ బాపితివి కదా!

మో : నే నిక్కడ, నీ వక్కడ నుండఁగ నెడఁబా టేమున్నది? ఈమాత్రపుదూరమే నీ కెడబాటుగఁ దోచునంతటి యనుగ్రహము నీకు నాపై నుండ, నిదిగో సమీపించుచుంటిని.

కో : ఏమి యసంబద్ధప్రలాపములు! నీకు భార్య యెవతె?

మో : ఏమీ! నిన్ను నీవే యెఱుఁగవా?

కో: ఓ యున్మత్తుఁడా! నీకు నేను భార్యనగుదునా?

మో : నా ప్రార్థన మందులకే కద! నేను వలదందునా ?

కో : నోటికి వచ్చినట్లెల్ల వదరెదవు ? నేను నీకు భార్యనగుదునను వెఱ్ఱియాస నీ కెప్పటికైన నున్నదా ?

మో : ఎప్పటికో యన నేల! దైవానుగ్రహ మున్నయెడల నిప్పుడు కాఁగూడదా! నీదయ యున్నయెడల నిప్పుడు కాఁగూడదా! నాయదృష్టి మున్నఁ గాఁగూడదా! అదిగాక నీవు నాకిదివఱకే భార్య వైతివి.

కో : ఛీ! ఛీ! అదెట్లు?

మో : కృష్ణునకు రుక్మిణి భార్యయైనట్లు.

కో : రాక్షస వివాహము చేతనా ?

మో : కా కేమి?

కో : ఇదీ రాక్షసకృత్యమే కాని యిందు రాక్షస వివాహ మేమున్నది? రుక్మిణీ కృష్ణుల కన్యోన్యానురాగము కలదు. తన్ను రాక్షస వివాహమున గ్రహింపుమని రుక్మిణి శ్రీకృష్ణునికి సందేశముఁగూడ బంపెను. అందుచేత కృష్ణుఁ డట్లు చేసెను. ఇక్కడ నే రాక్షస కార్యమెట్లున్నదో చూడు. నీపై నా కనురాగము లేదు. నన్నుఁ దీసికొని పొమ్మని నా నాథుఁడైన వసంతునికి నేను సందేశముఁ బంపితిని. అది నీవు దొంగతనమున విని నా నాథుఁడుండఁ దగిన స్థలమున నిలిచి నీవే నా నాథుఁడ వని—

మో : సెబాస్! కర్ణములు పవిత్రములైనవి. ఏమంటివి ? నీవె నా నాథుఁడ వని.

కో : నేను భ్రమించునట్లు—

మో : భ్రమించునట్లు కాదు. రమించునట్లు—

కో : నటించి—

మో : నటించుట యేమి? మనఃపూర్వక గంభీరానురాగమునకు నటన మేమి? కావున, 'నీవే నా నాథుఁడ వని భ్రమించునట్లు నటించి' యని పలుకుట న్యాయమా? నీవే నా నాథుఁడవై యను సుధామధురాలాపముల వచియింప వలయును.

కో : పరమ నీచుఁడవైన నీ వెక్కడ! అత్యన్త శాంతఃకరణ పవిత్రుఁడగు వసంతుఁ డెక్కడ! నా నాథుండైన వసంతుఁడుగ నీవు కాఁగలవా?

మో : అగుట కేమి? అసాధ్యమా! నీ నాథుఁ డుదార హృదయుఁడే కానిమ్ము. నేను నీచుఁడనే కానిమ్ము అయినను,

గీ. చల్ల చల్లఁగ దరిఁజేరి ♦ చాన నీదు
పతునిస్థానంబు నెపుడు నేఁ ♦ బడసినానొ?
భర్త నపుడె నీ కైతిని; ♦ బంటు ప్రాఁకి
మంత్రిగదిలోని కేగి తా ♦ మంత్రి గాఁడె?

కో : ఓ యవివేకీ! మంత్రికాఁగలడుకాని రాజుకాఁగలఁడా? పతిసతి నిట్లు పరాభవింపవచ్చునా?

మో : నీ కింకఁ బతియే లేనప్పుడు నీవు పరసతి వెట్లగుదువు? నాకు స్వసతియే లేనప్పుడు నీవు పరసతి వెట్లగుదువు? నేను వరుఁడను. నీవు కన్యవు. నిన్నుఁ బరాభవము సేయుటకు నే రాలేదు. పరిరంభమును జేసికొనుటకు— పరాభవించుటకు రాలేదు. అనుభవించుటకు — వింటివా?
(మీఁదిమీఁదికి రాఁగ గోకిల దూరముఁ బోవును.)

కో : ఆఁ! ఆఁ! దూరముగఁ బొమ్ము.

మో : (తనలో)

గీ. పైఁట బిగియించికొని పాణి ♦ పంకజముల
కత్తెఱను గుచాభోగంబుఁ ♦ గప్పి కాంచి
గల్లుమన వెన్క కడు గిడు ♦ కాంతవిభ్ర
మమునుగన దానిపైఁ బడ ♦ మనసుపుట్టు

(ప్రకాశముగా) కోకిలా! ప్రాణప్రియా! దూరముగ నన్నుఁ బొమ్మంటివి కాని, నీవే పోవుచుంటి వేమి?

కో : నీవు పోకపోయిన నేనైనఁ బోవలదా?

మో : ఇది న్యాయమేనా?

కో : సందేహ మేమి?

మో : సరే! కోకిలా! నీవు నన్నుఁ గౌగలించు కొనుము.

కో : వంశ నాశనమగు మాటల నాడకుము.

మో : వంశ నాశనమగు మాటలు కావు. వంశ వృద్ధియగు చేష్టలు. నీవు నన్నుఁ గౌఁగలించుకొనక పోయిన, నేనైన నిన్నుఁ గౌగలించుకొనవలదా? (ముందు నకుఁ బోవును.)

కో : ఆఁ! ఆఁ! బాళిశాధమా! ఇదియేమి?

మో : ఇది నీవు చెప్పిన నీతియేకద! నీవు చేయని పనిని నేను జేయవలయును గాదా? అయిన నేమి? అది నీవు చేసినట్లె.

గీ. అస్వదోష్ఠముద్రను నీదు ♦ నధరపుటము
నందు 'చో' యని నే నంటింప ♦ నట్టిముద్దు
నీదె కాదె! మత్పరిరంభ ♦ నిబిడగాఢ
తా మహత్వము నీదె కాఁ ♦ దా? మృగాక్షి?

(తనలో ఆహా!)

గీ. పసిమి తళతళ లొలికెడు ♦ వనిత వదన
మందు మృదులారుణచ్ఛవి ♦ వ్యక్తమయ్యె;
స్వర్ణముఖి నీరమందునఁ ♦ బ్రతిఫలించు
తరుణరవికాంతి మంజు మం ♦ జరిని పోలె.

ఇట్టి రక్తి నాపై ననురక్తివలనఁ గలిగియుండునా? లేక కోపము వలనఁ గలిగి యుండునా ?

గీ. నత్రపాంగీకృతికిఁ, గోప ♦ జనిత మగు తి
రస్కృతికి నేకలాంఛన ♦ రాజి గలుగు
వరుని కేతత్పరిష దు ♦ ష్కరము, వైద్యు
నకును మృతనాడియును శోష ♦ నాడిఁబోలే.

కో : ఓ మందుఁడా! నీకుఁ బ్రపంచమునఁ గన్యకలే లేకపోయిరా? విలాసినులే లేకపోయిరా! ఇదియేమి పాపము? వసంతుని కర్షనైన నన్ను నీవిట్లు వరించుట న్యాయమా?

మో : (తనలో)

గీ. అచ్ఛమగు నీశ్వరతె లొంగ ♦ నట్టిత్రాచు,
పైనకును బడికాపులు ♦ పడనిబంటు,
నతికి లొంగని మగవాఁడు, ♦ స్తుతికి వశ్య
గాని యాఁడుది యింతముందు ♦ గలుగవలయు.

కావున, నీమెను గొంచెము స్తోత్ర మొనరింతును. (ప్రకాశముగ) కోకిలా! 'ప్రపంచమున నీకు విలాసినులే లేకపోయిరా!' అని యంటివి. అత్యంత లావణ్యవతి యగు నీకిట్టి యనౌద్ధత్య మతీతమైన యాచిత్యమును సూచించుచున్నదికదా!

గీ. ధనముగల చోటఁ, దార్యాగంబు ♦ తఱచు సున్న;
శౌర్య ముండుచోట వివేక ♦ సరణి మిథ్య;
విద్య గలచోట నిలువదు ♦ వినయ మట్లె
గర్వశూన్యత చక్కని ♦ కాంత కరుదు.

ఆ. వె. సుమము లెన్నొ కలవు, ♦ సుమములలోఁ జాల
నందమైనది యరు, ♦ దందులోన
సరసనురభిళములు ♦ మఱి మృగ్యములుగదా!
యటులె నీవు కాంత ♦ లందు భువిని.

కో : ఇఁక జాలింపుము. నా సహన సౌందర్యాదులు నీవు స్తుతి సేయవలదు.

మో : ఉన్నది యున్నట్లే చెప్పఁజాలనే! ఇఁక స్తుతి నెట్లు చేయఁగలను? సృష్టి

మహాపై చిత్రము పలెసఁ గలిగిన యీ సర్వసంపూర్ణ సముద్ధ లక్షణ సమ న్వితావ యవస్ఫురణమునకు వేఱుస్తుతి కావలయునా! స్తుతి సాధ్యమగునా!

గీ. ఒక్కమాదిరియాపాట ♦ కోహో హాలు
తలలు నూపుటలు, సకిలిం ♦ పులు, సెబాసు
లెక్కువగు; మంచిపాటకుఁ ♦ గిక్కురనక
కదల, కొడ లెఱుంగక యుండు ♦ గతియెకాదె?

గీ. మనసు రక్తిచే నిండ ర ♦ సన గదలదు,
ప్రమిద నూనెచే నిండ దీపంబుఁ బోలె;
మన సటులు నిండకున్న ర ♦ సన గదలును
గతుపు నిండని కుక్క తోఁ ♦ కవలె మిగుల.

అదిగాక,

గీ. పూర్ణచంద్రుని మఱియంత ♦ పొంకముగను
వక్రువగఁ జేయఁ దర మానె? ♦ పక్వబింబ
మునకు మృదులత మఱియింత ♦ ముదురుకాని
నొదవఁ జేయుట వెట్టికా ♦ దో? మృగాక్షి.

ఇన్నిమాట లేల? కోకిలా! నేను నిన్ను సంపూర్ణముగ వలచితిని నీవు నన్నుఁ బరిగ్రహింపక తప్పదు.

కో : ఏ మంత మీఁదమీఁదికి వచ్చెదవు? జాగ్రత్త!

మో : జాగ్రత్త యనెదవేల? శపింతువా యేమి? (నవ్వును)

కో : నా కట్టి శక్తి యుండిన మొదల నిన్నీ సరికి రూపుమాపకుందునా?

మో : నీకుఁ బాతివ్రత్యధర్మము తక్కువగుటవలననే నీ కట్టిశక్తి చాలదు.

కో : అనఁగ?

మో : ఒక పతి పేరున కుంటినను నీవు రెండవ పతిని గ్రహింపవచ్చును.

కో : హా! వసంతా! నిన్ను నమ్మికొనిన నా కెట్టిగతి తటస్థించెను?

మో : ఎట్టిగతి తటస్థించెను గాదు! ఎట్టిపతి తటస్థించె ననుము! ఓసీ పెట్టిదానా? అతఁడు క్షత్రియుఁడు, నేనును క్షత్రియుఁడను అతఁడు వసంతుఁడు, నేను మోహ నుండను. నీవు వలచినది పేరు కాదుకదా! అయినను నీ సంతుష్టి కొఱకు నా పేరును విసర్జించి వసంతుఁడను నామమును ధరించితిని. స్వచ్ఛమైన యనురా

గము గల నీవాతని తుచ్ఛమై క్షణభంగురమైన శరీరమును వరించియుండవు కదా ఇఁక దేనిని వరించియుందువు ? నిత్యమైన యాతని యాత్మనేకదా? అట్టిచో నాత్మస్వరూపమునకు భేద మేమున్నది? అతఁడైన నేమి ? నేనైన నేమి ?

కో : ఓ పాపాత్ముఁడా! నీకుఁ దల్లికిని భార్యకును భేదమే లేదా? సోదరికి నిల్లాలికి భేదమే లేదా? ఓ యసందర్భ ప్రలాపా! తుచ్ఛమై, హేయమైన శరీర సౌఖ్యమునకే కానియెడల నీవింత వాంఛ సంభ్రముఁడవై మీఁదిమీఁది కేల వచ్చెదవు ?

మో : నీ వనుమాట నేల కాదనవలయును? నాది స్వచ్ఛమైన యనురాగము కాదు; తుచ్ఛమైన కామము.

గీ. మనసుచేఁ జూచు రాగము; ♦ కనులచేతఁ
జూచుఁ గామ మాలస్య మో ♦ ర్చుకొను నద్ది
యోర్చుకొన దిది; మృదులమౌ ♦ నుష్ణముగల
దది; బుసబుస పొంగి పొగ గ ♦ లది యిదిగద!

గీ. ఆశను భుజియించునది; లల ♦ నాస్థిమాంస
భోజి యిది; రాత్రి నిశ్చల ♦ తేజముగల
దది; పగలు రాత్రి మండెడు ♦ నిది; బిడియము
గౌరవముగల దద్ది; త ♦ ద్దూర మిద్ది.

గీ. ఆపదలనైనఁ జల్లాఱ ♦ నట్టి తేజ
మద్ధి; వర్షార్ద్రఖద్యోత ♦ జాగ్నిఁ బోలె
నాపదలు రాఁగఁ జుంయిమం ♦ చాఱు నిద్ది;
మబ్బు పైఁబడఁ ద్రాటాకు ♦ మంటఁ బోలె.

కో : హా! దైవమా! ఇట్టి సిగ్గుమాలిన దోషస్వభావుఁడు నీసృష్టిలోని వాఁడేనా?

మో : కోకిలా! కామమార్గము దైవానుగ్రహ ప్రతిరోధక మైనది కాదు.

ఆ. వె. శాంతి నెనయకొలఁది ♦ సంవత్సరంబులు
జరుగుకొలఁది రాగ ♦ సరణి హెచ్చుఁ
గాన, రాగయుతుఁడు ♦ జ్ఞానదూరుం డౌచు
నధమగతిని బ్రాఁకు ♦ లాడు నెపుడు.

ఆ. వె. పడుచుఁదనము జారి ♦ వాంఛలన్నియుఁ దీఱి
యంగపటిమ తగ్గి ♦ నప్పుడైనఁ
గామసరణి నీఱు ♦ గాక మానదు గానఁ
గామి జ్ఞానమోక్ష ♦ గామి యగును.

కావున నైహికాముష్మి కాధికారమున నేను వసంతునికంటె నధికుఁడను నా కందులకుఁ దోడ్పడిన నీకుఁ పుణ్యమేకాని పాపములేదు. నేను మదన బాధా పరితప్తుఁడనై యుంటిని త్వరపడు.

కో : మూఢుఁడా! నీవు నన్నిచ్చుటకిఁ తీసికొని వచ్చినందువలన వసంతుఁ డెంత విచారించుచున్నాఁడో! నీవు కామించిన దానిని మఱెవ్వరైన నిట్లు చేసినచో నీ కెంతబాధ యుండునో యాలోచించుకొనలేవా?

మో : ఆ విషయమున నాకెంత మాత్రమును బాధలేదు. నేను వలచిన దొక కన్య గలదు.

కో : పఱుప్రాయుఁడ పైన నీకు వలపుఁగూడనా ?

మో : కాదు. నన్నే యది వలచెను.

ఆ. వె. అట్టిసతి వసంతు ♦ నంకెకు నేఁ దార్చి,
యతనికాంత నిట్టు ♦ లందినాడ;
సతులనైనఁ దార్చి ♦ స్వక్రియాలాభ సం
ప్రాప్తిఁగనుట చిత్ర ♦ రాజనీతి.

కో : ఛీ! సిగ్గుమాలినవాఁడా! ఏమి పనిఁ జేసితివి ! నిన్ను వలచిన కాంత నట్లు త్యజించితివా ?

మో : నా కుపదేశించు జ్ఞానము నీ కేల యుండఁగూడదు? నిన్ను వలచిన నన్నిట్లు నిరాకరించుట నీతికాదు. వసంతుఁ డచ్చట బుద్ధిమతితో సుఖపరవశుఁడై యుండును. మనమిద్దఱ మిచ్చట—(మీఁదికిబోవును.)

కో : (దూరముగఁబోయి) నీవు నన్ను పేక్షించినట్లే వసంతుఁడు నీ కాంత నపేక్షించు ననుకొంటివా? అతఁడెంత బుద్ధిశాలి ! ఎట్టి జ్ఞాన సంపన్నుఁడు! ఎట్టి సుగుణ సమన్వితుఁడు !

మో : అహా! ఏమి మాట లాడుచుంటివి ?

ఆ. వె. ఎట్టి బుద్ధియైన; ♦ నెట్టి పాండితి యైన,
నెట్టి జ్ఞాన మైన, ♦ నెట్టి సుగుణ

మైన నాఁడువారి ♦ యపలోకనాటుగ
ములను దూసిపోక ♦ నిలువఁగలదె?

ఆ. వె. తగినకాలమందుఁ ♦ దగినస్థలంబునఁ
దగినరీతిఁ దగిన ♦ తరుణి తగుల
వ్రేలుకుండలాల ♦ విద్వాంసుఁడైనను
గక్కుఱితిని బడక ♦ కదలిపోఁడు.

కో : ఛీ! నీ దౌర్జన్యమును లోకమున కెల్ల నారోపించుచుంటివా?

మో : నాకు నీవుతప్ప లోకమే లేదు. నావలపును నాయనురాగమును నీ కారోపించు చుంటిని. (కౌగలించుకొనఁబోవును.) నా యోష్ఠపుటమును నీ చెక్కులకుఁ గానుక నిచ్చుచుంటిని. (కోకిల తప్పించుకొనును.) నా శిరమును నీ పాదపంకజాధీనమును జేయుచుంటిని. (సాష్టాంగపడును.)

కో : (తనలో) హా! ఈ నిర్భాగ్యుని మొలలో నున్న కత్తి యిపుడు నా చేతిలో నుండిన యెడల వీనిశిరము ఖండించి నావమానమును గాపాడుకొందును గదా?

మో : ఏమో గొణఁగుకొనుచున్నా వేమి? ఇంకను దయరాదా? (లేచును.)

కో : నీకు మరణ మేరీతి వచ్చునో యని యూహించు చున్నాను.

మో : అటు లడుగుము, చెప్పెదను. నీ పైఁట చెఱఁగు నాచేతి కిమ్ము. అది నా గొంతుకకు బిగియించుకొని లోకానందమూర్తివైన నిన్నుఁ జూచుచుఁ బ్రాణముల విడుతును. (పైఁట గ్రహింపఁబోవును.) పోకు! పోకు! వసంతుని సమాగమము నీ కీ జన్మమునకుఁ గాదు. ఇది మహారణ్యము. నీవు మదధీనవైతివి. నీకు దిక్కెవ్వరును లేరు.

కో : లే కేమి? పరిపాలించు భగవంతుఁడు లేఁడా?

మో : భగవంతుఁడా? ఉన్నాఁడు, ఉన్నాఁ డని మాత్రము రిక్తాశనొందుటకు మన కర్మమే మనల నాడించుచుండ భగవంతునిఁ దలఁచెద వేల? పూర్వ జన్మమున నీవు నన్ను బలాత్కరించితివి. ఆ ఋణముఁ దీర్చుకొనఁగ నే నిప్పుడు నిన్ను బలాత్కరించుచుంటిని. ప్రారబ్ధమున కనుభవమునఁ గాని నాశనములేదు. అంతేకాని భగవంతుఁడేమి చేయును? అతఁడు మనకుఁ గనఁబడునా? కాలికి సహాయ్య మగునా? చేతి కగునా? రమ్మనిన వచ్చునా? పొమ్మనినఁబోవునా? అతఁ డెవతె మానమైన నిట్టి యవస్థలోఁ గాచినట్లు నీవు వినియుంటివా?

కో : శ్రీకృష్ణభగవానుఁడు ద్రౌపదీ మానరక్షణమును జేసి యుండలేదా?

మో : ఆ మాట నిజమగునో కాదో కాని, సుభద్రామానహరణమును జేసినాఁడు. అనేక శతసహస్ర గోపికామాన చోరుఁడైన జారాగ్రేసరుండు కోకిలామాన సంరక్షణ మొనర్చునా? వెఱ్ఱియాసలేల పెట్టుకొందువు? నీవు నన్నంగీకరింపక తప్పదు. ఒక్క నిమసము నాకొక్క యుగంవలె నున్నది. అదిగాక నీకు మాత్ర మేమంత మంచిది? నీ ప్రాయము క్షణక్షణము ముదురుటలేదా?

ఆ. వె. ఉవిద! మాటలాడు ♦ చుండఁ జూచుచు నుండఁ
గానె తెలియకుండఁ ♦ గాంతవయసు
క్రమముగాఁగ జారు ♦ గడియారమందలి
సన్నయిసుకధార ♦ సరణిగాఁక!

ఆ. వె. ఇట్టె మొగ్గపుట్టి ♦ యిట్టె పుష్పంబయి
యట్టె పరిమళంబు ♦ నందె యపుడె
వాడిపోదె? యబల ♦ ప్రాయము నట్టిదే
వృథగ క్షణమునైన ♦ విడువరాదు.

ఏదీ! ఒక్కముద్దిమ్ము! పాణిపద్మము గ్రహింపనిమ్ము. పోనీ! పైఁట చెఱఁగును బట్టనిమ్ము. అబ్బ! అటు పోకు! చెప్పినమాట విను. నీ కెంత మాత్రము నష్టములేదు. నాకు మహాసార్వభౌమత యబ్బినట్లు. ఊఁ! (మీదికిఁ బోవును)

కో : కాఱులు ప్రేలకుము. ఇది నీకు నీతి గాదు. ఒంటరిగ నుంటినని ధైర్యపడుచున్నావు. మీఁదిమీఁదికి వచ్చుచున్నావు. నీ మగతనము నావంటి దిక్కుమాలిన దానిమీఁదనే యుపయోగపడవలసినదా? నీవు తల్లికడుపునఁ బుట్టలేదా? నీకుఁ దోఁబుట్టువులే లేరా? ఎగిరి యెగిరి పడెదవేమి? ఛీ! నీ పౌరుషము మండినట్లే యున్నది. పో! దూరముగఁ బో!

మో : వేఁటయందనేక భయంకరాటవిక మృగములఁ జంపుట పౌరుషముగాదు. బాణానలజ్వాలలకు లక్ష్యపెట్టక, ఫిరంగిగుండ్లకు జంకక యుద్ధములో శత్రుసంహరణ మొనర్చుట పౌరుషముగాదు. ఎంత కోపదృష్టిఁ జూపినను, ఎన్ని తిట్లు తిట్టినను, ఎన్ని కేకలు వేసినను నీవంటి మహాసౌందర్యవతిని, నీవంటి యభిజాత్య సంపన్నను, నీవంటి మహాభిమానవతిన విట్టె బాహుబంధమునఁ జిక్కించుకొనుట పౌరుషము చూడు! చూడు! ఇక్కడ నెవ్వరును లేరు. యీ లతలు చూడలేవు. ఆ నికుంజములు మాటలాడలేవు. ఆవృక్షములు మనకు నీడనిచ్చును. ఈ పుష్పములు శయ్యాసౌఖ్యమిచ్చును. అనుగ్రహింపుము.

కో : సర్వాంతర్యామి యగు పరమాత్ముఁడే మనలఁ జూచుచుండుట లేదా? అతడు

నీపై నాగ్రహింపఁడా ? నీ పాపమును గుర్తెఱుఁగఁడా? నిన్ను నరకమునఁ ద్రోయఁడా? శాశ్వతశిక్షకుఁ బాలుసేయఁడా? ఏల యింత యవివేకి వగుదువు?

మో : ఆ. వె. అనుభవింపఁదగిన ♦ యబల సన్నిధినుండ
గ్రుడ్లు మిడుకరించు ♦ కొనుచు నూర
కుంటకంటె నరక ♦ ముండునే వేరొండు
నితరనరకలోక ♦ మే గణింప.

గీ. మఱుఁగు నూనెను ద్రావుదు ♦ మాధ్వియట్లు;
తప్తశోణాయసోగ్రపు ♦ త్తళికనైనఁ
గౌగలించెద నిట్టుల; ♦ కాని, ముందు
బాధలకు జంకి నిన్ను నే ♦ వదల నిపుడు.

(మీఁదికిఁ బోవును)

కో : (అటునిటు తప్పించుకొనుచు) హా! కృష్ణా! అనాథనాథా! పాంచాలీమాన ధనావనధురీణ! రక్షింపవా! రక్షింపవా! హా వసంతా! ప్రాణనాథా! ఎచ్చట నుంటివోయి? నీ కర్ణానైన నాకిట్టి యపవిత్రత రానైయున్నది. ఓ సూర్య భగవానుఁడా! లోకచక్షుపైన నీ ఘోర కృత్యమును జూచుచుంటివికదా! ఓ మేఘమా! ఆకస్మికముగ నీ వొక్క పిడుగు నాపై రాల్పవా? ఓ నల్లకీవృక్షమా! ఫెళ్ళున నొకసారి విఱిగి నాపైఁ బడరాదా?

మో : పైఁబడఁదలఁచి యింత సేపటినుండి ప్రార్థించుచున్న నన్నుఁజూడక, వానిని ప్రార్థింతువేల? (మీఁదఁ పడబోవును).

కో : (మొగముపై నుమిసి) ఛీ! మూఢుఁడా! ఛీ! శుంఠా! ఛీ! పశువా! నా గొంతుఁ గోయుము. నన్ను ముక్క ముక్కలక్రింద ఖండింపుము. నా ప్రాణము వోయినఁగాని నా మానము నీకుఁ దక్కదు. శూరుఁడవైన మనుజునకే పుట్టిన వాడవైన, నన్ను ఖండింపుము.

మో : ఆఁ! ఆఁ! అదెంత పని? (కత్తిని దూయును.)

కో : సెబాస్! ఇప్పుడు నీవు పురుషుఁడవై ప్రకాశించుచున్నావు. కానీ! సందేహింపకు. ఇదిగో! నాకంఠము నఱుకుము. విను. విను. నీకత్తిమాత్రమే కాని నీగాత్ర మెంతమాత్రమును నాకు దగులఁకూడదు. కానీ! (రెండు చేతులు జోడించుకొని) హా! వసంతా! ఇఁక నీకు నాకు నింతే! హా నారాయణా! దీనరక్షామణీ! హా రామచంద్రప్రభో! హా పార్థసారథీ!

(తెరలో) నాపేరు పార్థసారథి కాదు; విజయసారథి. ఇదిగో వచ్చుచున్నాను.

మో : (కత్తి నొఱలో పైచికొనఁబోయి తొట్రుపాటు నొందును.)

కో : (తనలో) నే నింకఁ బారిపోవుదును. హా! కృష్ణా! హా! వసంతా!

(నిష్క్రమించును.)

(విజయసారథి ప్రవేశించును.)

విజ : (మోహనుని బట్టుకొని) చెలికాఁడా! జగన్నాథా! ఇటురా! నీవు మాత్రమే రమ్ము. భటుల నందఱ నచ్చటనే యుండుమని చెప్పుము.

మో : (తనలో)

గీ. రమణి కోకిల పోయె; గౌ ♦ రవము పోయె;
హృదయమోద మంతయుఁ బోయె; ♦ స్వేచ్ఛ పోయె;
మగువ మానంబు హరియించు ♦ మగని కిపుడు
సర్వహరుఁ డైన మగఁ డొండు ♦ సంభవించె.

(జగన్నాధుడు ప్రవేశించును)

విజ : ఇంతకు ముందు బిగ్గఱగఁ బిలచినవా రెవ్వరు?

జగ : ఇప్పుడు నన్నుఁ బిలిచినది మీరేనండి.

విజ : అబ్బ! నిన్నడుగలేదు. అయ్యా! నన్ను నీవేనా పిలిచితివి?

మో : ఔను. నేనే.

విజ : కాదు. నే నెఱుఁగుదును. నీ వసత్యమాడుచున్నావు. పిరంగిధ్వని యేదో, వింటినారిచప్పు డేదో నే నెఱుగ ననుకొంటివా? హాహాహా! అనేక యుద్ధములలో నవలీలగ జయమొందిన నేను తుపాకి గుండ్లు వర్షింప వడగండ్ల వానలో దిరుగు—

జగ : దున్నపోతువలె—

విజ : మహిషరాజ మనిన నంతకంటె మృదుతరముగ నుండునుగాదా? మహిష రాజమువలె జెరలాడిన నేను—బాణపరంపరలకంటె శీఘ్రతరముగఁ బరువెత్తెడు నేను—

జగ : (తనలో) ఇంటికి—

విజ : ఏమి? జగన్నాథా! ఊరకుందు వేల? అట్టి నేను— స్త్రీ పురుష కంఠభేదమే యెఱుఁగ కుందునా! యోధాగ్రేసరు లసత్యమాడువారు కారు. ఒక రసత్య

మాడిన సహించువారు కారు. ఒకరిని మోసపెట్టువారు కారు. ఒకరిచే మోసపెట్టఁబడువారుకారు. వినుచున్నావా? జగన్నాథా! నిశ్చయమే కదా? కావున నీవు యథార్థమును వచింపవలయును. జాగ్రత్త! నన్నెవ్వరు పిలిచిరి?

మో : నేనే యని చెప్పితినిగాదా?

జ : అయ్యా! దుష్టకి నాసికాపుట ద్వయముగాక శ్వాసరంధ్రద్వయము మఱి యొకటి యున్నట్లీతనికిఁ బురుష కంఠము గాక స్త్రీ కంఠముగూడ నొకటి యున్నదేమో?

వి : హాహాహా! జోడునాళముల తుపాకివలెనా? ఎవతెయో దుఃఖార్తయైనది— ఆపత్పరిరక్షణమును గోరి యాక్రోశించునది—అట్టి కాంత నన్నుచ్చకంఠియై పిలిచినది కాదా? అది యెవతె? చెప్పెదవా లేదా? ఇదిగో! కత్తి. చూచితివా? అనేక సహస్రశిరఃపరికర్తన ప్రవీణము. జాగ్రత్త!

మో : అదియే నా భార్య.

జ : నీ భార్య పిలిచియుండఁగ నేనే పిలిచితినని యేల పలికితివి?

మో : నాకును నా భార్యకును భేదమేమున్నది?

వి : హాహాహా! దంపతులా? దంపతు లనఁగ నెట్టివారనుకొంటివి? జగన్నాథా విల్లును నారియువంటివారు. ఏకగాత్రసహితులు. ఎవరి భార్యను వారు మందలించుకొనిన మనయాక్షేపణ మేమున్నది? సేనాధిపతియైన సతిపై మగనికంటె నెక్కువ యధికారమున్నదా? కాన నీతని విడువ వలసినదే.

జ : అయ్యా! తొందర పడకుఁడు. సతి మగనిసన్నిధి నాపన్నయై యుండునా? మగువకు మగనికంటె సంరక్షకుఁ డెవ్వఁడు? ఆమె భార్యయే యైనయెడల మగని విడిచి యేల పారిపోయి యుండును? కాన భార్యయని యాతఁడు వచించుమాట యనృతము. దేనినో యంకించుకొని వచ్చి యీ మహారణ్యమున బలాత్కరించుటకు యత్నింప నామె దిక్కుమాలినదై మొఱ వెట్టినది. మీరు రాఁగ నా యాపత్తునుండి విడుదలయై బ్రతికినది కావునఁ గాలికొలఁదీ పారిపోయెను.

వి : హాహాహా! బాగుగఁ జెప్పితివి. నేను వచ్చుసరి కీతఁడు తొట్రుపాటుతో నటునిటు పలాయనమై పోవుటకు యత్నించుచు నదివఱకొఱలునుండి పెఱుకఁబడిన కత్తిని దొంపరతో నొఱలో నిముడ్చుచుండెను. మిత్రమా! కాంతాబలత్కార మెప్పుడు కర్తవ్యమో నీ వెఱుఁగుదువా?

జ : అంగీకరింపనప్పుడు.

వి : అది సరిలే. యుద్ధానంతర మది యంత దోషము కాదు. అది మాకును మా భటులకును గొంత యలవాటే. కాని యిది యేమి? ఇప్పుడేమి? బల్లెములు

గోడలఁ బిత్తరులు దీర్చియుండఁ, గట్టి లలంకారములతో యవలగ్న బంధముల వ్రేలాడఁ, దుపాకులు మూఁగలై యుండ, శత్రువుల వదనము లందుఁ విచ్చుకలు గూండ్లుపెట్ట, నిప్పుడేమి? స్త్రీలకు బలాత్కారమే లేమి? ఆఁ! తను పెఱుఁగని తాండవము లైపోయెను. మాటలాడవేమి? నీవేల బలాత్కరించితివి?

జ : బలాత్కరించిన కారణ మేదియో తెలిసియేయున్నది. బలాత్కరించిన ఫల మేదియో యింకఁ దెలియఁదగియున్నది.

వి : ఈతడు మాటలాడఁ డేమి?

జ : ఈతనికిఁ జేఁపకువలె నోరు తెరచి యుంచినయెడల నూపిరియాడక మరణము సంభవించునేమో?

వి : మిత్రమా! ఈతని మన రాజధానిని గారాబద్ధునిఁ జేయవలయును. ఆ చెట్టు క్రింద నిలిచియుండు నిద్దరుభటు లీతని మనపురమునకుఁ గొనిపోవలయును. ఈతని నీవు వారియొద్దకుఁ గొనిపోయి వారికి నొప్పజెప్పుము. సేనాధిపతి యాజ్ఞ యని చెప్పుము.

జ : సరే!

మో : (తనలో)

గీ. సతిని బలవంతముగఁ బట్టు ♦ సాహసించు
నేను బలవంతముగ గ్రహి ♦ యింపఁబడితి,
బంధ మెరబాసిన వసంతుఁ ♦ బాడుసేయఁ
దలఁచి బద్ధుఁడనై పాడు ♦ పడితి నిపుడు.

గీ. మత్కరనిగాఢ బద్ధయౌ ♦ మగువ యబల
యట్టియెగిరిపోయెఁ; బటుదృ ♦ ఢాంగుఁడ నగు
నేను జిక్కితి; భాగ్యంబు ♦ లేనియప్పు
డబల యెవ్వతె? సుబలాఢ్యుఁ ♦ డనఁగ నెవఁడు?

గీ. కాకతూన్యమౌ కాటికిఁ ♦ గొంతఁ దెచ్చి
కవయఁగోరి బద్ధుడనై తిఁ; ♦ గొంతపోయె;
నహహా! దిక్కులేనట్టి న ♦ ట్టడవినైన
సత్యము జయించు; మిథ్య శి ♦ క్షణము నొందు.

జ : విఫలిత మనోరథుండనైతినని యోచించుచుంటివా? చాలు?

గీ. హృదయంబునఁ బుట్టు నన్ని కో ♦ ర్కెలు ఫలింప
నిలువఁ దర మౌనె? యన్ని తేఁ ♦ గలును త్రాళ్ళ
యిన వసుధ గ్రుంకదే? యన్ని ♦ యీళ్ళు పేలు
గాఁ బరిణమింప బ్రదుకంగఁ ♦ గలమె! మనము.

రా! రా! (చేయి పట్టుకొని లాగును.)

వి : ఆ కాంత యెవ్వతెయో పెదకుచు నే నాకొండగోఁగు చెట్లతోపున నుందును. నీ వచ్చట నన్నుఁ గలసికొనుము.

(విజయసారథి నిష్క్రమించును.)

జ : చిత్తము.

(జగన్నాథుఁడు, మోహనుఁడు నిష్క్రమించుచున్నారు.)

(బుద్ధిమతి మఱియొకవైపున దూరమున నుండి ప్రవేశించును.)

బుద్ధిమతి: వసంతా! ఒక్కమాట విని మఱిపొమ్ము.

వ : (ప్రవేశించి)

గీ. ఎటులొ యెవరి మోసముననొ ♦ యీవు, నేనుఁ
గలిసితిమి; నీవు నాకు న ♦ క్కఱకు రావు,
నేను నీ కటులె; బధిరుఁ ♦ డైన ప్రభుఁడు
గర్మగతి గాయకమణియుఁ ♦ గలిసినట్లు.

బు : నన్నింతవరకుఁ దీసికొనివచ్చినవాఁడవు నా మోహనుని నాకుఁ గనఁబఱచి మఱి పొమ్ము.

వ : నీవు కోకిల వని నను భ్రమింపఁజేసినందులకు నా కోకిలను నాకుఁ గనఁబఱచి పుణ్యమేల కట్టుకొనరాదు?

బు : హా! ప్రాణనాథా! మోహనా! హా! లోకమోహనరూపా! ఎచ్చట నుంటివి?

వ : హా! ప్రాణప్రియా! హా! సుగుణరాశీ! హా! కోకిలా! ఎచ్చటికిఁబోయితివి?

గీ. బంధమున నైన నీముఖ ♦ పద్మ మేను
గన్నుల కఱవుదీర సు ♦ ఖమున నుండ;
నాదుప్రారబ్ధ మేమి? హా! ♦ నళిననేత్ర!
నట్టడవిపాలు సేసితి ♦ నన్ను నేఁడు.

బుద్ధిమతీ! మఱియొకసారి యడుగుచుంటిని. నిన్ను మోహనుఁ డెచ్చట నుండు మని చెప్పెను?

బు : నీకు నేను గనబడిన వృక్షము క్రిందనే.

వ : తా నచ్చటికి వచ్చి నిన్నుఁ దీసికొనిపోవుదు నని మోహనుఁడు నీతోఁ జెప్పెనుగాదా?

బు : ఔను.

వ : స్వేచ్ఛాకాముల్యలమైన మాకితర రాష్ట్రములకుఁ బోవలసిన యావశ్యకత గాని, మీకేల?

బు : నే నాప్రశ్న మొనరింప, నాతఁడు మాఱుపలుక కూరకుండెను. ఆతని యాజ్ఞయే మహాభాగ్యమని నే నచ్చట వేచియుంటిని.

వ : (తనలో) మాఱు పలుకకుండెనట! ఆతఁడు మారహస్య ప్రయాణము నెఱిగి నాప్రాణకాంతను సంగ్రహించుకొని పోవుట కిట్లు చేసెనేమో? అట్లు చేసినఁ జేయుఁగాక! తాను వలచిన దీనిని నాకంటఁగట్టి యేల పోవలయును? (ప్రకాశముగ) నిన్ను మోహనుఁ డెంతకాలమునుండి వలచి యుండెను?

బు : నాకు జ్ఞానము వచ్చినప్పటినుండియు.

వ : ఆతని వలపు దృఢమైనది, యథార్థమైనదేనా?

బు : మొదలే యేడ్చుచున్న నన్నిట్టి ప్రశ్న మడిగి మఱింత యేల యేడ్పించెదవు?

వ : ఆతఁడు కోకిల నెప్పుడైనఁ జూచితినని నీతోఁ జెప్పెనా?

బు : లేదు.

వ : నీవు కోకిల నెప్పుడైనఁ జూచితివా?

బు : లేదు.

వ : నీవు నన్నిదివఱ కెన్నడైన జూచితివా?

బు : లేదు. నీవు మోహను నెన్నఁడైనఁ జూచితివా?

వ : లేదు. మనకు జరిగిన పొరపాటే కోకిలామోహనులకును, జరిగి యుండ వచ్చును. నీకు, నాకు మోహనునకు, గోకిల కీ విపత్పరంపరను దెచ్చిపెట్టిన వాఁడను నేనే.

బు : ఏలాగున?

వ : సప్తర్షి మండలము కడిమిచెట్టుపైకి వచ్చునరికి మేడదిగు మని కోకిల నాకాన తిచ్చెను. అప్పటికింకను నన్నుఁ గాపు గాయుభటులు నిదురింపకుండుటచేనేను గొంత యాలస్యముఁ జేయవలసివచ్చెను, అంతలో నీ విపరీత చరిత్ర జరిగి

యుండును. నీకు మోహనునితోఁ గలయిక యీ రాత్రియే యీ గడియయందే యీ సంకేత స్థలమందే యని నేను గలఁగంటినా? ఇంతకు నా ఖర్మము! నే నాలస్యమేల చేయవలయును?

గీ. రమ్యబహులాచ్ఛసద్గుణ ♦ రాజినైన
నెట్లు గర్వము నింద్యమౌ ♦ నట్లు సేయు;
నట్లె యెట్టి క్రియాకౌశ ♦ లాధికతను
నైన నలసత ధ్వంసమౌ ♦ నట్లు సేయు.

గీ. అదను గనిపెట్టి పనిసేయు ♦ నతఁడు శ్రీయు
తుండు, లేనిచో మందభా ♦ గ్యుండు నిజము;
తగిన కార్తిని గృషిసేయ - ధాన్య మొందు,
కానిచో గడ్డిఁ గఱచును ♦ గర్షకుండు.

బుద్ధిమతీ! మనము నలుఁగురము కొంచెము ముందు వెనుక బయలుదేర నెంచితిమి.

గీ. అజ్ఞుఁడను నేను నలుగురి ♦ యందు నుండ
మిగులు మువ్వురకును బాధ ♦ దగిలె నిట్టు;
లొక్క చక్రంబునకుఁ బట్టు ♦ యూడ, మిగులు
మూఁడు బండిచక్రము లెట్లు ♦ పోవఁగలవు ?

బు : వసంతా ! కోకిలా మోహనులు మనవలెనే భ్రమమొంది వేరు మార్గమునఁ బోయిరనియే నీ యభిప్రాయము కాదా?

వసం : గీ. దంపతులు మీరు మేమును ♦ దారసిల్ల
నీవరుఁడు గోకిలను బట్టె, ♦ నేను నిన్నుఁ
బట్టితిని; తప్తలోహంబు ♦ వారిఁ జేర
నినుము వాఃప్రాణమారుతా ♦ ళిని గ్రహించు,
జలపవన మాయుషోష్ణతఁ ♦ జెలఁగిపోవు.

చెలీ! నిన్నొక్క సంగతి నడిగెదను. నీకుఁ గోపము రాదు కదా!

బు : కోపము నీరువలెఁ గ్రిందినుండి పైకెక్క లేనిదికదా!

వసం : హెచ్చు తగ్గు లేల నిర్ణయించెదవు ? చూడు! నీకంటెఁ జక్కని దానివి

జూచినయెడల మోహనుఁడు దానిపై మనసుదగులునట్టి యస్థిరాను రాగయు తుఁడు కాఁడుగదా!

బు : నాకంటె గోకిల చక్కనిదా? నీ కంటి కది యెట్లగుపడునో నా నాథుని కంటికి నేను నట్లు కానపడుదునని నీ వెఱుఁగవా? నీకంటె గుణవంతుని జూచిన యెడలఁ గోకిల యాతని మోహించునంతటి చంచలచిత్త కాదుగద?

వసం : క్షమింపుము. నీ నాథుఁడు గుణవత్తరుఁడై నందులకు సంతసించితిని.

బు : నీ కాంత నాకంటెఁ జక్కని దైనందులకు మఱింత సంతసించితిని.

వసం : నన్ను క్షమియింపుము.

బు : ఆఁడుది మగవాఁడు నిర్జనాటవిలో నేకాంతముగ నుండినను వారైక్య మొందుదురా? మన మిచ్చట నన్నయుఁ జెల్లెలువలె వేఱువేఱుగ నుంటిమి కాదా? అటులే కోకిలా మోహనులును—

వసం : క్షమింపుము. నీవు పలికినది యథార్థమే.

గీ. ఉవిద పురుషుఁ డెంతయుఁ గూడి ♦ యున్ననైనఁ
గంతుకోఱ కంచు తగుల కైక్యం ♦ బు గారు;
ప్రాణనీరానిలము లెంత ♦ బాయకున్న
విద్యుదగ్ని లేకయె మేళ ♦ వింపఁగలవె?

నాకు సెలవిమ్ము పోయెదను. ఎక్కడకుఁ బోవలయునో, యేమి సేయవలయునో, యెట్లు కోకిల లభించునో యేమియు నెఱుఁగను.

గీ. ఏ విడీఁతఁ గొట్టుకొనుచుఁ ♦ బోవువాఁడ,
నారితో నొక్క రేవునేఁ ♦ జేరి సుఖప
డినను మంచిదే, లేకయుం ♦ డినను మంచి
దే; విరహబాధఁ బాసి సు ♦ ఖింతు మిగుల.

హా! కోకిలా! ప్రాణకాంతా!

బు : నీవు మగవాఁడవు. బుద్ధిమంతుఁడవు. ఎటులైన శ్రమనొంది కోకిలను నీవు గ్రహింపఁగలవు. అప్పు డామెవలన నామోహనుని జాడలను గనుఁగొని యవకాశమున్న నాకుఁ దెలిపి పుణ్యము గట్టుకొనుము.

వసం : మగవాఁడును, బుద్ధిమంతుఁడును నీకు మోహనుఁ డున్నాఁడుకదా? అతఁడు నిన్నుఁ జేరుటకు శ్రమ మొందకుండునా? ఇఁక మన మొకరితో నొకరు గలిసి కొనుట కవకాశ ముండునని నాకుఁ దోచదు.

గీ. ఏటివడిఁ గొట్టుకొని మన ♦ మిటకువచ్చి
నార; మిపుడు మార్వడిచేత ♦ వేఱుపడుచు
నుంటిమి: కలియుటకును వే ♦ ఱుంటకైనఁ
గాని మనశక్తి యిసుమంత ♦ గలదె? యబల!

గీ. దుష్టుఁడగు మరు నవిలంఘ్య ♦ దుర్విపాక
పాటవం బిది; నీకు నేఁ ♦ బనికిరాను,
నాకుఁ బనికిరా వీవు; హా! ♦ నాలిముచ్చు
మరుఁడు మనలను గూర్చె గో ♦ మహిషరీతి.

నే నింకఁ బోయెదను. హా! ప్రాణనాయికా! కోకిలా!

కో : హా! ప్రాణనాథా! మోహనా!

వసం : నీ విటుపొమ్ము, నే నిటు పోయెదను.

గీ. సతి యెటేగెనో? యని యిటే ♦ డుతును నేను,
పతి యెటేగెనో? యని యటే ♦ డ్వఁదగు నీవు;
నింతికై నలకూబరుఁ ♦ డిచట, మగని
కొఱకు మండోదరి యచటఁ ♦ గుందునట్లు.

కో : నీకాంత రంభయే కావచ్చు గాని, నా కాంతుఁడు రావణుఁడు మాత్రము కాఁడు.

వసం : అటులైన మఱింత సంతోషమే. హా! కోకిలా!

(నిష్క్రమించును.)

కో : నట్టడవిలో నొంటరినై నిలువ వలసివచ్చెను. హా! మోహనా! నిన్ను నమ్ముకొని యిట్లు వచ్చితినిగదా! ఎప్పటికైన నీవు నేను గలసిన నదృష్టవంతులమే. లేనియెడల నీయడవిలోని మృగములకు నా దేహము నాహారముగ నొసంగుదును. ఆకలిచేఁతను, నిద్రలేమిచేతను బడలియుంటిని. ఆ చెట్టు క్రింద శయనింతును. బ్రతికి లేచినయెడలఁ దరువాతఁ జూచుకొనవచ్చును. హా! మోహనా! మోహనా!

(శయనించి నిదురించును.)

(తెర వెనుక)

జగన్నాథా! ఇటు. ఇటు. ఆ చెట్టునకుఁ గొంత యావ్రక్క నొకకాంత నిదురించుచున్నట్టున్నది.

(మఱల తెరవెనుక)

కాను. నే నీ ప్రైవునుండి వచ్చెదను. నీ వాప్రక్క నుండి రమ్ము.

(జగన్నాథుఁడు, విజయసారథి యట్లు ప్రవేశింతురు.)

విజ : ఆ.వె. అదిగొ వృక్షమునకు ♦ నటు చిఱుగంటల
కాంచి యరల బట్టి * గాలి కూఁగ
చెలువ యుండు దెబ్బ ♦ చే నూడి యరదంబు
ప్రక్కఁ బడిన కేతు ♦ పటముఁ బోలె.

జగ : మనము నిమ్మళముగ సమీపింతము. రమ్ము. ఈమె కన్నులు తెఱచియే నిద్రఁ బోవుచున్నది. చెవులపిల్లి వలె నీమెకు ఱెప్పలు లేవా యేమి?

విజ : ఇంతకు ముందు నాచే బద్ధుడై మన పురమునకుఁ బంపఁబడినవానిచే బలాత్కరింపఁ బడకుండఁ బారిపోయి మానరక్షణమును జేసికొనిన కాంత యిదియే. దీని కొఱకే మనము వెదకుచుంటిమికదా!

జగ : ఆమెయే యీమె యని నీ వెట్లు చెప్పగలవు?

విజ : నీకుఁ దెలియదు కాని, నాకుఁ దెలియదా?

గీ. ముంగురులు ద్రెస్సెను జడ లా ♦ గంగఁబడిన
యలుఁగు టీఁకెలలీల; హా ♦ రాశి చిక్కు
వడియె జానకి త్రాళ్లచు ♦ ట్టలను బోలె;
మో మరుణ మయ్యెను ఫిరంగి ♦ మోమువలెను.

అదిగాక యీమె క్షత్రియ కన్యవలె నున్నది.

జగ : అది మీ కెట్లు తెలిసినది?

విజ : హాహా! నాకుఁ దెలియక పోవుట కూడనా?

గీ. వంగి యుంగరాలట్టు జు ♦ ల్పములు గ్రాలు,
హొడుగుకంటె నెక్కుడు వెడ ♦ ల్పుగల యద్ద
బాస ముక్కునత్రేలు, ని ♦ ష్పవన నిలయ
బంధమున గాత్ర మొక్కింత ♦ పాలిపోవు.

జగ : ఈమెకు వయ సెంతయుండునో!

విజ : ఆ సంగతి యీమె లేచినఁగాని చెప్పజాలను.

జగ : అదెట్లు?

విజ : నేను యుద్ధాశ్వముల వయస్సును దిండ్లనుబట్టి కనిపెట్టగలను.

జగ : నేను మనుజుల బుద్ధిని నాలుకవలనఁ గనిపెట్టగలను.

విజ : చూడు! ఆమె లేచుచున్నది.

జగ : గీ. తనువు విఱిచి, కాళ్ళు బిగియఁ ♦ దన్ని, కరయు
గము వెనుక సాఁచి, పిడికిల్లు ♦ గదియఁబట్టి,
నడుము పై కెత్తి, బిగువుగఁ ♦ గుడి కెడమకు
నాస్యముఁ గదల్చి, బొమలెత్తి ♦ యావులించు.

బు : హా! మోహనా! (లేచును.)

విజ : హా హా! నా పేరు మోహనుఁడు కాదు. విజయసారధి. అయినను నీ వను మాట యేల కాదనవలయును! యుద్ధమున నేను శత్రుమోహనుఁడను.

బు : ఆర్యులారా! మీర లెవ్వరు?

విజ : మే మెవ్వరమైన నేమి? మా సంగతి నీకుఁ దెలియవలసిన యావశ్యకత లేదు. నీ సంగతి నేను బూర్ణముగ నెఱుఁగుదును. నిన్నిక్కడ కీడ్చుకొని వచ్చుటయు, బలాత్కరింపఁబోవుటయు, నీవు కేకలువైచి పరుగెత్తుటయు—

బు : అది అంతయు నసత్యము.

విజ : నీ వసత్య మనునంత మాత్రముననే యసత్యమగునా? సత్యమేదియో నే నెఱుంగనా? జిహ్వఁ గోసినసరే సేనాధిపతు లసత్యమాడువారా? తుపాకి పేల్చి దానిపిక్క యెక్కడ పడునో అక్కడకేగి దాని నిట్టె తీసుకొనిరాగల నేను, నాకంటి యెదుటఁ బారిపోయి దాఁగిన నిన్నుఁ బట్టుకొనలేకుందునా?

బు : మీ కంటి యెదుట నేను బారిపోయితినా? అసత్యము.

విజ : హాహా! అసత్యమో సత్యమో! నే నెఱుఁగనా?

జగ : ఆమె చెప్పున దేదో తిన్నఁగ వినరాదా?

విజ : హాహా! ఇఁకఁ జెప్పనక్కఱ లేదు. విననక్కఱలేదు. ఆమె సంగతి నాకంటె నామెకు బాగుగఁ దెలియునా! ఈమెను మన రాజాంతఃపురములోనికి బంపఁ దలఁచుకొంటిని. నలుగురు భటు లీమెను బ్రాణపదముగఁ దీసుకొని పోవలయును. వింటివా? ఆజ్ఞోల్లంఘనమును సేనాధిపతు లెన్నఁడును సహింపరు. నీవు మాఱు మాటాడక యీమెను నా భటులయొద్దకుఁ దీసుకొని పొమ్ము.

జగ : తమ యిష్టానుసారమే. మన మనుకొనిన కాంతమాత్ర మీమె కాదు. మీరింక నామెను గొన్ని ప్రశ్నముల నడిగి సత్యమును గ్రహింపవలయును.

విజ : సత్యము, జయము మాకుఁ గరతలామలకములు. వేఱు గ్రహింపనేల? నీవు నోరు మూసికొని యూరకుండుము.

జగ : (తనలో) మొండిముండకొడుకు.

విజ : అమ్మాయీ! మా రాజేంద్రునకు సంతతిలేదు. ని న్నాతఁడు పెంచుకొనును. నీ కేమియు భయము లేదు. నిన్ను జాగ్రత్తగ నాతనియొద్ద కంపెదను పొమ్ము. (లేఖను వ్రాయుట నభినయించి) హాహాహా! కత్తితో నక్షరనాశనము సేయు వీరునకుఁ గలముతో నక్షరసృష్టి కష్టముకదా! జగన్నాథా! ఈ లేఖను రాజున కిమ్మని భటులతోఁ జెప్పుము.

బు : మహానుభావా! నా మోహనుఁ డచ్చట నున్నాఁడా?

విజ : ఎవనినోకాని యటకుఁ బంపితిమి. చూడు! జగన్నాథా! ఇదివఱకు మనము రాజధాని కంపిన యాతని పేరును గనుఁగొన మఱచితి సుమా! అయిన నేమి? ఈమెను దీసుకొనిపొమ్ము. చూడు! భటుల కీమె నొప్పజెప్పి వెంటనే రమ్ము. నే నిటనే యుందును. సార్వభౌమునికిఁ గప్ప మిచ్చి వేగ మన మింటికిఁ బోవలయును.

జగ : చిత్తము.

బు : హా! మోహనా!

(జగన్నాథుఁడు, బుద్ధిమతి నిష్క్రమింతురు.)

విజ : జగన్నాథా! శీఘ్రముగ రావేమి?

జగ : (ప్రవేశించి) అయ్యా! వచ్చితిని.

విజ : ఇఁక మనము పోవుదము. (పరిక్రమింతురు.)

జగ : ఈ దినమున నీయడవి యాఁడుపడుచుల నీనినట్లున్న దేమి?

విజ : అదేమి?

జగ : అటుచూడుము. (తనలో)

సీ. గాగరాపైఁ గలఁ ♦ కారిపూవులగముల్
విపిన పుష్పములతో ♦ వియ్యమంద
ఱవికపై జలతారు ♦ జవతీవశవణింపు
గహనవల్లరులఁ జీ ♦ కాకుపఱుపఁ
గొంగుప్రక్కల హత్తు ♦ కొనుచను ల్వనకోక
ములతోడఁ ధాఁగిళి ♦ మూఁత లాడ

నెడమమూపునఁ దూఁగి ♦ పడు జాఱుముడి యాట
విక భృంగిపఙ్క్తిని ♦ వెక్కిరింప
కంకణములు గల్లు ♦ గల్లు మనంగను
జెవుల దుద్దుజోడు ♦ జిగ జిగ మన
సంబరంబు పెటపె ♦ టాడ సీతనికనుల్
చిటుచిటాడ వచ్చుఁ ♦ జెలువ యదిగో!

విజ : ఆహా! యెవతెయో కదా!

గీ. గట్టిదగు బిట్టు బిగియొడ ♦ ల్గల్గి, నున్న
నయి మిగుల గుండ్రనగు మొగ ♦ మలరుచుండ,
రివ్వు మన వేగమున నాదు ♦ హృదిని దూర
నిక్కడకు వచ్చును దుపాకి ♦ పిక్కవలెను

జగ : మీరు జంకుచుంటిరేమో! నేను మీకును దానికి నడ్డుపడనా.

విజ : హాహాహా! యోధాగ్రేసరుఁడైన నాకు భయమా?

జగ : నిశ్చయమే.

గీ. వణిజునకు యథార్థత, న్యాయ ♦ వాదికి మొగ
మోటమియు, విదూషకునకు ♦ మాటకొంకు,
తొత్తునకు లజ్జ, సమరయో ♦ ధునకు భయము
లేవు; గల్గినయెడ నెగ్గ ♦ లేరు వారు.

విజ : చూడు! ఇది యుత్తమజాతి కన్యవలె నా కేమోకానిపింపదు. ఏమి కారణమో గ్రహించితివా?

జగ : మీకు దానిపై వలపు గలుగుటయే కారణము.

విజ : హాహాహా! నిజమే. ఇంతకుమును దిచ్చట శయనించిన క్షత్రియ కన్యను జూచి నా కేమో యమిత గౌరవమును, దూరమున నుంపవలయు నను బుద్ధియు నుదయించెను. ఆమెతో సమానమైన సౌందర్యముగలదైనను దీనిని జూచ నాకనుభవింపవలయు నను కోర్కెవొడముచున్నది.

గీ. చంపకము దివ్యవాసనా ♦ సంభరితము;
దాని రీతిగనుండు శ్రీ ♦ తఫలసుమము

కల్లువాసనగలది; త ♦ త్కారణమునఁ
జీమ దాని జేరక దీని ♦ జేరుఁగాదె!

(భ్రమరిక ప్రవేశించును.)

విజ : ఇది యెవ్వతె యని నీ యభిప్రాయము?

జగ : ఇది మగవానికంటె భిన్నమైన వ్యక్తి.

విజ : హాహా! కాదు. మగవానితో నేకీభవింపదగిన వ్యక్తియనుము.

భ్రమ: ఆర్యులారా! మ్రొక్కుచున్నాను.

విజ : హాహా! శౌర్యవంతుడైన పతి నొందుదువుగాక! (అపవారించి) హాహా! మిత్రమా! బాగుగ దీవించితినా?

జగ : (అప) ఇందున నాత్మాశీర్వచన ముండుటచేత—

విజ : (అప) శౌర్యవంతులగు యోధు లెప్పుడు నాత్మరక్షణముఁ జేసికొనుచుఁ బరుల స్వాధీనులుగఁ జేసికొందురు. అది మా కలవాటే. అటులేల దీవించితి ననఁగఁ బురుషుడు స్త్రీయందలి సద్గుణముల కాశించును. స్త్రీ పురుషునందలి శౌర్య గుణమున కాశించును. కాంతల కనులకు యోధులకంటె నర్హతరులు మఱెవ్వరును లేరు.

జగ : (అప) ఈ జాతి మాత్రము పురుషుని శౌర్యము నపేక్షించునది కాదు.

విజ : (అప) ఏల?

జగ : (అప) ఇది దాసి; వ్యభిచారిణి.

విజ : (అప) కావున ధన మపేక్షించునా? వ్యభిచారిణియైన మఱింత మంచిది కాదా? (ప్రకాశముగ) నీ పేరేది?

భ్రమ : భ్రమరిక.

విజ : నీ వృత్తి యేది?

భ్ర : నేను శుద్ధాంతకాంతాపరిచారికను; దాసిని.

విజ : హాహా! మిత్రమా! నీ వనినట్లే యయినది. భ్రమరికా! దగ్గఱగ రమ్ము!

జగ : (అపవారించి)

గీ. పైకి బండారము, మఱి లో ♦ పల లొటారు
ముండు దాసిని దవ్వున ♦ నుండి చూడఁ
దగును; దరికి చేర నసహ్య ♦ మగును; నాట
కమును రంగంబునను నిల్చి ♦ కాంచినట్లు॥

విజ : (అప) అది దూరమున నుండుటచే నాకు దృష్టి బాగుగ నానుటలేదు.

జగ : (అప) మీ కలవాటే గాదా? ఒంటికంటిని గురిపెట్టి చూడుఁడు.

విజ : (అప) నాకుఁ గొంచెము మనస్సు మళ్ళినను దీనిని జూడ మిగుల నుత్సాహముగ నున్నది సుమా!

జగ : (అప) మెంతికూర కెండిన కొలఁది వాసనకదా! సేనాధిపతికిఁ. జేవ్రాటికి ముసలితన మేమి?

విజ : (అప) మేము యోధుల మగుటచే వీరరసప్రధానులము. మాకు శృంగారరస మూరక నంజుడునకు మాత్రమే కాని, యంతకంటెఁ గాదు. నేను వలచితినని దానితోఁ జెప్పుట అది కొంత బిగియుట, వాక్యోపవాక్యము లారక తీఁగ పాఁగుట నా కిష్టముకాదు. రంజక మంటింప 'ఢామ్మ' మని పేలు తుపాకి వలెనే యతిలఘువుగ దీనిని నాకు సమకూర్పవలయును.

జగ : (అప) ఎంతసేపు! ఘటకమువలె మూడుముక్కలలోఁ గడతేర్తును.

విజ : (అప) ఘటక మను నాయుధ విశేషము నే నెప్పు డుపయోగింపలేదే?

జగ : (అప) అది ఆయుధ విశేషము గాదు. అర్థిక శేషము. భ్రమరికా! నీవు మా సేనాధిపతిగారి వంక నొకసారి చూడఁదగును.

భ్ర : (తలవంచుకొనును.)

జగ : (అప) బొమ్మజెముడు వలె నిర్భేద్యముగఁ బెరిగిన మీ బుగ్గమీసములఁ జూచి యది బెదరుచున్నది.

విజ : (మీసములు దువ్వుచు) హాహాహా!

ఆ. వె. పెద్దపులికిఁ జిన్న ♦ పిల్లి గడ్డంబును,
గనదుదారసింహ ♦ మునకు జూలు,
యోధులకును ధరణీ ♦ నాథులకును బుగ్గ
మీస లసమశౌర్య ♦ ఖానకములు.

వీనివలన నరులకు భయముగాని, నారులకుఁ బ్రియయేగదా! భయ మెఱుఁగని నన్నుఁ జేరుటకు నీకు భయ మేల? (అపహరించి) మిత్రమా! త్వరగఁ దెమల్చుము.

జగ : భ్రమరికా! నీవు మా సేనానాయకుని బరిణయ మాడవలయును.

విజ : సెబాస్! బాగుగ నడిగితివి. యోధులకుఁ బాము మెలిక సంభాషణము గిట్టదు. టక్కున సూటిగ సంభాషించుటయే మా కిష్టము.

భ్ర : అయ్యా! నేను బరిణయమాడుదానను గాను.

జగ : ఆ(డుదానవు కావుననే పరిణయ మాడు మంటిని.

విజ : దానియభిప్రాయ మేమి!

జగ : ఏ మున్నది? కూటసాక్ష్యయులచే బ్రతుకువానివలె స్వచ్ఛంద వ్యాపారమున జీవింతు ననుచున్నది.

విజ : వివాహమగువా(డు లేకుండిన యెడల నట్టియావశ్యకతగాని యున్నయెడల నింక బాధ యేమి?

భ్ర : కులవృత్తిని దా(టరాదు.

విజ : స్వైరిణీకుల మనునొక కుల మున్నదా? స్వచ్ఛందత కులాచారమై యున్నదా? మిత్రమా! ఈ యాచారము బాగుగ నున్నది కాదు సుమా! ఇట్టికులము మగ వారిలో(గూడ నున్నదా?

జగ : లే కేమి?

విజ : ఏ దది?

జగ : పోనిమ్ము; నీకు(గోపము వచ్చునేమో?

విజ : చెప్పుము.

జగ : మీ కులమే.

విజ : ఆ(! ఆ(! మాది వ్యభిచార కులమా? ఎట్లు?

జగ : గీ. భృతికి(బురుషమానధనాసు ♦ తతి హరింత్రు
వారు, మీరు; కోపమే లేక ♦ మీరు, రాగ
మొందకయె వారు; మందు చే ♦ నంది మీరు,
మందుచే వారు; భేద మే ♦ మందు నయ్య!

విజ : ఆ(! మాకు శౌర్య మున్నది. మఱి వారికే మున్నది.

జగ : నీ శౌర్యమును మించిన మోసమున్నది.

భ్ర : అయ్యా! మే మెవ్వరిని మోసము చేయుదుము? ఒకరి సొమ్ము తస్కరించు వారము కాము. ఒకరి ధనమును మేము బలవంతముగ(దీసికొనుట కబలలము. శుద్ధాంత కాంతలయొద్ద సదా పరిచర్యచేసి వారిచే(బోషింప(బడుచుందుము.

విజ : మహా పతివ్రత లగు నవరోధ వధువులయొద్ద నిట్టి స్వైరిణులు పరిచారికలుగ నుండు నాచారము నాకేమో బాగుగ నున్నదికాదు సుమా! సంసారి స్త్రీలుండిన నెంత బాగుగనుండును?

జగ : సందేహము కూడనా? అందుచేతనే మనరాజాంతఃపురమున నిప్పుడందఱును సంసారిణులే యున్నారు.

విజ : ఆఁ! ఆలాగునా లేరే! అదెట్లు?

జగ : వార్ధకమునఁ గొందఱు, వికృతరూప లగుటచేఁ గొందఱు సంసారిణులకంటెఁ బరిశుద్ధలై యుండిరికదా?

విజ : హాహాహా! కాని, వీరివలన బాధ లెక్కువగ నున్న వనుమాట నిశ్చయమేనా?

జగ : ఇంక శంక యేల?

ఆ. వె. అంతిపురములోన ♦ నామూల గోడచా
టునను జెవుల నూదు ♦ కొనఁగఁబడిన
ప్రాణపదరహస్య ♦ మైననప్పుడె నంత
పాటి కెక్కు వీరి ♦ వలనఁ గాదె!

ఆ. వె. కాగితంబు నలుపు ♦ గావించి జీవించు
కోటలోని చుట్టు ♦ నోటి వారి
ప్రాతకొంపగమిటా ♦ పారంబుపైఁ జండ
వీతిహోత్రకీల ♦ వీరి లీల.

తే. గీ. మొలను జురకత్తి, కుడిచేతఁ ♦ బొన్నుగఱ్ఱ,
వెడద నుదురు బొడ్డు దిగువ ♦ విఱువుగచ్చ
కట్టు మెలిసిగ గల దొర ♦ గముల శుద్ధ
తేజమునకు వీరలసేవ ♦ దిడ్డిత్రోవ.

విజ : ఏమైన సరే మన మతిశీఘ్రముగ నీ దురాచారమును మానుపవలయును.

జగ : చిరకాలము నుండి వేళ్ళు పెరిగియున్న దురాచారము నొక్కసారి పెఱుక మన తరమవునా? అది క్రమక్రమముగ జరుగఁదగిన పని. ఎవ్వరైన మహా బుద్ధి సాహసము గలవాఁడు మార్గదర్శియై—

విజ : ఎవరో యన నేల? నేనే మార్గదర్శి నయ్యెదను. మహాకార్యము లన్నియు మొట్టమొదట యోధులవలన నాచరింపఁబడినవే. నేను దీనిని బెండ్లాడి సంసారిణిజేసి మా రాజ కాంతయొద్దఁ బరిచర్య కుంచెదను. ఏమి? భ్రమరికా, నీవు నన్నుఁ బెండ్లి యాడెదవా? లేదా?

భ్ర : ఆ సంగతి నే నిప్పు డాకస్మికముగ నెట్లు చెప్పఁగలను?

విజ : ఎందుచేత చెప్పలేవు?

భ్ర : నారాజ్ఞి యెచ్చటి కేగెనో కానఁబడదు. ఆమె నా కనులఁబడినఁగాని నా వివాహము మాట తలపెట్టుకొనను.

విజ : అటులైన మంచిదే! మీరాజ్ఞిని నే నిప్పుడే చూచి మారాజాంతఃపురమునకుఁ బంపితిని.

భ్ర : అలాగా! సంతోషమే. ఆమె సన్నిధి నొక రాజపురుషుని గూఁడజూచితిరా!

విజ : ఆఁ! అతని గూడ మా గ్రామానికే పంపితిని.

భ్ర : నా కిప్పుడు మనస్సు నిర్వ్యాకుల మైనది. నారాజ్ఞిని నేను దర్శించిన వెనుక-

విజ : సెబాస్! అలాగే మిత్రమా! చూడు!

గీ. మొగము మకమకలాడెడు ♦ మగువ కింతఁ
దనుక, నిప్పుడానందవ ♦ ర్ధనత వెలిఁగె,
దుప్పు దులువంగఁబడు డాలు ♦ నొప్పునఁ గొడి
రాలునట్టి దీపకళిక ♦ లీల గాఁగ.

జగ : భ్రమరికా! మీ కాంత పేరేది?

భ్ర : ఆమె పేరుతో నీకేమి పని యున్నది.

జగ : నీవు రాజ కాంతతో నరణ్యమున కేల వచ్చితివి?

భ్ర : ప్రారబ్ధవశమున—

విజ : జగన్నాథా! నీ దొలుపుడు బుద్ధి పోనిచ్చుకోవుగదా! మనకు వారి రహస్యములతోఁ బనియేమి? మనకుఁ బ్రత్యక్షముగ నెదుటఁబడిన దానితో మన మొక చేయి చూడవలయునుగాని, రంధ్రాన్వేషణము శూరధర్మము కాదు. నీవు దీని నటకుఁ దీసికొనిపోయి నలుగురు భటుల నీమె సంరక్షణార్థముగ నియమించి మన గ్రామమునకుఁ బంపుము. ఈమెను మా యింటియొద్ద భద్రముగ నొప్పఁ జెప్పుఁడని భటులతో నా యాజ్ఞగా నీవు చెప్పుము పోయి వెంటనే రమ్ము. భ్రమరికా! పొమ్ము.

(జగన్నాథుఁడు భ్రమరిక నిష్క్రమింతురు.)

జగ : (పోయి తిరిగి వచ్చును.)

విజ : చెలికాఁడా! ఆలస్యమైనది. మన మిఁక బోవలయును. మన వృద్ధరాజేంద్రునకు వ్యాధి హెచ్చుగ నున్నది. కావున మనము గప్పము సార్వభౌమునకు వేగనర్పించి వెంటనే మన రాష్ట్రమును జేరవలయును.

జగ : చిత్తము.

(ఇద్దఱును నిష్క్రమింతురు.)

శ్రీ

కోకిల

తృతీయాంకము

ప్రదేశము : శ్రీపురము నందలి వీధి

(ప్రవేశము - కృష్ణుడు)

కృ : అబ్బ! అబ్బ! ఇప్పటికి అజీర్ణబాధ కొంత శాంతించినది. ఏమి భోజనములు! ఏమి పిండివంటలు! ఏమి ఫలహారములు! ఏమి పానకములు! ఏమి త్రేపులు! ఏమి కడుపు నొక్కులు! ఏమి సొంటిపొడి పిడచలు! ఏమి మిరియాల కషాయములు! ఏమి యేకభుక్తములు! ఏమి యెంగిలి లంఘనములు! అబ్బ! ఏమి వైద్యుల తెగ నీలుగుటలు! ఏమి నిద్రలేకపోవుటలు! ఏమి గుండెదరువులు! ఏమి స్వప్నరోదనములు! అబ్బ! ఇక్కడ కన్నియుఁ గడతేరినవి. (ఆవులించుచుఁ జిటిక వైచుచు) శంకరా! శంకరా!

(తెరవెనుక) అయ్యా! ఇదిగో వచ్చుచున్నాను.

కృ : ఈతఁ డెవ్వడు?

ఆ. వె. అంగవస్త్రమునకు ♦ నట్టిట్టు జారి మృ
గాజినమును గట్టి ♦ యద్ది యెడమ
చేతఁ గొని వలపలి ♦ చేఁ గఱ్ఱ నూఁదికొం
చడుగో! శివ శివా య ♦ టంచువచ్చు.

(శంకరుఁడు ప్రవేశించును.)

కృ : అయ్యా! నమస్కారము.

శం : మీ రెవ్వరయ్యా?

కృ : నే నెవ్వఁడనైన నేమి? నమస్కార మర్పించితిని: గ్రహింపరాదా?

శం : మీ రెవరో తెలియకుండ నెట్లు గ్రహింపఁగలను. మీకుఁ దిరిగి నమస్కరింపవలయునో యాశీర్వదించినఁజాలునో తెలిసికొనవలదా?

కృ : మీయంటి పెద్దలు మాకుఁ బ్రతినమస్కారము కూడానా?

శం : అటులైన దీర్ఘాయుష్యమస్తు! నాయనా! మీరెవ్వరు?

కృ : ఆశీర్వాద మైనది కాదా? ఇఁక నే నెవఁడైన నేమి?

శం : ప్రభు సంస్థానంలో మీ కేమైనఁ బని యున్నదేమో తెలిసికొనుట కడిగితిని.

కృ : ఆఁ! స్వల్పముగ నున్నది.

శం : చాలు. మావంటివారి కుపకారముచేయుట కంతియే చాలును. వీద బ్రాహ్మణుఁడను; కుటుంబీకుఁడను వేదాధ్యయనపరుఁడను; వృద్ధుఁడను: దురన్న దుస్థానములకుఁ బోవువాడను గాను. నాయనా! కొంచెము పుణ్యము కట్టుకొని——

కృ : నన్నిప్పు డేమిచేయుమని మీ యభిప్రాయము?

శం : ఈ యుత్సవములలో నేమైన సత్కారమపేక్షించి వచ్చితిని.

కృ : ఏ యుత్సవములు?

శం : ఇప్పుడు జరుగుచున్న యుత్సవములు.

కృ : ఇప్పుడు జరుగుచున్నవి కావు, వెనుక జరిగిన వనుము. రెండుమాసముల క్రిందట పూర్తియైనవి. మీ రింత యాలస్యముగ నేల వచ్చితిరి?

శం : దురదృష్టముచేత. వేడుక లన్నియు నప్పుడే ముగిసినవా?

కృ : మఱిలేదా?

శం : లేని సంభావన లేనే లేదు. నాయనా! ఇక్కడ నేమి యుత్సవములు జరిగినవో చెప్పుము. చెవులారా విని సంతసింతురు.

కృ : అటులైన వినుఁ.

శం : ఊఁ!

కృ : మొదటి వేడుక మా వృద్ధ రాజేంద్రుని మరణము.

శం : హరహరా! అటు లందు వేల?

కృ : చచ్చిన తరువాత చావలేదని నేనెట్లు చెప్పఁగలను?

శం : నిన్ను సత్యవాడుమని నా యభిప్రాయముగాదు. వృద్ధరాజేంద్రుని మరణము వేడుక యంటివికాదా?

కృ : అనినఁ దప్పేమున్నది? తొంబదిమూడు సంవత్సరములు జీవించి శీఘ్రముగ మరణించుటకై కోరిన వృద్ధరాజేంద్రుని మరణ మతనికి, లోకమునకుఁగూడ వేడుక కాదా?

శం : పూర్ణాయుర్దాయము! తొంబదిమూడు సంవత్సరములు జీవించెనేమి?

కృ : తెలివితేటలు లేనివాని కాయుస్సునకు లోప మేమి?

శం : వారు ప్రభువులు, అమితైశ్వర్యసహితులు, అనేక ప్రజాపోషకులు, వారికిఁ తెలివితేట లేమిటి? నాయనా! నాలుగుముక్కలు వచ్చినఁగాని జీవనము జరుగ దన్న భయము గల్గిన మనవంటి దరిద్రులకు విద్యలు, తెలివి కాని, యందఱ కంటె నధికులగువారికిఁ తెలివితేట లేల!

కృ : అందుకొఱకె వారికి మఱింత కావలయును. మీకు నాకు విద్యాబుద్ధులు లేక పోయిన లోకమునకు లోపమేమి? మనకుమాత్ర మేమి లోపము? కాకివలె నొక్క పొట్టపోసికొన లేకుందుమా? అనుగ్రహము వచ్చిన ననేక కుటుంబ ములఁ బోషించువారు, ఆగ్రహమున గల్గిన నశింపఁజేయువారు అట్టి ప్రజా రక్షణ శిక్షణ మహాకార్యము మీఁదఁబడినవారికే యుక్తాయుక్త విచక్షణత యుండని యెడల నెంత వైపరీత్య మున్నది?

శం : ఆ వృద్ధరాజేంద్రుఁ డంత తెలివితక్కువవాఁడా?

కృ : కాఁడా?

గీ. ఎంతొవచ్చిన నంతకు ♦ నెక్కుడు సెల
వు నొనరించు రాజెటు చెడి ♦ పోకయుండు?
నెంతొ యెన్నిమాఱులో తిని ♦ యెంతొ త్రాగు
చుండు నతిమాత్రరోగి చావ ♦ కుండు నెటులు?

ఆ. వె. ప్రభుఁడు మందుఁడౌటఁ ♦ బ్రతిభచే లక్ష సే
యంగఁగల్గు నాతఁ ♦ డధముఁ డయ్యె
నధముడైన యాతఁ ♦ డట్టె లక్షాధ్యక్షుఁ
డయ్యె నధికవిభవుఁ ♦ డయ్యె నకట!

శం : పోనిమ్ము. ఇఁకఁ జెప్పకుము. మరణించినవారి సుగుణములనే పేర్కొన వలయును. ఆయనకుఁ బుత్రు లెవ్వరైన నున్నారా?

కృ : లేరు.

శం : అటులైన నీరాజ్యము నెవరు పాలించుచున్నారు?

కృ : ఆయన భార్య.

శం : ఆయన భార్యకు దత్తతాధికారము లిచ్చెనా?

కృ : లేదు. కాని యాయన జీవించియుండగనే వారకాంతవలె నొకకన్యను దత్తతఁ జేసికొనెను—అదే దగ్గఱదీసికొనెను, ఆనిర్భాగ్యురా లీయన గుమ్మములోఁ గాలు పెట్టఁగనే యాయన కాలుని గుమ్మములోఁ గాలుపెట్టెను.

శం : పాపము!

కృ : పాపము కాదు. లోకుల పుణ్యముచేతనే యట్లు జరిగినది.

శం : అదేల?

కృ : ఆరాజు మరణింపఁబోవుచు నొక యాజ్ఞ చేసెను.

శం : ఏమని?

కృ : తాను మరణించిన తరువాత రెండుమాసములలోపుగఁ బట్టపుటేనుఁగునకు జల కలశమును బూలమాలయునిచ్చి యూరంతయుఁ ద్రిప్పవలసినదనియును, దత్కలశజల మది యెవని కాళ్ళఁబోసి యెవనిమెడ నా పుష్పమాల వేయునో యాతని నాగజముపై నెక్కించి తీసికొనివచ్చి రాజ్యమునఁ బట్టాభిషిక్తుని జేయవలయుననని—

శం : సమంజసమై సర్వోత్కృష్టమైన యీ పూర్వాచారమును రాజు గౌరవించి నందులకు సంతసించితిని.

కృ : అంతకంటె మే మొకందులకు సంతసించితిమి.

శం : మఱెందులకు?

కృ : అందువలన మా కమిత ప్రతిభాశాలియగు మహారాజ బాలకుఁడు లభించెను.

శం : లభింపఁడా? పురుషప్రయత్న పటుత్వమున నహంకారము నుంచుకొని చేయఁ బడిన కార్యము సుష్ఠుగ నెఱవేఱదు కాని, నిరహంకారతచేఁ గేవలదైవాధీన ముగఁ జేయంబడిన కార్యమసామ్య శోభావంతముగ ఫలింపదా? వెనుకటి రాజునకు నీతనికి హస్తిమశకాంతర మున్నది కాఁబోలు నేమి?

కృ : మశకహస్త్యంతర మున్నది.

శం : ఈయనకుఁ బట్టాభిషేక వయ్యెనా?

కృ : పెండ్లి కానిదే పట్టాభిషేకమా?

శం : పెండ్లియే యింకఁ గాలేదా? అటులైన నీనడుమను జరిగిన యుత్సవము లేవి?

కృ : ఇట్టి మహాపురుషుఁడు పరిపాలకుఁడుగా లభించుటవలన జనులత్యానందమున మూఁడుమాసము నొక్కరీతిగ నపరిమితోత్సవము లొనర్చిరి. పట్టాభిషేకము పర్యంతము జను లీరీతిగనే వేడుకలు సలుపఁ దలఁచిరి. కాని, యొక్క యంతరాయము గలిగినది.

శం : అది యేది?

కృ : మా రాజబాలకునికి సార్వభౌమునితో యుద్ధము సంభవించెను.

శం : అయ్యో! అసమకక్షయే. కారణ మేమి?

కృ : ఈ నడుమ మరణించెనని చెప్పితినే! ఆ వృద్ధరాజున కొక్క కుమారు డుండెను.

శం : నిర్వంశముగ మరణించెనని చెప్పితిని కాదా?

కృ : అక్కఱకురాని పుత్త్రుఁ డున్న నట్టిదియేకదా?

శం : అక్కఱకు రాకపోవుట యేమి?

కృ : ఆ చిన్నవానిమూఁడేండ్ల వయసుననే యచ్చటినుండి సార్వభౌముఁడు గ్రహించి తనయూర బందీకృతుని జేసినాఁడు.

శం : అతని దోషమేమి?

కృ : అతనిది కాదు, తండ్రిది. తండ్రియొక్క విధేయతావిచ్ఛిన్నత కీచిన్నవానిని బూఁటకాఁపుగఁ దీసికొని పోయినాఁడు.

శం : సరే. ఇప్పుడు యుద్ధకారణ మేమి?

కృ : ఆ బాలుఁ డిప్పుడు పందొమ్మిదేండ్లవాఁడయి తన కూఁతును వలచి దానితోఁ గూడఁ బలాయన మైనాఁడనియును, వారి నిద్దఱను దనకు నొప్పఁ జెప్పినఁ గాని యుద్ధమొనరింతు ననియును సార్వభౌముఁడు మా రాజుగారికి వార్తనంపెను.

శం : తరువాత?

కృ : తరువాత నేమున్నది? వారు గానఁబడకపోవుటచేత యుద్ధమారంభమయ్యెను. అదివఱకే కప్పమిచ్చుటకుఁ బోయిన సేనాధిపతి భటులతో సార్వభౌమ రాజధానిలోనే యున్నాఁడు. కావున నిప్పుడు యుద్ధము భయంకరముగ జరుగుచున్నది.

శం : ఆ చిన్నవాఁడు నా చిన్నదియు నీ గ్రామమునకే వచ్చియుందురేమో! బాగుగ వెదకింపలేక పోయితిరా?

కృ : సత్యకాలపుమాటలంఁ జెప్పుచున్నావు. ఆ చిన్నవాఁడు పాఱిపోలేదు. ఆ చిన్నదాని నాతఁ డెత్తుకొని పోలేదు. మావృద్ధరాజు మరణమున మారాజ్య మరాజకమగుటచే మారాజపుత్త్రుని మాకుఁ బంపుమని మేమడిగి పోవుదుమని యీ వంకఁ గల్పించి యరాజకమగు నీరాష్ట్రమును దా నపహరింప వలయునని యెంచి కలహమునకు సార్వభౌముఁడు గాలు దువ్వినాఁడు.

శం : అలాగా! అంతమోసము చేసినాఁడా?

కృ : కాక యేలాగనుకొంటివి? రాజ్యతంత్రమునకుఁ, గట్టుమోతు మంత్రమునకు భేద మే మున్నది? మా బాలప్రభుని సంగతి విని సార్వభౌముఁడు మఱింత యుగ్రుండై యున్నాఁడు.

శం : పోనీ! ఈగాథ కేమి గాని, మీ రాజుగారి పెండ్లి యెప్పు డగును?

కృ : సత్కార మపేక్షించి నీకంతకంటెఁ గావలసిన దేమి? శీఘ్రములోనే.
శం : పెండ్లి కూఁతు రెవతియో స్థిరపడినదా?
కృ : ఇంటిలోనే యున్నదానికి స్థిరపడుప నేల?
శం : అదేలాగున?
కృ : మా వృద్ధరాజేంద్రునిచే నాదరింపఁబడి కన్య యొకతె యున్నదని చెప్పలేదా?
శం : ఆ పిల్ల నిచ్చి పెండ్లి సేయుదురా?
కృ : కా కేమి?
శం : ఆ చిన్నది వృద్ధరాజుచేఁ బెంపఁబడినది కాదా? వివాహ మెట్లు?
కృ : ఆ చిన్న దనుమాటయేమి? మేమందఱము వానిచేఁ బెంపఁబడినవారము కామా? దిక్కులేక యెక్కడనో దొరకుటచే నంతఃపురములో భోజనము పెట్టించుచు నాదరించుచున్నారు. ఇంటిలోఁ బ్రవేశించిన వెంటనే వృద్ధరాజును గడతేర్చిన యీమె మగడగు నీ బాలరాజు నేమి చేయునో యని భయముగ నున్నది.
శం : ఆ పిల్లయందు మీ రాజున కిష్టత యున్నదా?
కృ : లేదని నా యభిప్రాయము.
శం : ఆ పిల్లదాని కీతనియందో?
కృ : లేనట్లే వినికి.
శం : అటులైన వివాహ మెట్లగును?
కృ : తల్లిగారి బలాత్కారముచేత—
శం : పాపము! దాంపత్య మనుకూలముగ నుండునా?
కృ : దక్షిణకువచ్చిన నీకు దాంపత్యపు గొడవయేల? దినమునకు రెండు మూఁడు పర్యాయము లీచిన్నదాని నాతనిపై నునుకొల్పి, యాతని నీకన్యపైఁ బురికొల్పి, మారాజ్ఞి గారు వారి కన్యోన్యానురాగము గలిగింపఁ బ్రయత్నించు చున్నారు.
శం : అటులు బలవంతపెట్టిన వలపు గలుగునా?
కృ : సానపైఁ జెక్కను బడనరగఁదీయగ వలపు పుట్టుటలేదా? అలాగు రాపాడిం చఁగ రాపాడించఁగ గ్రమక్రమముగఁ గలుగఁ గూడదా?
(నేపథ్యమున)
కృష్ణా! తిండివేళ యైనది. కోటలోనికిఁ బోవలదా?
కృ : మిత్రమా! ఇదిగో! వచ్చుచున్నాను. అయ్యో! ఇఁక నొక్కమాటఁ జెప్పెదను. ఇదే సమయము ఈసరికి వారిద్దఱును — పెండ్లికొడుకుఁ బెండ్లి

కూతురును—క్రొత్త రీతిగ నొందొరులం బ్రేమించుటకుఁ బ్రయత్నింతురు. నే నింకఁ బోయెదను.

శం : ఈ దినమున నేను బ్రభువువారి సత్రమున భుజింతును.
(ఇద్దఱును నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

—*—

(పరిదేశము : త్రిపురములో నంతఃపురము)

(ప్రవేశము - పురుష రూపధారిణియగు కోకిల, బుద్ధిమతి)

కో : బుద్ధిమతీ! ఏమంటివి?

బు : (చేతులు జోడించుకొని) నన్ననుగ్రహింపు మంటిని.

కో : నిన్ననుగ్రహించుటకేకాదా మాప్రయత్నము?

బు : ఈ ప్రయత్నమును మీరు వదలి నన్ననుగ్రహింపవలయును.

కో : అభ్యంతరమేమి? ఈప్రయత్నముతో మాకేమి పనియున్నది? అంగీకరించితి నసుము. సర్వప్రయత్నమును వదలి నిన్ననుగ్రహింతును. నీ పాణిని గ్రహింతును.

బు : మహాప్రభూ! నన్నెన్నిసారు లనుమంటిరి?

కో : నన్నెన్నిసారులు నిన్ను వేఁడుమంటివి?

బు : మహారాజులగు మీరు నన్నింతగా వేడుట తగునా?

కో : ప్రార్థించినను వ్యతిరేకించుట నీకుమాత్రము తగునా?

బు : రాజేంద్రా! నేనింక నేమిసేయఁగలను?

కో : బుద్ధిమతీ! నేనేమి సేయఁగలను?

బు : మహారాజా! మీకేమి?

కో : నీకు మాత్రమేమి?

బు : నన్ను వలచినవాఁడు, నన్ను వలపింపఁజేసినవాఁడు నన్నుఁ గోరుకొనినవాఁడు నాచేతఁ గోరుకొనఁబడినవాఁడు, నన్ను బ్రతిగ్రహించినవాఁడు, తన్ను నాకిచ్చిన వాఁడు మోహనుఁడని మనవి చేసికొంటినిగదా!

కో : (తనలో) నీవు మోహనుఁ డెట్లని బహూమానించు కొనుచుంటివో నాకు వసంతుఁడు యదార్థముగ నట్లేగదా! మోహనుఁడు నాకెట్టి దుర్దయ మొనర్పఁదలంచెనో నీ వెఱుఁగకపోవుటచేత నిట్టులనుకొనుచుంటివి.

గీ. పతి పరస్త్రీగతుండైన ♦ సతి యెఱుంగ
కుండిన సుఖించు; సుఖమొంద ♦ నున్న కాంత
పతిని శోధింపఁగూడ; ద ♦ జ్ఞతయె తఱచు
నరులకు సుఖకారణము, జ్ఞా ♦ నంబుకాదు.

గీ. తెలివి హెచ్చినకొలఁది శో ♦ ధించు కొలఁది
కష్టసంకోచ హేతువుల్ ♦ ఘనములగును;
మంచిజాతద్దమునఁ బరీ ♦ క్షించు కొలఁది
శుద్ధమగునీటఁ గ్రిమితతి ♦ వృద్ధికాదె?

[ప్రకాశముగ] బుద్ధిమతీ! మోహనుఁడిప్పు డెక్కడ నున్నాఁడు?

బు : ఇక్కడనే యున్నాఁడు.

కో : ఎక్కడ ?

బు : (హృదయమునఁ జేపైచి) ఇక్కడ బద్ధుఁడై యున్నాఁడు.

కో : (తనలో) ఆహా! భగవానుఁడా!

గీ. పితను బాసి, రాజ్యమువీడి, ♦ పతినివదలి,
సుఖమును త్యజియించి, సిగ్గును ♦ సున్నఁజేసి,
యాఁడుగతిఁగూడఁ బోనాఁడి, ♦ యంగనలకు
భర్తఁగానుంటి నెంత ని ♦ ర్భాగ్యనైతి ?

మోహనుఁడిటనే కారాగృహమున నున్నాఁడు. బుద్ధిమతి యిటనే నాయిల్లాలగుటకు వేఁడఁబడుచున్నది. దైవోపహతయగు కోకిల బట్టతలకు మోకాలికి ముడిఁబెట్టఁదలఁచి యిటనేయున్నది. నలుగురిలో ముగ్గుర మిటకే చేరితిమి.

గీ. మహితపురుషార్థముల మోక్ష ♦ మార్గమెట్లొ
సాధనములలోనఁ బ్రపత్తి ♦ సరణియెట్లొ
తత్వములలోఁ బరబ్రహ్మ ♦ తత్వమెట్లొ
మాగణములో వసంతుండు ♦ మాన్యుండట్లె.

ఆ. వె. అట్టిప్రాణకాంతు ♦ నట్టడవిని ద్రోఁచి
యిటులె యతనిరాజ్య ♦ మేలనుంటి;

నన్ను, నాకు వచ్చు ♦ సమ్యగ్రాజ్యము నేలఁ
దగిన పతికి నిట్టి ♦ దాననైతి.

(నేపథ్యమున)

మహాప్రభూ! సార్వభౌముని రాజ్యము మీచేతఁ జిక్కినది. యుద్ధమున మీకు సంపూర్ణ విజయము తటస్థించినది. సేనాధిపతి భటులందఱితో వచ్చినాఁడు. మఱింత సంతోషకరమగు వార్త యేమనఁగ సార్వభౌముఁడు సేనాధిపతికిఁ జిక్కి యిటకుఁ దీసికొనిరాఁబడినాఁడు. ఈ సంగతులు మీయమ్మగారు మీతోఁ జెప్పు మనినారు.

కో : (తనలో) ఎట్టి దుర్వార్తలు కర్ణములఁ బడినవి! (ప్రకాశముగ) మిక్కిలి సంతసించితి నని మాయమ్మగారితో మనవి సేయుము. సార్వభౌము నవమానింపక తగిన గౌరవమున, నుచితస్థలమున నుంచుమని చెప్పుము. ఏలయన,

ఆ. వె. మనకు వశ్యుఁడగు న ♦ రుని కెంతమాన్యత
గనఁబరతుమొ యంత ♦ ఘనత మనకు ;
నావు వెన్న తోడ ♦ నడు గెంత మర్దింత్రు
కంటి కంత చలువ ♦ గలుగుఁగాదె!

సరే పొమ్ము.

(నేపథ్యమున) చిత్తము.

కో : (తనలో) హా! తండ్రి!

గీ. కూఁతు రొక్కతె లేచిపోఁ ♦ గుంది, యుద్ధ
మందు నోడి, రాజ్యమువీడి, ♦ యడుగుల కిను
పగొలుసులు గట్టఁబడు నిన్నుఁ ♦ బట్టి నాదు
ముందు నిలఁబెట్టి నెట్లు నేఁ ♦ గందునయ్య!

హా! తండ్రీ నీవు బందీకృతుఁడవై తీసికొని రాఁబడితివనియు, నీరాజ్యము మదధీన మైనదనియు నాకు వార్త పంపిన మాయమ్మకు సంతసించితి నని ప్రతివార్తఁ బంపవలసివచ్చెను! ఈ కన్య నుద్వాహము చేసికొను మని మా తల్లి నన్నుఁ బ్రేరేప నందులకుఁగూడ మహాభాగ్య మనవలసివచ్చెను!హా!

గీ. ప్రభువులని పెద్ద లోకప్ర ♦ వాద ముండు,
వారికంటెను బద్ధులు ♦ వసుధఁ గలరె?

నవ్వువచ్చిన నోరార ♦ నవ్వరాదు,
ఏడ్పువచ్చినఁ గన్నార ♦ నేడ్వరాదు.

గీ. అధికముగఁ బల్క లఘుచిత్తుఁ ♦ డం్రదు, మూతి
ముడుచుకొనియుండ గర్వసం ♦ పూర్ణుఁ డం్రదు,
మధ్యరీతిగనుండ సా ♦ మాన్యుఁ డితఁ
డెట్లు ప్రభువయ్యెనని వెక్కి ♦ రింత్రు జనులు.

ఆ. వె. మాటలాడునపుడు ♦ మనసీయఁగాఁగూడ,
దీయునట్లు కాని ♦ పింపరాదు;
పలికి పలుకనట్లు ♦ పలుకంగ వలయును,
జేసి చేయనట్లు ♦ చేయవలయు.

గీ. నవ్వురాకయే యొకపుడు ♦ నవ్వవలయు,
వగపురాకయే యొకపుడు ♦ వగవవలయుఁ;
గట్టెముకుటంబు, ముచ్చి బం ♦ గారు గద్దె,
కల్ల కత్తియుఁ గల నటు ♦ కరణిఁగాఁగ.

గీ. రాజపదమా ! మహాధికా ♦ రంబ ! యెట్టి
చిత్రనటనల జనుల వం ♦ చించుచుంటి,
నీవె సుఖివను వాడుక ♦ నీ వెలుపలి
డంబముల దడబడల గ ♦ ద్బదలఁ గలిగె.

హా! జరిగిన దేదో జరిగినది. వగచిన లాభములేదు. కాని యిదేమి ?

గీ. చెలియకుఁ బురుషుఁడు పతి గా ♦ వలయు నంచు
నాజగన్మాతయాజ్ఞ స్మ ♦ ష్ట్యాదినుండి
చెలియకును జెల్లె మగఁడు గా ♦ వలయు నంచు
నిపుడు మాతృదేవతయాజ్ఞ ♦ యే మొనర్తు ?

(నేపథ్యమున) రాజేంద్రా! మీయమ్మగారు మీ యొద్దకు వచ్చెద మను చున్నారు.

కో : సరే. (తనలో)

గీ. అమ్మయైనను, మముఁ జేయు ♦ బమ్మయైనఁ
గొమ్మ నొకకొమ్మతో నెట్లు ♦ కూర్పఁగలుగు?
నేకజాతీయ వైద్యుతా ♦ హీనశక్తి
సంయుతపదార్థములఁ గూర్పఁ ♦ జాలు నెవఁడు ?

(చంద్రిక, స్త్రీ రూపధారి యగు వసంతునితోఁ బ్రవేశించును.)

కో : అమ్మా! నమస్కారము.

చం : చిరంజీవి వగుము.

బు : అమ్మా! నమస్కారము.

చం : నీవుకూడ 'నమ్మ' యని పిలచెద వేమి? అత్తయనుము.

కో : (తనలో) అత్తయని పిలువఁదగిన దానను నేనే కదా!

వసం : (తనలో) బుద్ధిమతీ! మహారణ్యమునఁ గొట్టుకొనివచ్చి యెట్టులో యంతఃపుర మున జేరి మారుమగనికై ప్రయత్నించుచుంటివా?

గీ. ఇట్టులే నాదు కోకిల ♦ యేపురంబుఁ
జేరి; యేరాణిసేవను ♦ జేసి, నాదు
రాకపై నాశ వీడి యే ♦ రాజు నొంద
నున్నదో? యౌవనం బూర ♦ కుండఁగలదె?

చం : అబ్బాయీ! నీవు శీఘ్రముగ దీని నంగీకరింపఁ జేయవలయును. బుద్ధిమతీ! నీవు వీనిని వరియింపక తప్పదు. మీరిద్దఱు దంపతులు గాఁగఁ జూచు భాగ్యము నాకు లభింపఁజేయవలయును. వింటిరా? కొడుకు, కోడలని మిమ్ము లను జూచుకొని దినములు గడుపుకొని యుందును. లేనికొడుకు లేనే లేఁడు.

వసం : (తనలో) అమ్మా! నీ కొడుకు మొద్దులాగున నిచట నున్నాడు. అయినను నీ కొడు కని చెప్పుకొనునట్టి స్థితిలో లేఁడు. నీవు పెంచుకొన్న కొడుకునకు ముందు కాఁబోవు భార్యకు దాసిగా నుండదగిన వేషమున నున్నాఁడు.

చం : ఏదీ! మీరొండొరులఁ బల్కరించుకొనుఁడు. మీయనురాగాంకుర మేమాత్రము చిగిర్చెనో కనిపెట్టుదును. 'పదునాలుగేండ్ల కన్యకుఁ బదునాఱేండ్ల వరుఁ డేమి? వరహీనత కాదా' యని యూరనున్న యమ్మలక్కలు బుగ్గలు నొక్కు కొన్నను మీరిద్దఱు నాయాజ్ఞానువర్తులై యుందు రని యాసపడి యిట్లు కోరి తిని. నాయాశ వ్యర్థము సేయకుడు. బుద్ధిమతీ! మా అబ్బాయి మెత్తనివాఁడే నీవే కలుకుపడను గయ్యాళివి. జాగ్రత్త! అబ్బాయి! కానీ!

కో : (బుద్ధిమతి దరిజేరి) బుద్ధిమతీ! ప్రాణప్రియా!

చం : సరే! మాటలు బాగుగనే యున్నవి. కాని ముఖమందు రసమొప్పుట లేదు. రసోదయముకాని పాత్రవలె బాఠమునొప్పఁ జెప్పినతోఁడనే పని యైనదను కొంటివా? అందుచేతనే నీవింతకాలము నుండి దీని మనసును గరఁగింపలేక పోయితివి.

కో : (తనలో)

గీ. ఉవిద పురుషరూపము నొంది ♦ యున్ననైన
స్వస్వభావపై ఖరులు మా ♦ ర్పంగఁబడుట
గలదె? కవిత భాషాంతరీ ♦ కరణ మొంది
నను గథారాదు లన్నివె ♦ న్కటివికావె!

చం : ఊరకుంటి వేమి? మఱియొకసారి యనుము.

కో : బుద్ధిమతీ! ప్రాణప్రియా!

చం : ఛీ! ఛీ! ఈసారి మఱింత పాడైన దేమి?

కో : (తనలో)

గీ. మొదలె చేతగానితనము, ♦ బిదప సంభ్ర
మం బమరఁ గార్య మెట్లుధ్వం ♦ సంబుగాక
తీరు? మొదలె నత్తి, పిదపఁ ♦ దీవ్రకోప
కలన గలుగఁగ మాట రాఁ ♦ గలదె పైకి.

చం : (బుద్ధిమతివంక దిరిగి) నీ నాధుఁడు పిల్చుచున్నాఁడు. నీవే మందువు? కానీ! సిగ్గుపడకు.

బు : (కోకిల వంక దిరిగి) నేను నీకుఁ బ్రాణప్రియను గాను.

చం : ఓసీ! కొఱుకురాని కొయ్య! ఇదేమి? ఇన్నాళ్ళనుండి చెప్పిన చదువునకు ఫల మిదేనా? ఇంక నేలయంటు వద్దనే యేడ్చుచుంటివా? ఆఁ! అటులు గ్రుడ్లు పెట్టుకొని చూచెద వేమి? 'నీ ప్రాణప్రియనుగాన' యనినదానవు 'కాఁగల'నని యనలేవా? అతఁడు నీవు కొంచె మెచ్చుతగ్గుగ సమవయస్కులే కద! అతని జూచియైనను సిగ్గుతెచ్చుకొనరాదా? అతఁ డెంత చొరవగ మాటలాడుచున్నాఁడో చూడు!

కో : (తనలో) బుద్ధిమతీ!

గీ. నీ యనిష్టతచేతనే ♦ నేను మొండి
బారి తగుదు నంచును ♦ సిద్ధపడితి; నీవె

నన్ను వరియించునతులైన ♦ నాదు మగత
నంపుఁబస బైటఁబడి తల ♦ వంపు గాదె?
గీ. పుట్టముల బిట్టుకట్టుటచేఁ ♦ బురుషుండును, ద
దితర సకల వై ఖరులచే ♦ నింతి యగు; మ
గమ్మ లిల నెంద ఱున్నారొ? ♦ యట్టిపోతు
ముత్తయిదువు లందున నొక్క ♦ ముదిత నేను.

చం : బుద్ధిమతీ! తిన్నఁగ మాటలాడెదవా? బుగ్గపై పొడువుమంటివా?

వసం : అమ్మా! తొందరపడకుము. పిల్లది. కసుగాయ అన్నియు ననఁగలదు.
అన్నియుఁ జేయఁగలదు. సమస్త మిప్పుడే కావలయునని తొందరపడిన
నగునా? శాంతింపుము.

చం : మగఁడు పెండ్లామనుచు వీరిద్దఱు నాకన్నుల యెదట శ్రవణానందముగ మాట
లాడుకొందురేమో చూడవలెనని నాకు గొండంత యాశ యున్నది. పెద్ద
దానను; ఆ మాత్రపు వేడుక నా కంటి యెదుట జరుగుటకు నేను నోచుకొన
గూడదా?

వసం : అమ్మా! సగ్గు వదలి చెప్పుచున్నాను. మాతృదేవతయైన నీ యెదుట వారేమాట
లైన మాటలాడుకొందురు; కాని శృంగారపు మాటల నాడుకొందురా? ఉప
నయనములు, వివాహములు కోవెలలో దైవసన్నిధిని జరిగింపవచ్చునుగాని
గర్భాదానము లట్లు జరుగనీయవచ్చునా?

చం : సరి, సరి. నీవు గూడ మా పెద్దమ్మకుఁ దగినదానవే దాఁపరించితివి!

వసం : అమ్మా! క్షమియింపుము. క్రమక్రమముగా నామెయే యొప్పుకొనును.

చం : క్రమక్రమ మనఁగ నేమి? నా మొగము! నీ మొగము! ఇదివఱ కెన్నియో
నెలల నుండి చిలుకకుఁ జెప్పినట్లు చెప్పిచెప్పి ప్రాణములు విసిగిపోయినవి.
ఏమేయనఁగ నెప్పటి మాటయే అబ్బబ్బ! ఈ కొంకనక్క నా నెత్తురు నావార
పోయుచున్నది! నా యెముకలు కటకట కొఱుకుచున్నది! బుద్ధిపూర్వకముగఁ
గొనితెచ్చుకొనిన పీడ. ఏమే? ముంగివలె మూతి ముడుచుకొని యూరకుంటి
వేమి? పశువా! పశువా! పదునాలుగేండ్ల పడుచవు; పతియక్కఱలేదా? బ్రహ్మ
చారిణి వగుదువా?

వసం.: ఆమెకుఁ బతి యక్కఱ లేకపోవుట కాదు. మఱియొకనిపై నామె యనురా
గము లగ్నమైన దేమో?

చం : ఆఁ! ఆఁ! మఱియెవ్వఁ డున్నాడు? ఓసీ! నిర్భాగ్యురాలా! అతఁడు నీకుఁ
బ్రాణనాథుఁడు గానియెడల నీకు మగఁడు మఱియెవ్వఁడు?

వసం : ఇప్పుడు మీ రామె నడిగిన ప్రశ్నము నామెకుఁ బతిగావలసిన యబ్బాయిగారి చేతనే యడిగించిన మంచిది.

చం : (కోకిలవంక దిరిగి) ఊఁ ఊఁ! కాని! నీకు మగఁ డెవ్వఁడు? ఊఁ

కో : (తనలో)

గీ. ఎవఁడు సార్వభౌముని కల్లుఁ ♦ డవునొ? యెవ్వఁ
డేకపుత్రుఁడు నీకౌనొ? ♦ యెవ్వఁడు మన
రాష్ట్రియుగమును మ మ్మేలు ♦ రా జగునొ? య
తఁడు వసంతుఁడు నాకు భ ♦ ర్త యగుఁగాదె?

చం : కానీ! అబ్బాయి! ఊరకుంటివేమి? నీకుఁ మగఁ డెవ్వఁడని దాని నడుగుము?

కో : (తనలో) బుద్ధిమతీ!

గీ. నీవు నన్నొల్లకుంటచే ♦ నీ వదృష్ట
వతి వగుటెకాక స న్గూడఁ ♦ బరమ భాగ్య
యు క్తఁగాఁ జేసినావు; లే ♦ కున్నఁ గట్టఁ
గట్టుకొని దిగవలయును ♦ గంగ మనము.

(ప్రకాశముగ) బుద్ధిమతీ!

గీ. ఎవని నామము స్మరణీయ ♦ మవునొ నీకు?
నీ కటాక్షాళి కర్హుఁడై ♦ నెగడియుంట
నెవఁడు నా కంటె ఘనతరా ♦ దృష్టయుతుఁడొ?
యట్టి నావైరి యెవ్వడొ? ♦ యాన తీవె.

చం : నాయనా! నీ లోప మేమియు లేదు. నీవు బాగుగనే యడుగుచుంటివి. మొగము కొంచెము పేలవముగ నున్నది కాని—

బు : ఎన్నిసారులు చెప్పమంటివి? నాపతి మోహనుఁడు.

చం : ఈ చిలుక పలు కెప్పుడు నా యొద్దఁ బలుకలేదే! ఆఁ! ఆ మోహనుఁడెవ్వడు? ఏ మోహనుఁడు?

కో : మన కారాగృహములో నున్న మోహనుఁడు.

బు : (తనలో)అయ్యయ్యో! నా పతికిఁ గారాగృహ నివాసయోగము తటస్థించినదా? హా! మోహనుఁడా నీవు కారయందు బద్ధుడవై యుంటివి. నేను నగరునందు

నీకొఱ కేడ్చుచు బద్ధురాలనై యుంటిని. కాని నా కంటె నీవె యదృష్టవంతుఁడవు. అక్కడ నీ కర్తగారి పోరును, మాఱుమనుము బాధయు లేకున్నవి.

చం : ఆఁ! ఆ? వాఁడే? ఆ మోహనుఁడే? ఆ నిర్భాగ్యుఁడే? ఆ నీచుఁడే ఏమి! బుద్ధిమతీ! ఇంతబుద్ధిలేనిదానవా? నీకుఁ గన్నులులేవా? మనసున్నదా? యుక్తాయుక్త విచక్షణత గలదా? గుణగ్రహణ మున్నదా? మంచి చెడ్డలకు భేద మెఱుంగుదువా? ఉర్వీనాథుఁ డెక్కడ; ఉపగ్రహుఁ డెక్కడ? అఖండవైభవుఁ డెక్కడ; అధమాధముఁ డెక్కడ? సర్వజనపరిపాలనదీక్షాదక్షుఁడెక్కడ; శాశ్వతఖిలశిక్షాపాత్రుఁ డెక్కడ? ఛీ! ఛీ! ముడుచుకొని మూలగూరుచుండి మూడుసోలల మొక్కజొన్నలు మెక్కు మోహనుఁడు నీకుముద్దుల మగఁడా? ఓసీ! అపవిత్రులారా! ఆచార మక్కఱలేదా? అన్వయ మర్యాద యక్కఱలేదా! అవమాన భయముతో నీకుఁ బనిలేదా? ఆఁ! ఆఁ! కారాగృహమునందున్న దుర్మార్గునే వలచితివా?

కో : (తనలో) అమ్మా! అమ్మా! తిట్టకుము. నేను గూడఁ గారాగృహమందున్న వానినే వలచితిని.

వసం : అమ్మా! కారాగృహమం దుండువారందఱును దుర్మార్గు లగుదురా?

చం : నా కొడుకు వసంతుఁడు తప్ప—కాని, యీ ఛండాలునకు నీ మోహనునకుఁ గారాగృహప్రాప్తి యేల యయ్యెనో నీ వెఱుఁగుదువా?

వసం : అమ్మా! సెలవిచ్చెదవుగాక! (తనలో) హృదయమా! నీవు భయపడినట్లే జరిగియుండునా? అటులే యైనయెడల శీఘ్రముగఁ బగిలిపొమ్ము.

చం : ఎవతెనో బలాత్కరింపఁ బ్రయత్నించెనఁట!

కో : (తనలో) ఎవతెనో యనఁ నేల? నన్నే.

వసం : ప్రయత్నించుటయేకద!

కో : (తనలో) అంతకంటె వానితర మగునా? నేను రాజకులోద్భవను కానా? అభిమానధనను కానా? నైజక్షత్రతిలాకాంతను గానా? అపత్సమయమున నభిమానావనముఁ జేసికొనలేకపోయిన యాఁడుదాని బ్రదు కేల?

చం : ప్రయత్నించుట కాకపోయిన నా పాపి సఫలిత మనోరథుఁ డగునా! ఆమె యే మహానుభావురాలో! యే మహాపతివ్రతయో—

కో : (తనలో) నీ కోడలే.

వసం : (తనలో)

గీ. హృదయమా! గిట్టు మని త్రిప్పి • యిలను గొట్టు
ఖడితి వింతకు ముందు; నీ • వడఁగి యాఱి

పోయి తనుకొంటి తడిమంటి ♦ ముద్దలాగు;
కెరలి కందుకమ ట్లుబి ♦ కితివి మఱల.

బు : (తనలో) నా నాథుఁడీ కోకిలను బలాత్కరింపఁ బ్రయత్నించి యుండెనుగాఁ బోలు! అతఁడు మిగుల మంచివాడే కాని, పూర్వకర్మ పరిపాకమునుబట్టి యీ జన్మమున నాతని కీదురోగ్యగము తటస్థించెను. అతని బుద్ధి యింక నితర కాంతలపైఁ దగిలినసరే, యింక నాతని కథమాధమస్థితులు లభియించినసరే, యాతఁడే నా నాథుఁడు. అతని గాదని మహేంద్రుడైన నొల్లను. అట్టిచో నీరాజన నా కెంత?

చం : అబ్బాయి! ఈ దాసి యెవతెయో యెఱుఁగుదువా?

కో : ఇంత సేపటినుండియు దానివంకనే చూచుచుంటిని. ఇట్టి మొగము గలదానిని మఱియొక్క తె నెచ్చటనో చూచినట్లున్నది.

వసం: ఎచ్చటఁ గాంచినట్టున్నదో జ్ఞప్తి తెచ్చుకొనఁగలరా?

కో. గీ. కాంత, జ్ఞప్తి, సౌఖ్యము, తమ ♦ యంత తామె
దేని దగు పురస్కృతినొ సి ♦ ద్ధింపవలయుఁ
గాక రావలయు నని యా ♦ కర్షణఁ బొ
నర్పఁ గవితమాదిరిని వె ♦ న్కకును బోవు.

బు : ఈ నీతి యెఱిఁగినవాఁడవు నన్నేల యాకర్షింపఁ దలఁచితివి?

చం : పండ్లూడఁగొట్టెదను. నోరు మూసికొనుము. నీదొక జన్మమేయని సిగ్గులేక మాటలాడుచుంటివా?

కో : (తనలో) ఓసీ! వెట్టి బుద్ధిమతీ!

గీ. ఏను నీవంటిదాన నం ♦ చెఱుఁగ వీవు,
నీకు మోహనుపై; బుద్ధి, ♦ నాకు నల వ
సంతుపై; మనలను జోడు ♦ సలుపఁదలఁచె
నమ్మ! ఱోటిని దిరుగలి ♦ దిమ్మనట్లు

చం : నాయనా! ఈ దాసిని నీ వెప్పుడు చూచి యుండలేదు.

కో : దీనిని జూచితినని చెప్పియుండలేదు. దీనివంటి దాసిని.

వసం: (తనలో) నావంటి దాసిని నీవేకావు, ప్రపంచమున నెవ్వరు చూచియుండరు.

గీ. లోన మగవాఁడు. రాజబా ♦ లుండు; పైకి
నాఁడుపడుచుం బొనిస; యెంత ♦ యంతరంబొ

పైకి: లోనికి: షండత్వా ♦ శాపమునను
గొజ్జకంబెను ఖరతరా ♦ ఘుండ నేనె.

కో : యుగము తీరిదియే, రాత్రిభాగము కావున బాగుగ(జెప్ప(జాలను.

చం : దాని నెక్కడ(జూచితివో? ఎప్పుడు చూచితివో? అదిమాత్ర మిదికాదు. ఏలన—ఇది మా పుట్టింటివారిచే నాకరణ మీయ(బడిన ముసలిదానికి సన్నిహిత బంధువ(ట. అదియే దీనిని బాగుగా నెఱు(గదు. నిన్ననే వచ్చినది. తెలివిగలది నాకు విశ్వాసమగు స్థానమునుండి వచ్చుటచే దీనిని నీవు కూడా నమ్మవచ్చును. చిన్నరాణికి(జిన్నదాసి యుండుట యావశ్యకమని బుద్ధిమతి కొఱకు దీనినుంచితిని. ఏదీ? ఆ నిర్భాగ్యురాలికి రాజ్ఞీయోగముకాదనా? నిక్షేపమువంటి చక్రవర్తి పుత్రుడు — రూపవంతు(డు — యౌవన సంపన్ను(డు—విద్యావంతుడు—ధీశాలి-వాక్చతురు(డు-వినయధురీణుడు-సుగుణసంపన్ను(డు - మాతృవిధేయు(డు - వరింప ముహూర్తము నిగించుకొని, యెదమొగమ్ము పెడమొగము(బెట్టుకొని, కన్నులు చిట్లించుకొని, పెదవి విరుచుకొని, కోతివలె నిగిల్చిచుచు. సిగ్గులేక-మర్యాదలేక-దౌర్భాగ్యుని-అధముని-ఎందఱు చెలులనో చెఱ(బట్టి తా(జెఱ్ఱ(బడిన పాపాత్ముని—వలచి—వలచి—ఛీ! దిక్కుమాలినదావా? నీ వెక్కడనుండి వచ్చితివో? నీ బుద్ధి బుగ్గియగు వఱకు మాఱునా?

వసం: అమ్మా! శాంతింపుము.

చం : ఇదివఱకు శాంతించితిని. ఇప్పు డెక్కడ శాంతి! ఆమహారాజేగినా(డు: శాంతి నొందలేదా? ముద్దుముద్దుగ నోడిలో(బాలుదావు మూ(దేండ్ల కొడుకు ముక్కలై పోవ(గ శాంతినొంది యుండలేదా? అయినదేదో యైనది. ఈ పైన వానిమూలముగ(గాపుర మీ(ద(దల(చియుండి వాని నొక్కయింటివానిని జేయ(బ్రయత్నింపవ, నందుల కీ బానిస యంగీకరింపపోవలయునా? నిర్దాక్షిణ్యముగ(దిరస్కరింప వలయునా? పెంచిన పెద్దతనమైన(జూపవలదా? ఇ(క నేనెట్లు శాంతింతును?

కో : అమ్మా! మూ(దేండ్లకొడుకు ముక్కలై పోవ(గ నంటివి. అదేమి? అత(డు సార్వభౌమ రాష్ట్రమున(గారాగృహబద్ధు(డై యున్నా(డుకదా!

చం : ఉన్నా(డు; ఏ పులివాతనో! ఏ నీటిగో(తనో!

వసం: (తనలో) ఇచ్చటనే నీ ప్రక్కనే యీ నిర్భాగ్యు(డున్నా(డు.

కో : అమ్మా! ఆత(డు మరణించినట్లు యథార్థ వార్తలేవియు రాలేదుగద!

వసం: (తనలో) ఒకసారి మరణించినట్లు కాదు.

గీ. ఎప్పుడు నాప్రాణ మగు కాంత ♦ యేగె నపుడె
చచ్చితిని; తల్లి ననుఁ జేరి ♦ చచ్చె కొడుక
టంచు విలపింపఁ జచ్చితి; ♦ నకట! మఱల
జగతికే మొట్టమొదటనే ♦ చచ్చినాఁడ.

చం: ఇఁక నెక్కడి కొడుకు? ఎప్పు డస్త్రాలనుండి జారిపోయెనో యప్పుడే యాస వదలు కొంటిని. ఇంక నీ వెఱ్ఱియేమి?

వసం: (తనలో) బుద్ధిమతీ! నేను జీవించియున్నట్లు నీ వెఱుగుదువుకదా! నీనైనఁ జెప్పరాదా?

చం: ఈ యవకాశమును దీసికొని మన రాష్ట్రమున కాసపడి 'నేనే వసంతుఁడు నేనే వసంతుఁడ'నని దొంగ వేషము వైచుకొని యింక నెవ్వరైన నిటకు వత్తురు. ఇప్పుడు రెండవ రాష్ట్రమువాఁడే మనకు సిద్ధించిన దౌటచే మఱింత యాసపడి వత్తురు. నేనే వసంతుఁడనని వచ్చినవానిని, వాఁడు వసంతుఁడని స్థిరపఱచు వానిని నా సెలవక్కఱలేకయే తుపాకిని వేయుమని నేను నిన్ననే ద్వితీయ సేనాధిపతికి నాజ్ఞ యిడితిని.

వసం: (తనలో) అందుచేతనే నే నీ సిగ్గుమాలిన వేషమును ధరించి రూపుమాపు కొని యిట్లుంటిని.

కో: హరిహరీ! అంత దారుణమైన యాజ్ఞ నేల సేయవలయును?

వసం: (తనలో) సెబాస్! రాజపుత్రా!

ఆ. వె. నాకు వైరి వీవుఁ ♦ నాతల్లి యగు నీమె;
యంతకంటె నీవె ♦ యధిక కృపను
గలుగువాఁడ వైతి! ♦ కాలమా! నీ చర్య
లింత వైపరీత్య ♦ మెనెసె నేమి?

ఆ. వె. తల్లియైన నేమి? ♦ తండ్రియైనను నేమి?
పుత్రుఁ డధికుఁడైన ♦ ముఱియుచుండ్రు;
కాకయున్న సుతుఁడు ♦ గాఁడు; మా కను మహా
కలియుగంబు వచ్చెఁ ♦ గాదె? యిపుడు.

చం: అబ్బాయీ! దారుణమైన యాజ్ఞయని నీ విప్పుడంటివి! అట్టివాఁడు తటస్థించిన మనకు రాజ్య మెంత కల్లోలమగునో చిన్నవాఁడవైన నీకేమి తెలియును? ఊరకుండుము.

వసం: (తనలో) అట్టివాఁ డిప్పు డిచ్చటనే తటస్థించినాఁడుకదా? ఏమి యగునో చూచెదముగాక!

కో : (తనలో) రాజ్యము కల్లోలమైనసరే, ప్రపంచము తలక్రిందులైనసరే, ఏది యేమైనసరే, నాకు వసంతుఁడే కావలయును.

చం : వాహినీ! చూడు! మన మేదో పిచ్చ, పాటి, కష్టము, సుఖము మాటలాడు కొనఁగ—జూడు! తాను మూతి ముడిఁబెట్టుకొని రొసరొసలాడుచుఁ బ్రపంచమునంతను దానే యుద్ధరించునట్లున్నది. అబ్బ! ఇంత యొంటరిమెట్టు దాని నే నెచ్చటను జూచియుండలేదు.

వసం: బుద్ధిమతీ! ఏల సిగ్గు! ఇక్కడ నీమగఁడు తప్ప మనమందఱము కాంతలమే కద! నీకు సందేహ మేల?

కో : (తనలో) మగనిగూడ మగువలలోనే చేర్చుకొనుము.

చం : సిగ్గందు పేల? తగునట్టి సిగ్గు నగయే, సిగ్గుకాదు. నాలిముచ్చదనము.... పెంకితనము-కష్టపడి-మొండివేసము-ఎందులకు? ఎందులకు? ఇఁకను నేనేదో తెగతెంపులు చేసికొనఁ దలఁచుకొంటివి. నాయనా! ఈ బండను మఱియొక సారి కదిపిచూడు ఇటో యటో స్థిరపఱచుకొని మఱిపోయెదను?

వసం: అమ్మా! ఈ బొమ్మల పెండ్లితో నీకేమి ప్రయోజనము?

చం : బొమ్మల పెండ్లియైనఁ గావలసిన దేమున్నది? మన యిష్టత వచ్చిన బొమ్మను మరియొక బొమ్మతోఁ గూర్తుము. ఇక్కడ నట్టి యవకాశ మేమున్నది? అమ్మయ్యో! ఈ గయ్యాళి నేను జెప్పినట్లు వినునా? ఈ రాకాసి నామాట లక్ష్యము సేయునా? ఇటుచూడుమన్న నటు చూచును. ఇటు తిరుగుమన్న నటు మూతి త్రిప్పును. ఎంత స్వతంత్రత! ఎంత చండితనము! ఎంత మూర్ఖత! ఎంత మోటపాకము!

వసం: అమ్మా! నాకుఁ దెలియక యడుగుచుంటిని. ఈ వివాహమువలన సుఖ మెవరికి?

చం : నాకు. మఱి యెవ్వరికి? నీకు మతిలేదా? అటు అడిగెద వేల?

వసం: అమ్మా! అసందర్భముగ లేదా? అటు లనెదె వేల?

చం : ఆఁ! ఆఁ! అసందర్భమా! నా వయసు వల్లకాడై, నా దాంపత్యము దగ్ధ పటలమై, కాటికిఁ గాళ్ళుచాఁచుకొని యదిగో! ఇదిగో! యన నున్న నాకుఁ జిలుక, గోరువంకవలెఁ బలుకులాడుకొనుచు, ముద్దుముద్దుగ ముఱియుచు "కీ కా" యని కెరలాడుచు వీ రిద్దఱుండఁగ నేను జూడఁగోరుట యసందర్భమా? వీరి యాలాపములు, అల్లరులు, 'ఆఁ ఊఁ'లు విని నేనామోదింప గాంక్షించుట యసందర్భమా?

వసం: అమ్మా! కోపపడకుము. భార్యాభర్తల సమాగమము ముందుగా మూలనున్న ముసలిదాని ముచ్చటకా?

చ : సరి, సరి. కొడుకు, కోడలు వాడిరని మేము గొంతుక కురిపోసికొని చావ వలసినదా యేమి? ఈ పాతిక నోరు కట్టిపెట్టుకొనుము.

వ : అమ్మా! కోపము వలదు. అన్యోన్యానురాగము లేని సతీపురుషులఁ గూర్చుట తప్పునని.

చ : అన్యోన్యానురాగ మని యిప్పు డొక క్రొత్తమాట దాపురించినది. మా అబ్బనాఁ డెఱుఁగము. మా తాతనాఁడెఱుఁగము. ఈ విచిత్రము— ఈ విపరీతము— లోక విరుద్ధత — "పెండ్లి చేసుకో" యనుసరికి నోరుమూసికొని, కిక్కురు మనక, చచ్చినట్లు చేసికొనుటయేకాక యెప్పుడైన నెఱుఁగుదుమా? ఈశ షభిషలు—ఈ జాణతనములు—ఈ యన్యోన్యానురాగములు—ఈ యభినవ నాగరికతలు! అన్యోన్యానురాగము లానక యొపోసన మైన తరువాత కలుగఁ గూడదా? ఒకరిద్దఱు సంతానము గలిగిన మీఁదటఁ గలుగఁ గూడదా? కలుగకపోయిన మాత్రము బాధ యేమున్నది. మాయాయనకు నాకు "హరీ" యన్న వఱకు రాగ మారంభించినట్టు కనఁబడనేలేదు. లేవని కాపురములు చేయలేదా? పిల్లలఁ గనలేదా? దానిలోపము చేతికడ్డమా? నోటికడ్డమా?

కో : (తనలో) నీ నోటికిఁ జేతికి నేమియు నడ్డము లేదు.

వ : (తనలో) ఆహా! ఈమె యజ్ఞానము పరిమితిలేక ప్రకాశించుచున్నది. (ప్రకాశముగ) అమ్మా! బుద్ధిమతి కీ రాజబాలునిపై ననురాగము గలిగిన పిమ్మట వారిఁ గలుపవచ్చును. అంతవఱకు వేచి యుండుము.

బు : (తనలో) అది స్వప్న వార్త.

చ : క్రమక్రమముగాఁ నదే కుదురునని నేను జెప్పియుంటినిగాదా?

కో : (తనలో) క్రమక్రమముగఁ గుదురుట కిది యేమి రోగమా?

వ : నా మనవి విని వారి కనురాగము కలుగువఱకు నీవు తొందర పడకుము.

చ : ప్రేమములు గలుగువఱకు సంబంధములు పీఁటలు పెట్టుకొని కూరుచుండునా? అన్నపుడెల్ల రాజసంబంధములు తటస్థపడునా?

వ : రాజసంబంధమేకాని సమకూడిన వీలులేదా?

చ : వీలున కెక్కడికి? బొందునఁ బుసైను గట్టుకొని గూరుచుండినఁ గొట్టువా రెవ్వరు? కాని రాజసంబంధమునఁ గల్గులాభము లిన్నియని చెప్పఁదరమా? ఒడలు పట్టినన్ని నగలు! వేలకొలఁది జలతారు బట్టల పెట్టెలు! అడుగులకు మడుఁగులు! "ఆఁ!" యనుసరికి గడగడలాడు నాశ్రితులు! అంతఃపురమున హంసతూలికా తల్పములు! మణుఁగుల కొలఁది వెండి బంగారములు! గజములు! శంఖాణములు! శంచర గాడిద్దెలు! కాలికొక్కదాసి! కరమున

కొక్కుదాసి! కణుపునకొక్కుదాసి! తెగులా! రోగాలమా! నిక్షేపములాగు ననుభవింపలేక తెగనీలుగా! ఆ!

వ : అనుభవింపఁదగిన వస్తువుల ననంతదారసత్వమునే చెప్పితివికాని దంపతుల సుఖముమాట చెప్పవైతివేమి? అమ్మా! భర్తను నిర్ణయించుకొనుటలో స్త్రీకిఁ గొంత స్వాతంత్ర్య ముండఁదగునని నా యభిప్రాయము.

చ : ఇదిగో! అసంబరమైనదికాదా? ఆ యవశిష్టత దీరినది కాదా? ఏరినది! ఏరినది! మహాచక్రవర్తియైన మగనిని. కడుపునిండిన కాంతుని-ఆ! వలచినది! ప్రేమించినది! సర్వస్వతంత్రతచే మోహించినది!—బండ్లులాగు బానిసను—ఎన్ని కాపురములో దెబ్బలు దీర్చిన విటాధముని-ఆఁ! ఆఁ! అమ్మగారికిఁ గాళ్లకు గొలుసులు లేకపోయిన నయ్యవారికి గలగలలాడుచున్న యినపగొలుసులు సింగార మున్నది! అమ్మగారికిఁ జేతికిఁ దొడవు గొలుసులు లేకపోయిన నయ్యవారి చేతులకు బొండగొలుసు లున్నవి! అమ్మగారి కంతఃపుర నివాసము లేకున్న నయ్యవారికిఁ గారాగృహ నివాసమున్నది! అమ్మవారికి గృహసంచారమున దాసదాసీ జనులు లేకున్న నయ్యవారికి గ్రామసంచారమున ననేక దాసజన పరివార మున్నది! ఆఁ! సమృద్ధి ఇఁక సుఖమునకు లోపమేమి? అయ్యవారి నెత్తిపైఁ మట్టితట్ట! అమ్మవారి నెత్తిపైఁ జేతతట్ట! — ఇదిగో! స్వతంత్రతా ఫలము. స్వాతంత్ర్యత చట్టుబండలైనది! వాహినీ! నీ విషయమున నాతో నింతవాద మేల వేసెదవు? ఇంక నోరు మూసికొనుము. జాగ్రత! నీవుకూడ మా పెద్దమ్మవలెఁ జదు వేడ్చితివా యేమి?

వ : అమ్మా! క్షమింపుము. (తనలో)

గీ. తనకుఁ దోచదు, బోధింప ♦ వినదు, వార్ధ
కంబునను మొండివట్టు బిం ♦ కముగఁ బట్టు
గద; యబలయు నరిసెలపా ♦ కంబు ముదురు
కొలఁదిని గొలుక రానట్టి ♦ కొయ్య గావె?

చ : నాయనా! ఏదీ! యింకొకమాఱు దాని నూఁపి చూడుము. ఏదో నా యిష్టము వచ్చినదారిఁ ద్రొక్కుదును. కానీ! వేగఁగానీ! నా ప్రాణము విసిగి పోయినది.

కో : (తనలో) హరిహరీ!

గీ. ముదుసలికి నుచితత లేదు; ♦ బుద్ధిమతికి
లేదు వలపు; మగతనము ♦ లేదు నాకు;
నింకఁ బ్రపంచయాత్ర జరుగు ♦ టెట్టు మాకు?
మూఁడులేదుల యద్వైత ♦ మునకుఁబోలె.

(ప్రకాశముగ) (బుద్ధిమతిని సమీపించి)

ఆ. వె. వాఁడిచూపుగమికి ♦ భయపడి నే నీదు
ముద్దుచెక్కు లిట్టి ♦ పుడుకకుండఁ
బోవఁగలనె? ముండ్ల ♦ పోటున కల్కి! గు
లాబిపూవు నెవఁడు ♦ లాగకుండు?

(బుద్ధిమతి బుగ్గలు నులుమగఁ గోకిల చేయి చాఁపఁగ బుద్ధిమతి యా చేతిని దన యెడమచేతితోఁ ద్రోయును.)

బు : ఆ! ఆ! నే నేమి స్వైరిణి ననుకొంటిరా?

చం : ఆఁగు. ఆఁగు. ఆమట్టున కాఁగు. ఏమీ! అతఁడు చేసిన తప్పేమి! ముద్దు ముద్దుగ బుగ్గలు నులుమఁబోఁగ నింత పొగరమా? ఇంత యల్లరియా? ఇంత గయ్యాళితనమా? పండ్లు విరగఁ బొడిచిన యెడల నీకుఁ దగిన బుద్ధియే వచ్చి యుండును.

బు : అయ్యా! మీరు మహారాజులు. సర్వసద్గుణ. సమలంకృతులు. సమస్త విద్యా పారంగతులు. అయినను మీపై నా ప్రేమము ప్రసరింపలేదు. క్షమింపుఁడు నేను వలచిన యాత్ర దధముఁడే కావచ్చును. ఇన నా కాతఁడేఘనుఁడు. అతఁడనా కారుఁడే కావచ్చును. కాని నా కంటి కతఁడే మదనసముఁడు. అతఁడు మీ దృష్టి చేత నేరీతిగ నుండునో యది నా కావశ్యకముకాదు. అత నితో జోక్యము నాకు కాని మీకుకాదు. అతని కర్హమైన యీదేహమును మీరు స్పృశింపఁ బ్రయత్నించుట న్యాయమా! మీరు సత్యమును దెలిసినవారే కద!

కో : (తనలో) ఆహా! ఆఁడుది యన్న నిదియే. అనురాగ మన్న నిదే. ఆహా! భర్తని యవ్యాజభక్తివలె నీమె భర్తృనురాగము ప్రకాశించుచున్నది.

చం : (ఉస్సురనుచు) ఓసీ! బానిసా! ఏమంటివి? ఇటు చూచి చెప్పుము.

బు : అమ్మా!

చం : అదిగో! ఆ వంకకూఁత కూయవలదనేకాదా మొన్న నెత్తినాయుం గొట్టినది.

వసం : (తనలో) హరి హరీ!

బు : నేను మీకుఁ గోడలనైనను మీ పరిచర్య చేయుటకే కద! నేను భృత్యురాలనై యంతకంటె నెక్కువ చేయుదును. నన్ను క్షమింపుము.

చం : నీవు నా కోడలవు కాకుండిన యెడల నిన్ను నా కొంప నుండనిచ్చెదనా? నీ సేవ నంగీకరింతునా? నీ మానాభిమానములు దక్కనిచ్చెదవా? నీగొంతుకఁ గోయ కుందునా? ఆ! ఎంత భయభక్తులు లేని ప్రవర్తనము! నిర్భాగ్యురాలా! నోటికి సిరిలేక, యొడలికి సువర్ణభారవహనయోగము లేక కంటికి మహా

పై భవదర్శన యోగము లేక, నెత్తిపై నినుపగజ్జల తల్లి భాగవత మాడ నీకు మంచిబుద్ధి యేల పుట్టును? అధమా! పిశాచీ! చండాలినీ! (కొట్టును.) నేఁటి రాత్రి మొదలుకొని నీ కైదు దినములు మితినిచ్చితిని. ఆమితిలోపుగ నీవు నా కొడుకును జేసికొన నంగీకరింపవలయును. లేనియెడల నాఱవదిన మున యమున నిన్నురితీయింతును. నిశ్చయముగఁ జెప్పుచున్నాను. జాగ్రత్త! బాగుగ నాలోచించుకొనుము. ఇతఁడు నీకు మగఁడు: ఈరెండు రాష్ట్రములు నీవి. అదిగాక నాయొద్ద నున్న వస్తుసమూహమంత నీది. బాగుగ నాలోచించు కొనుము. పో. ఇఁక లోనికి బొమ్ము.

బు : నేను సెలవు తీసికొందును. (కోకిల వంకఁ దిరిగి) అన్నా! నమస్కారము. (నిష్క్రమించును.)

చం : ఛీ! నీమొగమీడ్వను! నాయనా! నీ మనసు విఱుగునట్టుకూడఁ జేయుచున్నది. జాగ్రత నీవు నీయంతఃకరణ వృత్తిని మార్చుకొనఁగూడదు. అది నీకు భార్య కాక తప్పదు.

వసం : (తనలో) అబ్బ! ప్రాణము విసిగినది.

గీ. ఇరుగు పొరుగిండ్ల కలహాల ♦ కింటిలోని
కుంపటులకు, సతీపతు ♦ లుడుచు ఖేద
ములకుఁ బదునాల్గుపాళు లీ ♦ ముసలిముండ
గమియె నిశ్చయముగ మూల ♦ కారణంబు.

చం : నాయనా! నే నిఁకఁ బోయి శయనింతును. వాహినీ! బుద్ధిమతికి బుద్ధి వచ్చిన దనుక వివాహ మాఁపి యుంచవలయు నన్న మఱియొక బాధ యున్నది.

వసం : అది యేమి ?

చం : వివాహ మైనగాని పట్టాభిషేకము సేయరాదు. పట్టాభిషేకమైనగాని ప్రజ లకు శాంతిగలుగదు. ఇది మహాసాధ్యసమయముగ నున్నది. సార్వభౌముని రాష్ట్రముగూడ మనదానిలోఁ జేరిన దని బుజములెగురవైచిన లాభములేదు. దాని ననుకూలముగఁ బరిపాలింపవలయును. ఆ ముసలిరాజిక్కడ నున్నాఁడు. అతని విడిపింపఁదలచి కాని, నా కుమారునికి హానిసేయఁదలచి కాని, యనే కులు కుట్రలు సేయవచ్చును. ఈనిన పులులవలె సేనాధిపతు లతిదాహముతో నున్నారు. ఏమియుఁ దోఁచకున్నది.

వసం : అమ్మా! ఎందఱు మగవాండ్ర వ్యవహార మన్న మీ వ్యవహారమున కందునా?

చం : (నవ్వుచు) అలాగే కొట్టుకొని వచ్చుచున్నాను. నాయనా! నేనింకఁబోవల యును. నేను వాహిని నిక్కడ నుంతునా?

కో : ఉంచిన ప్రమాద మేమి?

చం : వాహినీ? నీవు జాగరూకతగా నీతని గనిపెట్టి యుండవలయును. వీవనతో విసరికాని, పాచము లొత్తికాని యాతని నిదురపుచ్చవలయును.

వసం : సరే.

చం : నాయనా! నేను బోవుచుంటిని. జాగ్రత్త!

(చంద్రిక పోవును.)

కో : (మంచముపై శయనించి తనలో)

ఆ. వె. అమితవిభవ మున్న ♦ నప్పుడప్పుడు కష్ట
మొకటి గలుగకుండ ♦ సుఖము లేదు;
లలితలలిత మగు త ♦ లాడపైనను జేతి
యడ్డులేక నిదుర ♦ నందఁగలమె?

(తలాడపైఁ జేపైచును.)

(ప్రకాశముగ) వాహినీ! కుడికన్నదిరిన నేమి ఫలము ?

వసం : మగవారికి మేలు.

కో : ఆఁడవారికి?

వసం : కీఁడు.

కో : మగవారు, నాఁడువారు గానివారికి?

వసం : (తనలో) నన్నీతఁడు గుర్తుపట్టి యుండెనా యేమి? (ప్రకాశముగ) మహా ప్రభూ, స్త్రీ పురుషులుగూడఁ గానివారుందురా?

తే. గీ. మూతిపైఁ గోరమీసాలు ♦ మొలసుగత్తి
లోఁ బిడికిగుండె గలయమ్మ ♦ లు పుడి నెంద
తో, పయ్యెద మాటునను గతి ♦ నొగ్గహృదయ
ముఁగల పేడియయ్యెలు నంద ♦ యిగద. వెలఁది!

వసం : (తనలో) ఈతఁడు నా వికృత వేషమును, గరిన వ్యాపారము బసికట్టినట్లు చెప్పినాఁడు.

కో : (తనలో) హా! వసంతా! ఎచ్చట నుంటివోయి! ప్రాణనాథా!

ఆ. వె. నిదురఁబోవనుండ ♦ నీ స్మరణం బగు
నిదుర లేచునపుడు ♦ నీ స్మరణమె

నిను స్మరియింపనట్టి ♦ నిముసంబు లే దయ్యె!
కష్ట పెట్టె దేల ♦ కరుణ లేక.

హా! వసంతా! (నిదురించును.)

వసం: అయ్యో! అయ్యో!—పలుకకున్నాఁడు. అప్పుడే నిదురపట్టెను గాఁబోలు
హా! ఎంత అదృష్టవంతుఁడు!

గీ. కల్పకములో, మాసంబులో, ♦ గడియలో, యుగ
ములో, గడిచెఁ; గోకిలాచంద్ర ♦ ముఖిని బాసి
రుచి యెఱుంగను; నిదుర యె ♦ ఱుంగను; నొద లె
ఱుంగ; మిన్నును మన్ను నె ♦ ఱుంగ; నకట!

హా! కోకిలా! ప్రాణకాంతా!

గీ. కారయం దుండి ని న్నొక్క ♦ మాఱు దినము
నకుఁ గనగఁ దృప్తిలేక య ♦ నవరతంబుఁ
గాంచఁగా నెంచి యీపొట్లు ♦ గాంచితిని; దు
రాశ పూర్వమున్మూలసం ♦ హర్త్రికాదె?

నీ కొరకే నేనిప్పుడొక పని సేయవలసి యున్నది.

గీ. యామినికిఁ గాంచి యీవేళ; ♦ యఖిల జనులు
కరము లెదఁ జేర్చి హాయిగాఁ ♦ గాంత్రు నిదుర;
పశ్చిమార్ధగోళముతక్క ♦ పరమభాగ్య
హీనసార్వభౌముఁడ నైన ♦ నేనుదక్క.

గీ. ప్రకృతి యొడ లెఱుంగని మహా ♦ వస్తనడఁగె;
భయదనిశ్శబ్దతాదశ ♦ పర్వ నెల్ల
యెడః నితని చిన్న గుఱుక, నా ♦ వెడ గుసగుస
లు, గడియారపు టిక్కులే ♦ మిగిలెఁ గాని.

గీ జపము చేసెడువానికి ♦ జనరహస్య
వధ మొనర్చువానికి నీ య ♦ వసరమె తగుఁ:
గోకిలానామజపము చే ♦ కూఱె నెపుడు
జనవధముకూడ నిప్పుడు ♦ సంభవించు

గీ. ఖడ్గమా! యట నిదురించు ♦ క్ష్మాపతీంద్రు
హృదయమున! ఖసుక్కునందూఱి ♦ యేగవలయు
హస్తమా యలవాటు లే ♦ నట్టిదాన
వైన, దయయుంచి వడఁకకు ♦ మంత సేపు.

(చిటిక వేయును)

హా! కోకిలా! హా! కోకిలా! (ప్రక్కన సమీపించును.) నేను బరమపాపి కుఁడను. నా మహాప్రారబ్ధముచే నీపనిఁ జేయవలసివచ్చెను.

గీ. అదె? కనులు మూసి శయనించు; నదె హృదయము
ఖడ్గమా! ముగింపవలయు ♦ క్షణములోన;
ఇదిగో! గుఱి చూడు! జాగ్రత! ♦ యింక నేను
గనఁగఁజాలఁ; గనుల మూసి ♦ కొనెద; నిదిగో!

(పొడుచును)

కో : హా! హా! హా! ఎవ రక్కడ? నన్నుఁ జంపుచున్నారు! అయ్యయో! నెత్తురు. అదిగో! పట్టుకో! పట్టుకో!

(యిద్దఱు భటులు ప్రవేశించి వసంతుని బట్టుకొందురు.)

భటులారా! రాజహత్యను సంకల్పించుకొనినదీనిఁ గారాగృహాము దుంచుఁడు (తనలో) అమ్మయ్యో! నేనింక మాయమ్మ యొద్దకుఁ బోదును. (నిష్క్రమించును)

వసం : (తనలో)

హా! ఈ ప్రయత్నము కూడ విఫలమయ్యెనా? విఫలము కాదా? కంటితోఁ జూడలేకపోయితిని. చేతికి బింకము లేకపోయెను. కారాగృహ ప్రవేశ మిది నాకు ద్వితీయపర్యాయమా?

గీ. ప్రాణపదమైన కోకిల ♦ పాఱిపోయెఁ;
గన్నతల్లికిఁ గొడుకును ♦ గాక యుంటి
నాదుకోటలో దాసి నై ♦ నాఁడ నేనె;
యిది విఫలమయ్యె; నేమైన ♦ నింక నేమి?

హా! కోకిలా! (నిష్క్రమించును.)

శ్రీ

కోకిల

చతుర్థాంకము

ప్రదేశము : శ్రీపురము నందలి వీధి

(ప్రవేశము - గోపాలుఁడు)

గో : అబ్బ! ఏమి ప్రజ! ఈజను లందఱు ఉరికంబములయొద్దకే పోవుచున్నారు. కాఁబోలు! ఆహా! ప్రకృతి యెంత విపరీతముగా నున్నది!

గీ. పరుల సౌఖ్యముకంటె నా ♦ పదయె యధిక
సుఖకరము నరునికి; సొంత ♦ సుఖతఁ దనకుఁ
గల ముదముకంటె నితరుల ♦ కష్టకలనఁ
గలుగుసుఖ మెన్నొమడుఁగులై ♦ వెలయు; నకట.

ఓ రామభద్రా!

రామ : (ప్రవేశించి) ఎందులకుఁ బిలిచితివి? త్వరగఁ జెప్పుము. నేను వేగఁ బోవలయును.

గో : ఇంకఁ దొందరలేదు. వ్యవధి రెండు గడియ లున్నది.

రామ : జను లనేకులు చూడఁబోవుచున్నారు. ముందుగ వెళ్ళినఁగాని తగిన స్థలము లభింపదు.

గో : తగిన స్థలము మీకుఁ జిక్కకపోయినను వారున్నత స్థలమున నుంచఁబడుటచేఁ మీకు బాగుగఁ గనఁబడుదురు కాదా?

రామ : నాకు వారు కనఁబడ నక్కఱలేదు. వారి మాటలు నాకు వినఁబడ నక్కఱ లేదు.

గో : ఇఁక వారి మాట లేమున్నవి?

రామ : ఉరికంబములపై వారి నెక్కింపక ముందు వారు చేసిన తప్పేదియో, యట్లు చేయుటకుఁ గారణ మేమియో, వారిఁ జంపకుంటకుఁ దగిన బలవత్కారణ మేమైన నున్నదో వారి వలన రాజుగారు తెలిసికొనెదరఁట?

గో : శిక్ష విధింపబడకముందు జరుగవలసిన యీ విధి యిప్పుడేల?

రామ : ఏలయని నన్నడిగెదవేల? ఓయి సర్వస్వతంత్రయగు రాణిగారి నడుగుము. ఉరిదీయుట చిరకాలముననుండి యుదయమున నాచారమై యుండఁగ నిప్పుడు దీపములు పెట్టిన తరువాత నేమి?

గో : రాణిగారైన నేమి? వెనుకది ముందు ముందుది వెనుకఁజేయఁదగునా?

రామ : సరే తగదయ్యా! వ్యత్యాసముగఁ జేసిన వారిని దప్పుపట్టు వారెవ్వరు?

గో : ఎవ్వ రేమి? తప్పని ఘోషించు చట్టము లేదా?

రామ : చట్టమునకేమి? నోరా? చేయియా? చట్టమనఁగ నీకు నాకుగాని కన్నబిడ్డలను జంపు ఘనులకుఁ జుట్టమేమి?

గో : కన్నబిడ్డ గాదులే. పెంచుకొన్నది.

రామ : దత్తపుత్రికను జంపుటకు ధర్మశాస్త్ర మంగీకరించును గాఁబోలు! ఏమిటో! ఈ దినములలో మంచియేమి? చెడ్డయేమి? మహాకలి ప్రవేశించినది; గ్రుడ్లు తెలుచుకొని నోరు మూసికొని చూడవలసినదే కాని—

గో : ఆమె చేసిన నేర మేదియో?

రామ : చిన్నరాజుగారి ప్రక్కలోనికి రానన్నదఁట!

గో : నే నన్యథా వింటినే చిన్నరాజుగారిని బాకుతో—

రామ : అది వేఱు. అది యొక దాసి—క్రొత్తదాసి—

గో : దాని కెంత దుర్బుద్ధి!

రామ : అట్టి నూతన పరిచారికను చిన్నరాజుగారి నిద్రావస్థలో నుంచుటకంటె నెక్కువ దుర్బుద్ధియా?

గో : అటులైన నిప్పుడు జరుగు స్త్రీ వధములు రెండా?

రామ : ఆ! రెండు; పురుషవధములు రెండు.

గో : పురుషులు! మోహనుఁడు, రుద్రదేవవర్మయేకారా?

రామ : ఔను. వెరసినాలుగు ఇప్పటి వఱకు.

గో : ఇప్పటివఱ కనుచున్నా వేమి?

రామ : తీర నక్కడకు వెళ్ళిన తరువాత రాణిగారి బుద్ధి యెట్లుండునో? ఎవరి యాయు వెటు లుండునో?

గో : తెలివితక్కువ మాటలాడకు, ఏమియులేకుండ వారుమాత్రము చంపుదురా?

రామ : ఆ సంగతి నే నెఱుంగనా? ఉరి త్రాడుండవలదా? కాని నీవుకూడ రావా?

గో : నేను రాలేను.

రామ : ఏల?

గో : నేనట్టి ఘోరకృత్యమును జూడఁజాలను.

రామ : నేను మాత్రము చూడఁగలనా?

గో : అటులైన నీవేల పోవుచున్నావు?

రామ : మా పిల్లవాఁడు తాను జూచెదనని పోరుపెట్టినాఁడు. ఎవరికైనఁ దగుసాహాయ్యమిచ్చి నే నింటికిఁ బోదును.

(తెరలో) రామభద్రా! ఇంక రావేమి? రాజుగారు రాణిగారు మొదలగు వారందఱును వెళ్ళినారు. చూడు! చూడు! సంస్థానపు వైద్యుని కొఱకు నిక్కడ వెదుకుకొనుచున్నారు. అతఁ డక్కడ నున్నాఁడా?

రామ : ఇక్కడలేఁడు. నేను రాను అయ్యా! మిత్రమా! ఆ గంగరావి చెట్టుక్రింద మా పిల్లవాని నుంచితిని. వానిని నీతోఁ దీసికొని వెళ్ళి మఱల జాగ్రత్తగ నింటికిఁ దీసికొని వచ్చెదవా?

గో : ఇప్పు డక్కడ వైద్యుఁ డేల?

రామ : వైద్యుఁడు లేని చోట చావెట్లు సంభవించును?

గో : ఇప్పు డక్కడ వైద్యుఁడు చేయునది యేమి?

రామ : ఉరిదీయఁబడినవాఁడు చచ్చెనని నిర్ధారణ పఱచుటకు.

గో : ఆ సంగతి మనము చెప్పలేమా?

రామ : దినకృత్య మగుటచే వైద్యుల కందున మనకంటె పాండిత్య ముండదా!

గో : అయిన నురిదీయఁబడినవాఁడు చావకుండునా?

రామ : ఏమో? గొంతుక కురిపోసి వ్రేలాడఁ గట్టుటయే కాదు. చచ్చువఱకు వ్రేలాడఁ గట్టవలయునని క్రొత్త చట్టము.

(తెరలో వాద్యముల ధ్వని)

గో : అదేమి శుభకార్యము లందువలె మంగళధ్వను లగుచున్నవి?

రామ : నలుగురితో చావంతకంటె భిన్నమా?

(తెరలో) నాయనా! ఆరంభమైనది. వాయించు చున్నారు. ఆ శాస్త్రులు గారు నన్నుఁ దీసికొని వెళ్ళలేదు. నీవు రా! త్వరగా రా!

రామ : అబ్బ! ఈ పిల్లవాని మూలమున నాకుఁగూడఁ జూడక తప్పనిదైనది.

గో : నీ మూలమున నాకుఁగూడ నశ్లేషమైనట్లున్నది.

రామ : అటులైన రండు. పోవుదము.

(ఇద్దరును నిష్క్రమింతురు.)

ఇది నిష్క్రంభము.

—*—

(ప్రదేశము :- ఉరికంబముల తావు)

ప్రవేశము : చంద్రిక, కోకిల, విజయసారధి, జగన్నాథుఁడు, అరదండములతో బుద్ధిమతి, మోహనుఁడు, వసంతుఁడు, రుద్రదేవవర్మ, సేవకుఁడు.

విజ : (అపవారించి) జగన్నాథా! సేనాధిపతి యుండుటచేతను—ఎవరు?

జగ : (అప) సేనాధిపతి.

విజ : (అప) వట్టి సేనాధిపతియా? సార్వభౌముని రాష్ట్ర మవలీల నపహరించి, యాతని గ్రహించి—ఏది!

జగ : (అప) అతని గ్రహించి.

విజ : (అప) జగదేక విఖ్యాతి నొందిన సేనాధిపతి—అట్టి సేనాధిపతి యుండుట చేతను, ప్రాణాపహరణోద్యోగ మిచ్చట జరుగుటచేతను—

జగ : (అప) అయ్యా! అటులనుచున్నారు. ఉరిదీయునది మీరేనా!

విజ : (అప) ఛీ!

జగ : (అప) క్షమియింపుము, తీయఁబడువారు మీరేనా?

విజ : (అప) ఛీ! ఛీ! ప్రాణాపహరణోద్యోగ మిచ్చట జరుగుటచేతను, జనసంకులమై యుండుటచేతను, వాద్యఘోషసమన్వితమై యుండుటచేత, నీ స్థలము యుద్ధరంగమువలెఁ బ్రకాశించుచున్నది సుమా!

కో : సేవకా!

(నేపథ్యమున) అయ్యా!

కో : వాద్యము లిఁక వాయింపవలదని చెప్పుము.

(నేపథ్యమున) చిత్తము.

విజ : (అప) జగన్నాథా! నే నీ నడుమ నొక్క తప్పు జేసితిని. అందువలనఁ గొంచెము—భయము లేదులే—నాకిప్పు డదృష్ట దినములు—కుడికన్ను గాలిలోని జెండాగుడ్డవలె నదరుచున్నది.

జగ : (అప) అట్టి తప్పేదియో నే నడుగవచ్చునా?

విజ : (అప) ఈ గొడవ తీరిన తరువాతఁ జెప్పెదను.

కో : (తనలో) హా! తండ్రీ! నిన్నెట్టి యవస్థలో నేఁ జూడవలసి వచ్చెను?

ఆ. వె. ముగ్గుబుట్టయైన ♦ ముంగురు ల్మెడతలు
బడినకపాలమందు ♦ పడక వినయ
వార్ధకముల నడుమ ♦ వంగఁ, జేతులు బంధ
ములను దండ్ర మిడంగ ♦ నడుగో తండ్రి!

ఈ నిర్భాగ్యురాలు నీ కడుపునఁ బుట్టుటవలన నీ కెంత యవమానము తటస్థించెను! (ప్రకాశముగ) అమ్మా!

(తనలో) గీ. కనక పెంచక, యుండిన ♦ కాంత నమ్మ
యంచు వినయ సంభ్రమముల ♦ నాదరింతుఁ;
గడుపు కలవాఁడఁ గని ముద్దు ♦ గాఁగఁ బెంచు
నిన్ను, దండ్రి యనుచుఁబిల్వ ♦ నేరఁ గట్టి!

చం : నాయనా! ఏల?

కో : వీరిలో నెవ్వరిని ముందరి దీయుమని మీ యభిప్రాయము?

చం : ఇదిగో! దీనిని: (బుద్ధిమతి వంకఁ జూపును.)

బు : అమ్మా! నమస్కారము.

చం : అమ్మా! చెప్పిన మాట విను. మఱియొక్కసారి చెప్పెదను. ఇదియే కడపటి సారి. మూర్ఖపుఁబట్టు పట్టకు. అమ్మా! మహారాజును జేసికొనుము. నీ కొఱకే నే నిచ్చటకు వచ్చితిని. లేనియెడల నంతిపురిని విడిచి రావలసినదికాదు. అమ్మా!

బు : ఇఁక నేమియుఁ జెప్పకుము. నన్ను క్షమింపుము. అడుగో! మోహనుఁడు. అతని కిచ్చి నన్నుఁ బెండ్లిసేయుము. లేదేని నీ యిష్టము. నా కర్మము.

చం : (ఉస్సురనుచు) హరి! హరీ! ఎంత కర్మము తటస్థించెను. కన్నకడుపా విధమగఁ గానలపాలైనది. తెచ్చుకొన్న దీ విధముగఁ దెల్లవారినది.

వసం : (తనలో) అమ్మా! కొంత నిశ్చయమే!

గీ. నీదు కాను పదవి పాలు ♦ నిజము మును పు
కారపాలయ్యె దాసిలం ♦ గాలపాలు
నయ్యె మరణశిక్షకుం బాలు ♦ నయ్యె నిపుడు
తల్లి కాదన్న సుతుని కిం ♦ తకును గలదె?

కో : అమ్మా! మీ యభిప్రాయ మేమి?

చం : ఈ బుద్ధిమతి కిప్పటికైన బుద్ధి మాఱునేమో చూచుటకే నే నిటకు వచ్చితిని. ఇఁకఁ గార్యములేదు. నీ యిష్టానుసార మాచరింపుము.

కో : నా యిష్టము వచ్చినట్లు చేయవచ్చునుగదా!

చం : ఎంతమాత్ర మభ్యంతరము లేదు.

కో : సరే! సేనాధిపతీ! నీవు వద్దనుండుము. (సేవకునితో) నీ వీమెను బల్లపైఁ కెక్కించి కంఠమున కురిబోయుము.

సేవ : చిత్తము.

బు : రాజేంద్రా! నమస్కారము. మిమ్ములను బరిణయమాడలేదని మీకుఁ గోపము వలదు. నా మనవి యొకటి యాలింపవలయును.

కో : సరే! చెప్పుము.

విజ : ఈ యురి తప్పింపుమను కోరికతప్ప మఱి యే కోరికనైనఁ గోరవచ్చును.

బు : నా కంఠమున కురిపోయుమని యా సేవకునకు మీరాజ్ఞాపించితిరి.

కో : అయిన నేమి?

బు : మహాప్రభూ! వలదు. నే నీమహానుభావుని వలచితిని. నాకతఁడు మంగళ సూత్రము కట్టఁదగినవాఁడు. అలోపము నాకు లేకుండునట్లు కంఠ సూత్రము నీతనిచే నా మెడను గట్టింపుడు. ఆ మహామహుని కిల్లాలనై ప్రాణములను విడుతును.

మో : (తనలో) ఆహా! నాయం దెంత యనురాగము గలదానిని విసర్జించి యను రాగ విహీనయగు దానికై యాసపడి చెడిపోతిని. (ప్రకాశముగ) మహారాజా! ఈమెను బ్రథమమున నురిదీయుట నాయభిమతము కాదు.

కో : నోరుమూసికొనుము. అంగీకరించుట కంగీకరింపక పోవుటకు నీ వెవఁడవు? నీ యిష్టత ననుసరించి మేము నడువలయునా? ఒడలు తెలిసికొని మాట లాడుము.

విజ : మోహనా! జాగ్రత్త! నోరు కాపాడుకొనుము. (అపవారించి) జగన్నాథా! చిన్నరాజు సీమ తుపాకి మందువలె మంచికారము గలవాఁడు సుమా!

మో : మహాప్రభూ! నా తప్పు మన్నింపవలయును. నన్ను క్షమింపఁ బ్రార్థింతును. ఒక్క మనవి.

కో : చెప్పవలసిన దేదో శీఘ్రముగఁ జెప్పుము.

విజ : ఔను. నీవంటివాండ్రు ముగ్గురింకఁ జావవలసి యున్నారు.

మో : రాజేంద్రా! ఈ కాంతామణిని నే ననేక సంవత్సరముల నుండియు వలచి యుంటిని.

కో : అసత్య మాడకు. జిహ్వఁ గోయింతును.

విజ : అనేక విరోధి శిరోధి విదారణాతి దారుణమగు కృపాణము. ఇదిగో!నా యొద్ద నున్నది.

జగ : (అవ) జిహ్వఁగోయుట తమవంటి శూరునికి ధర్మముకాదు.

మో : మహారాజా! ఈ కాంతను నేను వలచిన మాట సత్యమే.

కో : వలచినదాని నేల విసర్జించితివి?

మో : ప్రారబ్ధ కర్మమువలన.

కో : ఛీ! తుచ్ఛుఁడా! ఒడలు పొగరెక్కుటవలన - కనులు మీఁదికి వచ్చుటవలన నిన్నింత గాఢముగ వలచిన కాంతను వదలుట కేమికారణమో వెంటనే చెప్ప వలయును.

విజ : మహారాజుగారి యాజ్ఞ యైనవు డూరకుందువేమి? శీఘ్రముగఁ జెప్పుము.

భు : రాజేంద్రా! నాకాంతునిపైఁ గోప ముడిగి క్షమింపుఁడు. నన్నాతఁడు విసర్జించుట నా దురదృష్టముననే కాని యాతని లోపమునఁ గాదు.

మో : కాంతామణీ! సరికాదు. దురదృష్టము మనదిద్దఱిది. లోపము మాత్రము నాదొకనిది. (తనలో) బుద్ధిమతి యెదుటను రుద్రదేవవర్మ యెదుటను కారణమును గూర్చి చెప్పుటకు లజ్జపడుచుంటిని. అయినను తప్పదు. (ప్రకాశముగ)

గీ. కోకిలాలోకికాంగక ♦ శ్రీకినెదుటఁ
బరమమయ్యె బుద్ధిమతి సుం ♦ దరత యడఁగెఁ
బ్రబలవైద్యుత శక్తిప్ర ♦ భాసమాన
దీపికకు ముందు కాఁగడ ♦ దీప్తిపోలె.

కో : (తనలో) ఛీ! దుర్మార్గుఁడా!

గీ. కామిచేఁ బై మెఱుఁగులకుఁ ♦ గాంత స్తుతిని
బొందుకంటె విరాగిచే ♦ నింద నొంద

ఘనము; వాఙ్మహాడంబర ♦ కలిత కవిత
కనరసనుతికంటె గుణిని ♦ రసనమేలు.

వసం : (తనలో) ఛీ! మోహనుఁడా!

గీ. కనులు గానవా? యొడలుపో ♦ గరె? మనసు చ
లించెనా? త్రాగినావొ; ప్రే ♦ లెద వదేర?
నగరుటతివ మణి, మదాత్మ ♦ నగయగు మగు
వ సభఁబేరెత్తి నుతియింతు ♦ వా? దురాత్మ!

రుద్ర : హా! కోకిలా! నా తల్లి ! నీ చక్కఁదనము నీ యిడుమలకే కారణమయ్యెనా?

కో : (తనలో) అంతే! ఆపదలకే కాని యప్రతిష్ఠల కెన్నఁడునుగాదు.

మో : మహాప్రభూ!

గీ. తన్వి యామె నా పాపనే ♦ త్రములఁ బడఁగ
దీని విడిచి దానిని జేరఁ ♦ దీవ్రపడితి
నప్సరస ముందు తెయితక్క ♦ లాడ నక్ష
మాలవిడి పైఁటఁ గొను ముని ♦ మాత్రునట్లు.

రుద్ర : (తనలో) హరిహరీ!

వసం : (తనలో)

ఆ. వె. నెలఁతనీదు సొమ్మొ! ♦ నీ తాతసొమ్మొ! యే
మేమి! చూచుతోడ ♦ నే వలచితె?
కనులు పొడుచుకొనినఁ ♦ గడు మంచిదౌ కదా
పడఁడు లెవరు కనులుఁ ♦ బడకయుండ్రు.

కో : ఓరిపాపి! అధమా! కోకిలను జూచుటతోడనే బుద్ధిమతిని వదలితివా? ఓరీ చండాలుడా ! నీయనురాగ స్థైర్య మింతయేనటరా?

ఛీ! ఛీ! భార్యాపరిత్యాగమును జేసిన నీ మొగమును జూడరాదు.

బు : రాజేంద్రా! ఆయన నేర మేమియు లేదు క్షమింపుము.

కో : తరువాత వసంతుని ప్రక్కలో బుద్ధిమతిని సింగారించితివా?

మో : అయ్యా! మీకెట్లు తెలిసెను?

బు : నాథా! నేను గొన్ని యంశములఁ జెప్పితిని.

మో : మహారాజా! నాకుఁ జెప్పుటకు సిగ్గగుచున్నది. ఒక మోసమున వసంతునికి బుద్ధిమతికి వంటించి నేను గోకిల బోయితిమి.

కో : ఆ మోస మేదియో స్పష్టముగఁ జెప్పినఁగాని మాకెట్లు తెలియును?

మో : కోకిలావసంతుల రహస్య ప్రయాణమును గూర్చియు, సంకేత స్థలాదులఁ గూర్చియు నదివఱకే నే నెఱింగియుంటచే, బుద్ధిమతి నచ్చటి కడిమచెట్టు తొఱ్ఱలో దాఁచి యాచెట్టుక్రింద కోకిలకై వేచియుంటిని. అనురాగాందోళమునఁ గోకిల యేర్పఱచుకొనిన వేళకంటె ముందే వచ్చెనని గ్రహించి చెట్టుక్రింద నిరీక్షించియుండి కోకిలను దూరముగఁ జూడఁగనే "బుద్ధిమతీ! ఒక గంట వఱకు నీ వీతొఱ్ఱలో నుండి పైకి రాకుము: తరువాత వచ్చి యీ త్రాటి నిచ్చె నను గదుపుము: ఈ మేడప్రక్క నేను కొంత సొమ్ము దాఁచుకొంటిని: ఆ సొమ్ముతో నిన్నుఁ గలిసి కొందును: మాటలాడకుండ నాతో రావల యును." అను నీమాటలు బుద్ధిమతి చెవినివైచి తటాలునఁ గోకిల కెదురుగఁ బోయి మఱలించి తీసికొని పోయితిని.

కో : ఓరీ! అధమాధముఁడా! ఇంత మోసముచేఁ గోకిలను గ్రహించి వసంతునికిని బుద్ధిమతికిని లంకె వేసితివా?

మో : అగునని చెప్పుటకు సిగ్గగుచున్నది.

కో : ఓరీ! భ్రష్టుడా! నీకు సిగ్గేల? విడియమేల?

ఆ. వె. ప్రక్కలోని సతిని ♦ వదలివేసినవాఁడె
సిగ్గులేనతఁడుగఁ ♦ జెప్పఁబడఁగ
దాని మఱియొకనికిఁ ♦ దార్చిన ఛండాలు
డేమి లేనివాఁడొ ♦ యెఱుఁగ వశమె?

చెలియలిని విటునకుఁ దార్చిన వేశ్యాపుత్త్రుఁడు నీకంటె సహస్ర గుణాధిక గుణసంపన్నుఁడు. నిన్నుఁ జిత్రవధము సేయవలసినదిరా! ఏమి? వసంతుని ప్రక్కలో బుద్ధిమతిని గూర్చితివా?

వసం : (తనలో) కూర్చిన వినియోగ మేమున్నది?

గీ. మతిచెదరువాని మెడలోన ♦ మల్లెదండ
వలెను, సతిఁబాసి యేడ్చెడు ♦ వానిముందు
గానసేవవలెను, నాదు ♦ కాంతవిడిచి
యేడ్చునాకు నీసకియ న ♦ ర్పించె నతఁడు.

ఎదుట బుద్ధిమతి యున్నది. దాని నడిగి నా నిర్దోషతయు దాని నిర్దోషతయుఁ దెలిసికొనరాదా?

కో : ఏమీ! బుద్ధిమతీ! నీకు వసంతుఁ డేమైన ద్రోహ మొనర్చినాఁడా? ఓరీ మోహనుఁడా! నీవు మనుజుఁడవైన నీ చింత నీకుండఁ దగినది. ఏమి బుద్ధిమతీ!

బు : హరిహరీ! ఎంతమాట! వసంతుఁడు మహాసుగుణ సంపన్నుఁడు. ఆతనికిఁ గోకిలా నామస్మరణము తప్ప వేఱు చింతయే లేదు.

వసం: (తనలో) సెబాస్! బుద్ధిమతీ యథార్థ కథనము నీ పాతివ్రత్యమునకు వన్నె దెచ్చుచున్నది.

చం : బుద్ధిమతీ! నీవు వసంతు నెచ్చటఁ జూచితివి?

బు : అమ్మా! నేనిక్కడకు రాకమునుపు వనములోఁ జూచితిని.

చం : ఆతఁడు వసంతుఁ డని నీ వెట్లెఱుఁగుదువు?

బు : ఆతఁడే చెప్పినాఁడు.

చం : ఆ మాట నమ్మకూడదు.

వసం: (తనలో)

ఆ. వె. బ్రదికియుండు నాతఁ ♦ డెదుటికి నేతెంచి
నేను జావలేదు ♦ నిక్కమనుచు
పలుకుచున్న నైన ♦ బాపభూయిష్ఠ కా
లమ్ము వలన వాని ♦ నమ్మరెవరు;

కో : వసంతుఁడు కాని కాకపోనీ! బుద్ధిమతీ! ఆతఁడు నీతో నింక నేమనెను?

బు : ఈ మోహనుని వలనఁ గోకిల కేమైన నుపద్రవము గల్గునా యని నన్నడిగెను. అట్టి దెన్నఁడును జరుగదని నే నంటిని.

కో : ఈ మోహనుఁ డట్టి దుర్మార్గుఁ డని వసంతుఁ డెఱుఁగునా?

బు : ఎఱుఁగడు కాని, యేమో కొంత సందేహించినాఁడు

కో : వసంతుఁడు కోకిల నేల సందేహింపవలయును? ఆభిజాత్య సంపన్నత గలిగి యధికగుణాన్వితుఁ డైన యీ వృద్ధమహారాజు పుత్త్రికకదా కోకిల యనునది.

రుద్ర : రాజేంద్రా! ఔను. కోకిల నా కూఁతురు. నా కొక్కతెయే కూఁతురు. అయ్యో! అయ్యో! నా కోకిలను నాకు గనఁబఱచి పుణ్యమును గట్టుకొన్నరా? ఎక్కడ నున్నదో వెతికింపరా? హా! కోకిలా! (ఏడ్చును.)

కో : (తనలో) హా! నీ క్షోభము నేనెంత యస్వతంత్రనై చూడవలసి వచ్చెను?

ఆ. వె. ఎదుట నున్న దాని ♦ వెదకింపవలయునే?
కనఁబడియెడు దానిఁ ♦ గనఁ బఱుపఁగ
వలయునయ్య? చావుఁ ♦ బడయనికూఁతు కై
యేల యేడ్వవలయుఁ ♦ నీవు తండ్రి;

గీ. మాయ యనుతెర యడ్డుండ ♦ మాత, తండ్రి
కూఁతు రనుభ్రమము గలిగె; ♦ నా తెరపయి
మగతనపుఁదెర యుండ భ్ర ♦ మము మఱింత
యయ్యెఁ; గూఁతురు రాజుగా ♦ నయ్యె నీకు.

(ప్రకాశముగ) పేనాసీ! ఆ రాజు నాశ్వాసింపు మనుము.

విజ : చిత్తము. ఏమయ్యా! అనవసర రోదనమున నల్లరిచేసి సభాకార్యముల కేల విఘ్నమొనర్తువు? ఊరకుండుము.

కో : విజయసారథీ! నీ వేమి గౌరవ మెఱుఁగవా? మాటలాడు పైఖరి యెఱుఁగవా! మూఢుఁడవా! ఆ వృద్ధ రాజేంద్రు నట్లు గద్దించెదవేల? కనిన యొక్క బిడ్డ కానఁబడకపోవ నేడువని వారుందురా?

వసం: (తనలో) మాయమ్మ యున్నదికదా?

విజ : మహాప్రభూ! క్షమింపవలయును. (అప) జగన్నాథ! ఈ చిన్నరాజు పట్టాభిషిక్తుఁడగు తరువాత మన మానప్రాణములు దక్కవు సుమా?

జగ : (అప) కాదా? మన ప్రయోజకతలు విద్యావిహీను లగు విభుల యొద్దను వితంతువుల యొద్దనే కదా?

కో : నేనడిగిన ప్రశ్నమున కుత్తరము చెప్పక యూరకుంటి వేమి? బుద్ధిమతీ! గుణసంపన్న కాక తప్పని కోకిలను వసంతుఁ డేల సందేహింపవలయును?

బు : అత్యనురాగ మున్నచోట నట్టిభయము సహజమే కదా!

వసం: (తనలో)

గీ. ప్రాణపదమగు వస్తువు ♦ పాడుపడు న
టంచు భయ మెల్లపుడు చిత్త ♦ మాశ్రయించు
నతులితాచార నిష్ఠుఁడౌ ♦ నతఁడు మైల
యెపుడు పడుదునో యనుభీతి ♦ నెగిరిపడఁడె?

కో : మోహనుఁడా! నీవు కోకిలను వనమునకుఁ దీసికొనిపోయితివా?

మో : చిత్తము.

కో : పోయి యచట బలాత్కరింపలేదు కద!

వసం: (తనలో) ఈ యొక్క మాటతో వసంతుని బ్రతుకో చావో, తేలనై యున్నది.

గీ. తరుణిఁ బాసి ప్రాణాపాయ ♦ దశను గంటి;
రాజవైద్యుఁడు మృతజీవ ♦ రసము నిచ్చెఁ;

వైద్యహస్త విశేషాన ♦ బ్రదుకఁ గలనొ!
వాహకు నదృష్టమునఁ ♦ జావుఁ బడయవలెనొ!

ఇంకను మాటలాడకున్నాఁడు.

కో : సందేహించుచుంటి వేమి? బలాత్కరించితివా?

మో : (చెవులు మూసికొని) పాపము శాంతించుగాక! పాపము శాంతించుగాక!

కో : ఏమి అటులనుచున్నావు?

మో : ఆమె మహాపతివ్రత! నేను పరమ దుర్మార్గుఁడను.

వసం: (తనలో) సెబాస్! యథార్థ వాక్యములు రెండు పలికితివి.

గీ. అత్యసత్యవాదియు దిన ♦ మందు నొక్క-
యొక్కపుడు సత్య మాడక ♦ యుండఁ డహహా!
తిరుగని గడియారమయిన ♦ దివసమునకు
సరిగ వేళఁ జూపును రెండు ♦ పఱులు గాదె

మో : ఆమె నాకుఁ దల్లివంటిది. ఇఁక నాకు బుద్ధి వచ్చినది. అంధకారమునకు దీపమెట్లో కామాంధకారమునకుఁ గారానివాస మట్టిది. తల్లియగు కోకిలాదేవి యెన్నటికైన నా కనులఁ బడుట తటస్థించిన యెడల రక్షింపుమని నేనామె కిట్లు సాష్టాంగ మొనర్తును. (సాష్టాంగపడును.)

కో : నీవు నాకు నమస్కరించెద వేల?

మో : కోకిలా కాంతను బలిమిచేఁ పట్టితినని నాకీ కారాగృహనివాసము, తరువాత నిప్పటి మరణ శిక్షయు విధింపఁబడినవి. నేను ద్రోహిని కానని మనవి చేసుకొంటిని నన్ను క్షమించి రక్షింపుఁడు.

కో : బలాత్కార మెట్లు శిక్షార్హమో తత్ప్రయత్నము కూడ నట్టులే! నీవు చావక తప్పదు.

మో : తప్పదా? చిత్తము బుద్ధిమతీ! (మోకరించి)

ఆ. వె. ఇంత సుఖముఁ జెందు ♦ నింతిని నిన్బట్టి
యడవి కీడ్చి యిడుము ♦ లందఁ జేసి
యురిని గూడఁ బొంద ♦ నుండఁజేసిన ఖలుఁ
డిడుగొ! వీని శిరము ♦ నెగసి తన్ను.

కో : ఓరి దుర్మార్గుఁడా! నీవాసంగిన యాపదలు బుద్ధిమతి కే యనవేల? వసంతునికో కోకిలకో? వారి మూలముగ నీవృద్ధ మహారాజునకో? ఈ విచిత్ర నాటకమునకు నీవే బీజమవు: ఈ యద్భుత భారతమునకు దుష్టశకునివి నీవే! నిన్నెగసి తన్నవలయునా? నీ మాంసము ఖండఖండములుగఁ గోసి కాకుల కెగమీట వలయునా?

(తనలో)

ఆ. వె. ఇట్టిచోటనైనఁ ♦ నీ రీతిగానైనఁ
గాంత మగనితోడఁ ♦ గలిసె నహహ!
యిట్టి భాగ్యమైన ♦ నే నొందలేనైతిఁ
గట్టి! పూర్వరచిత ♦ కర్మకలన.

బు : బాలప్రభూ! ఆతఁడు యౌవన ప్రాదుర్భావమున వేసైన నేరములు చేసి యుండిన యెడల మీ రాతనిని క్షమియింపఁదగును. ప్రభువులకు శిక్షార్హుని క్షమించుట కంటె నుదారత వేఱొకటి లేదు. (సాష్టాంగపడును.)

కో : బుద్ధిమతీ! లెమ్ము! నీవంత దైన్యముగఁ బ్రార్థించుచుంటివి కాన మేము మీయిద్దఱ ప్రాణములలో నొక్క ప్రాణమును మాత్రమే రక్షింతుము. నిన్ను రక్షింప మంటివా? నీకు బానిసయగుటకైనఁ దగని నీ భర్తను రక్షింప మంటివా?

మో : (తనలో) హా! బుద్ధిమతి యేమనునో?

బు : మహారాజా: నా భర్తనే రక్షింపవలయును.

కో : హాహాహా!

చం : ఓసీ! నిర్భాగ్యురాలా! నీవు చచ్చిన తరువాతనైన లోకమున కాభరణము గను దౌష్ట్యమునకు బీజనాశనము లేకుండుటకు నీ దుర్మార్గుఁ డుండవలయును గాఁబోలు?

కో : నీ భర్త నేల కాపాడవలయును?

బు : నా ప్రాణము నా భర్తలో నున్నది. ఆతని జంపిన యెడల నొక ప్రాణముతో మఱియొక ప్రాణము పోవును. నన్నుఁ జంపిన యెడల నేను నా భర్తలో జీవించియే యుందును. కావుననే నట్లు కోరితిని.

కో : ఆహా బుద్ధిమతీ! నీవు సార్థకనామవైతివి!

గీ. శక్తిమంతుని, ధనవంతు ♦ సరసతముని,
రాగయుతు, వ్యభిచారదూ ♦ రస్థు, గాంతు
నింతి యుక్కున్ము, మూర్ఖ, ప్రే ♦ మించు నట్టి
పాపకాల వైచిత్ర్యంబు ♦ ప్రాప్తమయ్యె.

గీ. కాని, నీరసు నిర్భాగ్యు ♦ గాపురుషుని,
రాగహీనునిఁ, బరసతీ ♦ రాగయుతునిఁ
బతిని, రక్షింపఁదలఁచి నీ ♦ ప్రాణములను
విడువ నుంటివి; నినుఁబోలు ♦ వెలఁదియేది?

బు : మహారాజా! మీస్తుతి కర్హురాలనుకాను. ఇదివరకే నావలన మీకుఁ జాలశ్రమము గలిగినది. నన్నింక నురిదీయింప సెలవిండు. నా భర్త నన్నుఁ బట్టుకొని యాబల్ల పైకిఁ దీసికొని వెళ్ళను. అతని సన్నిధానమున నాతనిచేతఁ జంపించి ప్రాణములు విడుచుటకంటె నాకు మహాభాగ్య మక్కఱలేదు. అమ్మా! నమస్కారము! ఆర్యులారా! మీకు నమస్కరించుచున్నాను. నాథా! నన్నుఁ బైకిఁ దీసికొని పొమ్ము.

మో : బుద్ధిమతీ! నీకటాక్షమున నే బ్రతికితిని. నీ కనేక వందనము లొనరించుచున్నాడను. నీవు మాత్ర మేల మరణింపవలయును? బ్రదికి యుండుటకు సాధన మేమైననుండఁ బచ్చునంతటి జ్ఞానహీనుఁ డుండునా? నీవు చావవలదు. నీ వీ మహారాజును వివాహము చేసికొందు ననుము. నిన్నాతఁడు వెంటనే రక్షించును. ఆ రీతిగ బ్రదికియుండక వృథగఁ జావనేల?

కో : ప్రక్కలోని భార్యను పైవాని కప్పఁజెప్పు నీ పాడుబుద్ధి పోనిచ్చు కొంటివి కావు.

చం : మోహనుఁడా! నీవు బుద్ధిమతికి బ్రదుకు దెరువకు నుపదేశమును మావలెనే చేసితివి. అది కోసినసరే? చెప్పినట్లు వినదు.

కో : బుద్ధిమతీ! నీ భర్త చెప్పిన యుపాయమునకు నీవేమైనఁ బ్రత్యుత్తరము చెప్పవలసి యున్న దేమో చెప్పుము.

బు : అమ్మా! నేనుఁ బ్రత్యుత్తరములదానను గాను: మాటలదానను గాను: నన్నుఁ బరలోకమున కంపుఁడు.

కో : పరమపాపిష్ఠ శిఖామణియైన పతిప్రాణములు స్వప్రాణదాన ప్రయత్నమున రక్షించిన మహాపతివ్రతా శిరోమణివైన నీవింకఁ గొంతకాలము లోక సంగ్రహార్థమై జీవించి యుండవలయును. నిన్నుఁ జూచి నమస్కరించువారికిఁ బాపవిమోచన మగును గావున నమస్కరించుచున్నాను. (సాష్టాంగపడును.)

బు : (తిరిగి నమస్కరించి) మహాప్రభూ! అనుగ్రహింపఁబడితిని.

కో: గీ. బహుళజీవభూయిష్ఠ ప్ర ♦ పంచమందు
సచ్చిదానందమయ సు ప్ర ♦ శస్తమైన

యుక్తి బ్రహ్మాము తరువాత ♦ నధికపూజ్య
భవ్యమగువస్తు వొక పతి ♦ వ్రతయె కాదె?

సేనాపతీ! ఈ దొంగను, విశ్వాసఘాతుకను, రాజద్రోహిణిని, రమణీ రూపరాక్షసిని, పైటకొంగున బాకును ముడుచుకొని బానిసతనమునకై వచ్చిన పాపి నిటు తీసికొని వచ్చి నా యెదుట దూరముగఁ బెట్టుము.

సేనా : (తనలో) అయ్యయ్యో! ఇఁక నా కొంపఁగూడ నేమి మునుఁగునో కదా! (ప్రకాశముగ) వాహినీ! రమ్మ! ఇటురమ్మ. మహారాజుగారియొద్ద—కాదు యెదుట—దూరముగ—నంత దూరముగఁ బనికిరాదు—కొంచెము దగ్గఱగ—నిలువఁబడుము. మహాప్రభూ! వాహినిని దమయెదుట నిలువఁ బెట్టితిని.

కో : అమ్మా! ఇంక దీనిని విచారింపనా?

వసం : నన్నడుగవలసిన పనిలేదు. నీ యిష్ట మెటులో యటులాచరింపుము.

కో : రాజవధమును సంకల్పించుకొనిన నీ వెవతెవు?

వసం : (తనలో) ఎవతెవు కాదు. ఎవఁడవని యడుగుము. హా! కోకిలా!

గీ. ఎటులో కారయం దుండ న ♦ న్నీడ్చి పైకి
నడవి పాల్సేసి త్యజియించి ♦ యాఁడు బాని
సనుగఁ జేసి రాజవధము ♦ సలుపఁ జేసి
యురిఁ దగిలించి గుట్టునుగూడఁ ♦ జెఱుపఁ దలంతె?

కో : ఏమి మాటలాడక యున్నావు?

వసం : ఏమి చెప్పవలసి యున్నది?

కో : ఏమీ యీ మఱపు? ఛీ! తుచ్ఛరాలా! రాజవధ మేల సంకల్పించుకొంటివి?

వసం : రా జెవరు?

కో : నీకుఁ గన్నులు లేవా? మతిలేదా? అటు లడిగెద వేమి?

వసం : కన్ను లున్నవి. మతి యున్నది. కావుననే యడిగితిని. రాజెవరు?

కో : నేనే.

వసం : అసత్య మేల యాడెదరు?

కో : అసత్య మేమున్నది?

వసం : ఈ రాజ్యము నీ కేతీరునఁ గలిగెను? నీవు మా దేశము రాజునకు బుత్త్రిఁడ వగుదువా? ఆమె నిన్నుఁ గనెనా?

కో : కన్నవాఁడే కాని దత్తుఁడు రాజ్య మేలఁగూడదా?

వసం : నీ వామెకుఁగాని యామె భర్తకుఁగాని దత్తస్వీకృతుఁడవా?

కో : ఛీ! ఛీ! అనవసర వాక్యములఁ గట్టిపెట్టుకొనుము. నీవు రాజవధయేల సంక ల్పించు కొంటివి? సేనాపతీ! సర్వమును సిద్ధపఱచి యుంచుము. దీనిని ముందుగ నురితీయవలయును.

వసం : నేను నీవధ యేల తలఁచితిని? నిన్ను రాజ్యము నుండి తొలఁగించుటకు—

కో : తొలఁగించుట—

వసం : నేను రాజ్యమేలుటకు—

కో : హాహా! నవ్వు వచ్చుచున్నది. దాసికు రాజ్యమేల?

వసం : పైవానికంటె మంచిదికాదా?

కో : (తనలో) హాహా! ఇదియేమి? ఇదియేమి? నా నాథుఁడే.

విజ : ఈ మహారాజు వృద్ధరాజున కభిమాన పుత్రుఁడు.

వసం : ఔరసుఁ డుండ నభిమానపుత్రుఁ డేల యేల వలయును?

కో : (తనలో) హా! హృదయమా! శాంతించుము.

చం : ఓసి! మతిమాలినదానా! ఔరసపుత్రుఁ డెవ్వడే!

వసం : నేనే?

చం : ఎవరికి? ఎవరికి?

వసం : నీకు—నీ భర్తకు.

చం : నా కౌరసుఁడు వసంతుఁడు.

వసం : అంతమాత్ర మెఱుఁగుదువుకదా! ఆ నిర్భాగ్యుఁడైన వసంతుఁడు వీడే.

కో : (తనలో) అదృష్టహీన నగు నా మూలమునఁ బ్రాణనాథా! నీకెన్ని యాపదలో తటస్థము లైనవి.

ఆ. వె. నిన్ను మొదటఁ జూడ ♦ నే నెచ్చెలినో యిట్టి
ప్రతిమఁ గాంచితి నని ♦ భ్రమము పడితి;
మును జదివిన పాఠ ♦ మును నెచ్చటో విని
నట్టు లున్న దనెడు ♦ నజ్ఞవతెను.

చం : సేనానీ! చూచితివా? చెప్పలేదా? పట్టుకో! కొట్టు! చంపు! నరుకు! రాజ్య మును హరించుటకు వసంతుఁడను పేరు పెట్టుకొని దాసీ వేషము వేసుకొని బాకు నొడిలో దాఁచుకొని వచ్చి రాజకుమారుని జంపఁదలఁచితివా? రాజ్య

మెక్కఁ దలఁచితివా? మహారాజు చచ్చినతోఁడనే రాజ్య మల్లోలకల్లోలమైన దనుకొంటివేమి? జాగ్రత్త! డొక్క చీల్పించెదను. సేనాపతీ! పట్టుకొనుము. ఎక్కించు! ఉరికంబములమీఁది కెక్కించు!

కో : సేనాధిపతీ! పట్టుకొనకుము. అరదండములతో భటమధ్యమున నున్నవాఁ డెచ్చటికిఁ బోవును? అమ్మా! అతఁడు వసంతుఁడే యగునెడల మనకంతకంటె సంతోష మేమియు లేదుకద! కాక మఱి యెవ్వఁడో ద్రోహియుఁ జోరుఁ డైన యెడల నాతఁడు నాకుఁ జేయఁదలఁచిన యపకృతి యేదియో చేయనే చేసినాఁడు కదా! బద్ధుఁడై కొలఁదికాలములో కడదేరనున్నవాఁడు మనకేమి యాపదను గలుగఁ జేయఁగలఁడు! ఏమియు భయములేదు. ఈతని పూర్వాపర సందర్భము లన్నియుఁ గనిపెట్టుదము.

చం : ఇంక నేమి కనిపెట్టవలయును? ఒక్కుమ్మడిగ వసంతుఁడనే యనుచున్నాఁడు

కో : (తనలో) వసంతుఁడు కాఁడా! హా! ప్రాణనాథా!

ఆ. వె. ఎఱ్ఱజీర లుండి ♦ యింతిలా నేత్రముల్
కాంతిఁ దప్పె; నింకె; ♦ గళ మొకింత
సన్నవడియె; నున్న ♦ నున్నవౌ చెక్కులు
చప్పఁబడుచు ముదిమ ♦ దప్పె నకట!

ఆ. వె. పోల్గుపిట్టపొట్టఁ బో ♦ లిన ముంజేయి
తరుణమాంసలతను ♦ దక్కనరము
లకట! పొటకరించె; ♦ నవిగొ భాగ్యమువోవ
జనునిలోపచయము ♦ చందమునను.

వసం : అమ్మా!

ఆ. వె. అమ్మగానిదాని ♦ నైన నమ్మాయని
యనెడువాని నింతి ♦ యాదరించు
నన్నుఁ గన్న నిన్ను ♦ నా "తల్లి" యనిపిల్వ
నెగచి నఱుకుమనెద ♦ వేల? యమ్మ!

ఆ. వె. కొడుకు మృతికి నడ్డు ♦ పడవలసిన తల్లి
తనయుఁ జంపఁబూన ♦ దారిగలదె?
ఏది గుండెఁబట్టు ♦ నిట్టె నీ రది దింపు
నీరు గుండెఁ బట్టు ♦ దారి యేది?

కో : నీవు వసంతుఁడవే యైయుండిన యెడల బహిరంగముగ వచ్చి 'నేను నీ కొడుకును; ఈ రాజ్యము నాది; ఈ కొత్తరాజును వెడలఁగొట్టి నా రాజ్యమును నేఁ దీసి కొందును.' అని మీ యమ్మతో స్పష్టముగ ముఖాముఖిని జెప్పలేక పోయితివా? ఈ భయమేల? ఈ సందేహ మేల? దాసీజనముల గుడారములో దాఁగనేల? లేనిపోని యాడువారి హంగులు తెచ్చిపెట్టుకొననేల? చక్రవర్తి పుత్రుడవై పుట్టియుఁ గింకరవృత్తికి లోనుగానేల? అర్ధరాత్రమున నిద్రావస్థ నుండువారిఁ బొడువ నేల? అరదండములతో నురికంబముల యొద్ద కీడ్వఁబడ నేల? ఎందుల కీ శ్రమము? ఈ క్షోభము? ఈ యవమానము? ఈ బలవన్మరణము?

వసం : నేను మూఁడేండ్ల వయసువాఁడనై యుండుఁగ నీ మహారాజు వలనఁ దీసి కొనిపోఁ బడుటచే నన్నెవ్వ రెఱుఁగరు. మా తల్లియైన నన్నెఱుఁగదు. బద్ధుఁడైన యీ వృద్ధరాజప్పుటప్పటఁ జూచుటచేత నన్నుఁ గొంత యెఱుఁగును. ఒకసారి చూచుట వలన బుద్ధిమతి నన్ను మిక్కిలి స్వల్పముగా నెఱుఁగును. హా కోకిలా! నీ విప్పుడు నా యెదుట నున్నయెడల నే నెంత వికృత వేషములో నున్ననైనను నీ విట్టె యానవాలు పట్టుదువుగదా?

కో : (తనలో) మగరూపమున నున్న నన్ను నీవెంత గుఱుతు పట్టితివో యింతకు ముందువరకు నేను నిన్నంతే గుఱుతుపట్టితిని.

ఆ. వె. ఎఱుఁగు టనఁగ నేమి? యెఱుఁగమి యన నేమి?
నెత్తిపైన జ్యేష్ఠ ♦ నిలుచు నపుడు
కనులు పూలు పూచి ♦ కాయలు కాచును;
బుద్ధి మొక్కవోయి ♦ మొండిఁబాఱు.

(ప్రకాశముగ) వసంతా! నీ వేదో చెప్పఁబోయి మఱియొక్క దారినిఁ బోయితివి.

వసం : ఔను. ఇచ్చట మా తల్లియైన నన్నెఱుఁగదు. నేను వసంతుఁడనని చెప్పిన నెవ్వరు నమ్ముదురు? మగరూపమున నంతఃపుర మెట్లు ప్రవేశింతును? అందుచే నీ దాసితనమున కొప్పుకొని నగరు ప్రవేశించితిని. మా యమ్మతో రహస్యముగ నా స్వరూపమును వెల్లడించుకొనవలయునని యెంచితిని. గాని, వసంతుఁడని పేరు పెట్టుకొని వచ్చిన నెవరినైనఁ బ్రత్యేకాజ్ఞ లేకయే శిరఃకరన మొనరింపుమని ద్వితీయ సేనాధిపతి కప్పుడే యాజ్ఞ నిచ్చుచుండెను. తరువాత—(సేనాధిపతి వంక జూచును.)

విజ : చెప్పుము. సేనాధిపతికి భయమేమి?

వసం : తరువాత, నీ సేనాధిపతితో నా యుదంతము సంపూర్ణముగఁ జెప్పితిని. అప్పుడీతఁడు నా యవస్థకు మిగుల ఖేదపడి నీ వీ రాత్రి శత్రువైన యీ

నూతనరాజును గద తేర్చిన యెడల సేనాభండారములతో నేను నీకు సాహాయ్య మొనర్చి నిన్ను రాజ్యమున నవలీల నిలుపుదు నని వాగ్దాన మొనర్చెను.

కో : సేవకా! ఈ సేనాధిపతి కరదండములఁ దగిల్చి యురికంబముల యొద్దకుఁ దీసికొని వెడలుము. ఛీ! దుర్మార్గుఁడా! రాజద్రోహీ! పాపీ! రాజ్యము వసంతు నిది గావున నాతఁడేవో యొకతంత్రమున దన రాజ్యమును దను సంపాదించుకొనుటలో నంత తప్పేమియు లేదు. నీకేమి పోఁగాలమా? ఒడలు మదమా? నీకు నే నేమి ద్రోహ మొనర్చితిని? నీ దారికి నే నేమి యడ్డుగ నుంటిని? నన్నుఁ జంపుమని నీ వీతనికి బోధింతువా?

విజ : చంపుమని నేను బోధింపలేదు. ఆతఁడు మిమ్ముఁ జంపఁగలిగిన యెడల నా పైని—

కో : ఛీ! నోరు మూసికొనుము. నీవు చావ దగినవాఁడవే!

వసం : అయ్యో! ఆతనిని క్షమియింపుము.

చం : విజయసారథీ! ఇట్టి చిక్కులు రాఁగ నివారణము చేయదగిన నీవే! మమ్మిట్టి యాపదలోఁ బ్రవేశింపఁ బెట్టితివా? ఈ విశ్వాసహైన్యము నీకుఁ దగునా?

విజ : రాజకుటుంబమం దిప్పటికి నాకు విశ్వాసమే?

కో : (కత్తిదూసి) ఆఁ! ఆఁ! ఏమంటివి? ఏమంటివి? రాజకుటుంబమందు నీకిప్పటికి విశ్వాసమేనా? నేను రాజకుటుంబములోని వాఁడనుగాక పోవుటచేత నన్నుఁ జంపుటలో విశ్వాసహైన్యము లేదని సూచించుచుంటివా? బాలిశాధమా! (నఱుకబోవును.)

చం : అబ్బాయీ! శాంతింపుము.

వసం : అయ్యో! రక్షింపవలయును.

కో : మహారాజ్ఞీ! వసంతుఁడని పేరుపెట్టుకొనిన వాఁడెవఁడో వచ్చినంత మాత్రమున నే యధములైన సేవకులకు సహితము నా యెందెంత గౌరవమున్నదో చూచితివా! నన్ను వారు వధించుటకుఁగూడ యత్నించుచున్నట్లు స్పష్టమైనదా? గౌరవహీనుఁడనై ప్రాణాపాయదశ నొందుచు, నేను నీ యింట నింకెన్నాళ్ళుండ వలయును? నీ బాంధవము నాకక్కఱలేదు. నీ రాజ్యము నాకక్కఱలేదు. నా యిష్టానుసారముగఁ నేఁబోయెదను. (పోఁబోవును.)

చం : నాయనా! కోపపడకుము. వసంతుఁడను నామము ధరించి యే నిర్భాగ్యుఁడై వచ్చిన యెడల నింత మనుగువని యెఱింగియుండియే యట్లులానతిచ్చితిని. (అపవారించి) ఈ సమయమున నీవిట్లు లాచరింపఁదగదు. యుద్ధానంతరము రాజ్యమా యల్లరిగనున్నది. పై రాజ్యభారమా మీఁదఁ బడెను. రాజ్యాపేక్షచే దొంగలు బ్రముచ్చులు వేషధారణ మొనర్చుకొని వచ్చుచున్నారు. ముఖ్యుఁడైన సేనాధిపతియు పరిభవింపఁబడి మరణయాత్రోన్ముఖుఁడై యున్నాఁడు.

ఎదుటబొమ్మపై గుంపటివలె సార్వభౌముఁడు మన యసూదర్పచర్యనంతయుఁ జూచియున్నాఁడు. ఇట్టి యసాధ్యావసరమున బుద్ధిమంతుడవైన నీవేమి! అనాలోచనముగ నీ ప్రయత్నమేమి? తప్పుగాదా? నాయనా! ఏమియు మాటలాడకు.

వసం : (చంద్రిక వద్దకువచ్చి) అమ్మా! నేను వసంతుఁడను. నీవు రాజపత్నివనుమాట యెంత యథార్థమో నేను వసంతుఁడనుమాట యంత యథార్థము. అభిమాన పుత్రుఁడని, యౌరసుఁడని, యధికార తారతమ్యమని, యన్యోన్య కలహారంభ మగునని, జననాశనమగునని, ధనవ్యయమగునని, రాజ్యమమితాంధోళ సాధీనమగునని మీరు గుజగుజలుపోయి, దిల్లపడి యేమియుఁ దోఁచక నిలువ గ్రుడ్లు పైచుకొని, నాలుకలు గఱచుకొని, యంత యిబ్బంది పడనక్కఱలేదు. దానికొఱకపేక్షించి వచ్చినవాఁడనుగాను. నిశ్చయముగ నీ రాజ్యమును గోరి రాలేదు. ఆ కోకిలా పాదములతోడు.

కో : (తనలో) హా! హరీ! ప్రాణనాథా! నీ పాదములనే గతినమ్మియున్న నన్నిట్టి మాటలాడదగునా?

చం : (తనలో) ఇంత సేపటినుండియుఁ గొంతదూరమున నుంటచే దీనిమాట బాగుగ గుర్తింపలేకుంటిని. ఇప్పుడిది నాకతి సమీపస్థయగుటచే దీని గంధర్వని బాగుగ నానవాలు పట్టుచున్నాను. నా భర్త కంఠరవమునకాడ నిట్టిదే. ఏమియు భేదము లేదు. కనులు మూసికొనిన నాతఁడే మాటలాడినట్లు నాకుఁ బొడకట్టు చున్నది. (ప్రకాశముగ) అబ్బాయీ! కోకిలయని మీరంద రింత సేపటి నుండియు సంభాషించుకొనఁగ నేను వినుచు నూరకుంటిని. ఇప్పుడిది కోకిలా పాదముల తోడనినది. నాయనా! కోకిల యెవ్వతెయో నాకు స్పష్టముగఁ జెప్పుము.

వసం : అమ్మా! నన్నడుగుము! నేను జెప్పెదను. అతని కేమి తెలియును?

కో : (తనలో) ఆత్మస్వరూప నిర్ణయ మసాధ్యము కాదా? (ప్రకాశముగ) కోకిలా స్వరూపాదులు నీ కన్నులఁ గట్టినట్లుండ వేఁటవర్ణింపనేల? కాని, రాజ్య మక్కఱలేని విరాగి శిఖామణివి కాంతారములం దుండక కాంతల యంతః పురము లందేల దూరితివి?

వసం : నా ప్రాణనాయిక యగు కోకిలను బురముల వెదకితిని. వనముల వెదకితిని. ఎచ్చటను గానఁబడ దయ్యెను. ఇఁక నాకు వెదకుటకు దేహశక్తిలేదు. చేతిలో సాధనములు లేవు. నా రాజ్యమును జేరి నేనుండిన యెడల నాకు సేవకు లుండరా? ధనము కావలసినంత యుండదా? తత్సహాయమునఁ బ్రపంచ మంతయు నేను గోకిలను గాలింపఁగల ననియును, దానిని చూచు భాగ్య మప్పటికైన నాకుఁ గలుగకపోయిన యెడల స్వదేశములోఁ దల్లి సన్నిధిని

మరణమునొంది పితృపితామహాదు లేమట్టిలోఁ గలిసిరో దానిలో నేనుఁ గలియగలఁచి యిక్కడకు వచ్చితిని. నాకు రాజ్య మక్కఱలేదు. ఐశ్వర్య మక్కఱలేదు. ప్రాపంచకవస్తు వేదైనను నాకుఁ గోకిల తరువాతిదే. హా! కోకిలా! కోకిలా!

కో : హృదయమా! అత్యానందమున నవశత నొందుచుంటివా?

చం : బుద్ధిమతీ! నీవు వసంతు నొక్కసారి చూచితి నని చెప్పితివి కాదా?

బు : ఔను.

చం : నీ వతని నానవాలు పట్టఁగలవా?

బు : ఏమో! చూచెదను. (వసంతుని సమీపించి) అమ్మా! ఇదే పొడుగు; లావు. అమ్మా! ఆడుదాని కంత యెత్తయినా నుదురుండునా?

చం : పొలముమాట కేమి? ఆ ముక్కునకు నా ముక్కున కేమైన భేదమున్నదా? చూడు: ఈ వ్రేళ్ల ముంజేతు లచ్చముగఁ దండ్రివి సుమా! అహా! ఈ కర్ణములను జూడనేలేదు. ఇవి నా చెవులకుఁ బ్రతిబింబములుగ లేవా?

బు : పామ్య మున్నట్లే నాకుఁ దోఁచుచున్నది.

కో : తోఁచదా? ఇప్పు డందఱు పండితులే.

గీ. జాతకముఁ జూపి జాతక ♦ స్వామిలింగ
మెదనఁ గాలజ్ఞుఁ డిగిలించు ♦ నిద్ది క్రీడ
గుటకు హేతువు లే వన్న ♦ గుటకఁ ద్రిప్ప
కేకరువుపెట్టు శ్లోకాల ♦ నెన్నొ యతఁడు.

(తనలో) వసంతా!

గీ కల్ల తలకట్టు త్రాళ్లు చె ♦ క్కిళ్ళ వ్రేలు,
దొంగ గుబ్బల పైనున్న ♦ కొంగు జార
సర్దుకొననైన లేవు; నీ ♦ చానతనము
కంటె నామగరూపె బిం ♦ కముగ నుండె.

(ప్రకాశముగ) అమ్మా! మీ కందఱ కీ వెఱ్ఱితనమేల?

గీ. ఇతనిఁ బదియాఱువర్షము ♦ లతఁడు తనదు
బందిలో నుంచె; నతఁడె చె ♦ ప్పంగఁ దగు వ
సంతుఁ డీతఁ డౌనొ కాఁడొ; యీ ♦ వంత యేల?
గొల్లఁ డెఱుఁగక యుండునే ♦ గొఱ్ఱెగురుతు?

చం : ఈ వృద్ధ రాజేమో తలవంచుకొని మాటలాడక యున్నాఁడు.

మో : (తనలో)

గీ. పంచపక్ష్యపోషన గల్గు ♦ వానిఁ బోలె
కనుల నిట్టట్టు చిట్లించు ♦ కొనుచు లోన
నేదొ గొణగుకొంచును బ్రేళ్ళ ♦ లిటు గణించు
కొనుచు వెఱ్ఱిచూపున నవ్వు ♦ కొనుచు నుండె.

చం : అబ్బాయీ? ఈతని నేఁ బల్కరించిన బాగుగ నుండదు. నీ వడుగుము.

కో : నీ పుత్త్రిని చేతనే యడిగింపుము.

చం : (వసంతునివంకఁ దిరిగి) నీవే యడుగుము.

వసం: "నేను నేనేనా?" యని నే నాతని నడిగిన నన్నుఁ గూర్చి యాతఁ డేమను కొనును. ఎవరికి సందేహమైన వారడుగవలయును గదా?

కో : నీ యథార్థత్వమును స్థిరపఱచుకొని మా సందేహమును బోఁగొట్టు భారము నీ మీఁదనే యున్నదని నీ వెఱుఁగవా?

వసం: సరే! అడిగెదను. అయ్యా! అయ్యా! పలుకఁ డేమి! అయ్యా! (బిగ్గఱగ నఱచును)

రుద్ర : ఎవఁడవు నీవు?

వసం: నే నెవఁడనో తెలిసికొనగోరియే వీ రందఱు నన్ను నిన్నడుగుమనినారు.

రుద్ర : నిన్ను నీవే యెఱుఁగనపుడు నేను నిన్నెఱుఁగు టెట్లు?

వసం: నన్ను నే నెఱుఁగుదును. వీరు నన్ను నమ్మకున్నారు. మీరు నన్నెఱుఁగుదురు కావున, నమ్మకము గలుగఁజేయుటకుఁ గోరుచున్నాను.

రుద్ర : నేను నిన్నెఱుఁగుదునా? (దగ్గఱగఁ జూచును)

వసం: ఎఱుఁగరా? నేను వసంతుఁడనుగానా? మీ కారాగృహమునఁ జిరకాలము నివసింపలేదా?

రుద్ర : ఓరీ! ఓరీ! తస్కరుడా! అధముఁడా! చండాలుడా! నా కూతురేది? నా యొక్క పుత్రిక యేది? (వసంతునిపైఁబడి) నా కిప్పుడు దానిఁగనఁబఱపుము. లేదేని నీ గొంతుక నులిమెదను. జాగ్రత్త! మహాప్రభూ! తరువాతఁ దిరిగి కట్టవచ్చునుగాని, యరదండముల నొక్కసారి విప్పింపుడు. హా! కోకిలా! హా! కోకిలా! (ఏడ్చును.)

మో : మహారాజా! శాంతింపుఁడు. శాంతింపుఁడు. (ఇద్దఱను వేరుచేయును)

రుద్ర : మహాప్రభూ! మహాప్రభూ! నేను వెనుకఁ జక్రవర్తిని. ఇప్పుడు పేరులేని యధముఁడను. నా రాజ్యమును మీరు గ్రహించితిరను చింతచే నిట్లు మనవి చేసికొనుటలేదు. నాకు న్యాయ మొనర్ప మీరె కర్తలు; సర్వాధికారులు. ఈ

దుర్మార్గుఁడు నా కోకిలను హరించినాఁడు. వానిని శిక్షించి నా కూఁతురు నా కిప్పించి న్యాయం చేయవలయును. నేను మీకు సాష్టాంగ పడుచున్నాను. హా! కోకిలా! హా! కోకిలా!

(ఏడ్చుచు సాష్టాంగపడును.)

కో : (ప్రకాశముగ) అయ్యా! లెండు. లెండు. (తనలో) హా! తండ్రీ! నే నెంత ఘోరపాపము చేసితిని. నీవు నాకు నమస్కరింపగ నే నూరకుండవలసి వచ్చెను గదా! 'హా! కోకిలా!' యని నీ వేడ్వఁగ నీతోపాటు నేను బిగ్గరగ నేడ్చుటకు వీలులేక కన్నులలోఁ జీలలు గొట్టుకొంటిని. "కోకిలా! కోకిలా!" యని నీ వాలాపింపఁగ 'ఆఁ' యనుటకైన నోఁచుకొన లేక నోఁట నిప్పులు వోసుకొంటిని. (తిరిగి ప్రకాశముగ) అయ్యా! లెండు! లెండు! ఏమి లేవ కున్నారు. అమ్మా! చూడు! చూడు!

చం : (చూచి) అయ్యో! మూర్ఛాగతుఁ డయ్యెను.

కో : తండ్రి ప్రాణమున కాపదరాఁగఁ గొడుకు మగతనమే యాఁడుతనముగఁ గరఁగి పోవలసియుండఁగా, నాఁడుపడుచు పైఁబై మగతన మెరిగిపోయి యాఁడుతనముగ మాఱు టాశ్చర్యమేమి? ఛీ! ఛీ! ఛీ! ఇఁక నాకీ యనవసర వేషమేల! తీసిపాఱ వైతును. (తీసి లోని స్త్రీ వేషమున నిలిచి) హా! తండ్రీ! హా! తండ్రీ! (పెద్ద పెట్టున నేడ్చును.)

చం : (ఆశ్చర్యముతో) ఏమిది! ఏమిది! బుద్ధిమతీ! ఇదియేమి? జాలమా? స్వప్నమా? కనుకట్టా? హా! ఏమిది?

బు : ఇది యేమియుఁగాదు. ఇదియే గోకిల యని స్పష్టమగుచున్నది.

చం : మా అబ్బాయి యేఁడీ?

మో : అబ్బాయియే అమ్మాయిగా మారినది. కాలమహిమము.

వసం: (తనలో) హా! హృదయమా! ఇప్పటికైన నాలుక కెడమిచ్చెదవా? హా! కోకిలా!

గీ. ఎపుడుఁ గన్నులఁ బడుదువో, ♦ యెపుడు నిన్నుఁ
గౌఁగిలింతునో? యని చిర ♦ కాల మేను
తహతహను బొందఁ బ్రారబ్ధ ♦ తంత్రమునను
జేరవలసె ని న్నిట్టి ♦ దుస్థితిని నేను.

కో : తండ్రీ! ఇంకను లేవకుంటివేమి? రాజ్యవిహీనుఁడనై యీ శత్రు రాష్ట్రములో నురికంబముల ప్రదేశమున మరణశిక్షను బొంద నుద్యుక్తుఁడనై కఠి నాత్మిక యైన కూఁతుకొఱకు కేడ్చి యేడ్చి మొఱడు వాఱిపోతివా తండ్రీ!

(ఏడ్చును.) నా మూలమున మీ కెంత ప్రారబ్ధము తటస్థించెను? తండ్రీ! తండ్రీ! తండ్రీ! (ఏడ్చును.)

రుద్ర : (లేచి) నన్నుఁ దండ్రీ! యని పిలుచువా రెవ్వరు? కోకిలాయేనా? ఏదీ! ఏదీ! (తడవుకొనును)

కో : నాయనా! నే నిక్కడ నున్నాను. కన్నులు తెఱువుము.

రుద్ర : (తెఱచి) హా! నా తల్లి! నా తల్లి! (ఏడ్చును)

కో : నాయనా! లెమ్ము. (లేచును)

రుద్ర : అమ్మా! నిశ్చయముగ నీవు నా కూఁతురైన కోకిల వెకద!

కో : ఔను నీ కూతురైన గోకిలను నేనే. వసంతుని చెరవిడిపించి యతనితోఁ బారిపోయిన పాపాత్మురాలైన గోకిలను నేనే. మోహనుని బాధఁ దప్పించుకొని పురుషవేషమున నీ రాజ్యమును జేరి యీమెకు బుత్రుడనై రాజ్యము సేయుచు సిగ్గుమాలియున్న కోకిలను నేనే. నిన్నరిదీయవలసిన దని యాజ్ఞ యిచ్చి యిచ్చుటే కరదండములతో నిన్నిడ్పించిన చండాలినినైన కోకిలను నేనే. నీవు నా కొఱకేడ్చుచుండినను మూగనై యుండిన కోకిలను నేనే. ఏమి చేయఁగలను? రాజవిధి. అవిలంఘ్యమైన రాజవిధి నన్నట్లు చేయించెను. క్షమింపుము. (సాష్టాంగ పడును.)

రుద్ర : తల్లీ! లెమ్ము. నీవు విచారింపవలదు. నేను నిన్నుఁ బురుషవేషమునఁ జూచిన తోడనే గొంతు యానవాలుబట్టి నా వర్తమాన స్థితినిబట్టి వెల్లడించిన నేమి నేరమోయని భయపడితినిగాని యూరకుండవలసి వచ్చెను. తరువాత నట్టియది యేమో నాకు మతి చెదరుచున్నట్లుండెను. దేహస్మృతి తప్పుచున్నట్లు కానఁబడెను. ఇప్పుడు నాకు శాంత చిత్తత కలిగినది. ఇఁక నిక్కడ నేమి చేయవలయును?

కో : కొంచెము పని మాత్రమే యున్నది. ఈ సేనాధిపతి నురి దీయించవలసి యున్నది.

వసం: కోకిలా! నావంకఁ జూడుము. ఆతనిని జంపుట కేమిగాని, ముందు నన్ను బ్రదికింపుము.

కో : నీ వసంతత్వ మింకను స్థిరపడలేదు కదా!

వసం: అది నీ వలననే స్థిరపడవలసినది కదా!

గీ. రమ్యమాధుర్య మృదుతమా ♦ రవము గల్గు
కోకిల వసంతునికి శోభఁ ♦ గూర్పవలయు;
రమ్యమాధుర్య మృదుత మా ♦ రవము గల్గు
కోకిల వసంతునికి శోభఁ ♦ గూర్చుఁ గాదె?

కో : నీ కనుచిత మగునట్టియు, నేను జూడదగనట్టియు నీ యాడు వేసమును దీసి వైచినగాని నీ వసంతతను నేను స్థిరపఱుపఁజాలను.

వసం: మహా ప్రసాదము.

గీ. నిన్నుఁ గనఁగ సతిరూపె సా ♦ ధనమయినది
యైన నినుఁ బొందుటకు దాని ♦ నటుల ద్రోతు
జ్ఞానమే ముక్తిసాధన ♦ మైన దైన
దానిఁ ద్రోయవలయు ముక్తి ♦ దశనుగాదె?

(వసంతుఁడు నిష్క్రమించును.)

కో : (నవ్వుచు)

గీ. కొడుకుఁగా నుండినపుడు నర్మ ♦ బడిబడిగను
గరుణఁ జూచుచుఁ బల్క ద ♦ గ్గఱుదు వీవు
కోడల నయిన వెంటనే ♦ కొఱకొఱంచుఁ
బలుకకుంటివి దూరాని ♦ నిలిచి యత్త!

చం : (నవ్వుచు) అప్పుడే కోడంత్రిక మారంభమైనదని సంకోచించుచుంటివా? ఈ వింత మార్పు లన్నియు నా మనసు జెదరఁజేసినవి. అమ్మా! నీ కంటె నెవ్వరికి నెక్కువ తెలియదు. అది వసంతుఁడేకద!

కో : ఏమియు సందేహింపబనిలేదు. అతఁడు నీ పుత్రుఁడగు వసంతుఁడు.

చం : నా పుత్రుడగు వసంతుఁ డైన యెడల నీ భర్తయగు వసంతుఁడు మాత్రము కాకుండునా?

కో : పెద్ద లెట్లాచరించిన నదియే మాకు సమ్మతము. (అపవారించి) అయినను మా తండ్రిగారి యభిప్రాయ మెటు లుండునో?

చం : అన్నయ్యా! నీ కూతురును నా కొడుకునకుఁ జేసికొనవలయునని యున్నది. నీ యంగీకృతి కొఱకుఁ గోరుచుంటిని.

రుద్ర : (నవ్వుచు)

గీ. పెండ్లి కొడుకు కూఁతుల నింట ♦ బెట్టుకొంటి,
వహహా! కట్టివైచితివి వి ♦ య్యంకు విచట,
నన్ని సమకూడెఁగద! యీ ని ♦ రర్థకంపు
ముసలిగంగిరెద్దు తలయూఁ ♦ పు లివు డేల?

చం : (నవ్వుచు) అన్నయ్యా! ఇది నీవు చెప్పిన నీతియేకదా! నా పుత్రుని నీవు చిరకాలము గట్టిపెట్టితివి! కాన నా కొడుకుతో వడ్డిగ నీ కూతును దీసికొంటిని ఇంక వెనుకటి మాటలతోఁ బ్రయోజనములేదు. నీ కూతును నా కొడుకున కీయవలయును.

ధృఢ : నీ కొడుకునకు నా కూతును జేసిగొమ్మని నే నిన్నుఁ బ్రార్థింపవలసియుండ నీ వటు లందువేల?

చం : అట్లు నీ వనుకొనఁ బనిలేదు. మే మందఱము నీ కెప్పుడు విధేయులము కామా? ఈ రాజ్యములు రెండును నీవే కావా! మాకు నీకంటెఁ బెద్ద దిక్కెవ్వరున్నారు?

విజ : నా చావుమాట ముందుగఁ జూడక మీ పెండ్లిమాట లాడుకొనుచున్నారా?

కో : ఇఁకఁ జూచినది యేమి? ఓరీ! సేవకా? ఆతనిమెడ కా త్రాడు గట్టుము. ఛీ! అటుకాదు. ముందు చేతులు వెనుకకు విఱిచి కట్టవలెను. పాదములు రెండు బొట్టనవ్రేళ్ళను కలిపి కట్టుము. మెడను త్రాడు ఉచ్చువలె వేసి మొగము గానఁ బడకుండ నొకటోపిఁదగుల్చుము.

చం : మన మందఱ మింత యానందముగ నుండ నీ సమయమున నాతనిమాత్ర మేల చంపవలయును?

కో : ఏదోషమునైన సహింపవచ్చుఁ గాని రాజద్రోహమును సహింపఁగూడదు. జనుల క్షేమము రాజక్షేమమున నిమిడి యుండును. అట్టిరాజున కపకారము చేయువాఁడు లోకాపకారి. కావున అట్టివానిని క్షమియింపఁదగదు!

విజ : మోమునకుఁ గుళాయి నిండఁ దగుల్పవలదు. అయ్యా! నాభార్య చిరకాలము క్రిందటనే కాలము చేసినది. ఇంతకాలము నుండి విధురస్థితి నుండియు నీనడుమనే యొకదానిని దెచ్చుకొంటిని. దానిని గారణాంతరమునఁ బరిణయము కాలేదు. దానిఁ జూడవలయు నను కోర్కె నా కున్నది.

కో : దాని నిచ్చటి కెవ్వరు తీసికొనివత్తురు?

విజ : అచ్చట నున్న జగన్నాథుఁడు.

కో : కానీ.

జగ : (బరుగెత్తి భ్రమతికతో వచ్చును.)

భ్ర : హా! ప్రాణనాథా! అకస్మికముగ నీకెట్టి యాపద తటస్థించెను,

విజ : నీవు నా యాపదకొరకు విచారింప వలదు. ఏతత్క్షణమువరకుఁ "కోకిలయో కోకిలయో" యని యేడ్చు నీకుఁ గోకిలా దర్శనము కానున్నది. అదు చూడుము!

భ్ర : అమ్మా! అమ్మా! (దరికిఁ బోయి కౌగలించుకొని) అమ్మా! అమ్మా! ఎక్క-

దనుండి? ఎప్పుడు? ఏలాగు? అదుగో? అదుగో? నీ తండ్రిగారు! అమ్మా! వసంతు డేడీ?

కో : నీవు రాలేదని నిశ్చయపరచుకొనియే నిన్నింతవరకు స్మరింపనైన లేదు.

భ్ర : అమ్మా! రాకపోవుట కూడనా?

కో : సరే. నీవు పోయి నీ పెనిమిటి నోదార్చుము. ఆతఁడింకఁ జావనై యున్నాఁడు

భ్ర : అమ్మా! రక్షింపుము. (కాళ్ళపైఁ బడును.)

కో : ఆతఁడు చేసిన ద్రోహమేదియో నీవెఱుఁగవు కాన నీ వట్లనుచున్నావు.

భ్ర : అది యేమి?

కో : అతఁడు నన్నుఁ జంపుట కొకనికిఁ బ్రోత్సాహ మొసఁగినాఁడు.

భ్ర : హరిహరీ! గొప్పనేరమే చేసినాఁడు. అటులైనఁ జావవలసినదేనా?

కో : ఆఁ!

భ్ర : ఆతని రక్షించుకొన నుపాయంతర మేదైన నున్నదా?

కో : ఈ జను లాతని క్షమింపుమని ప్రార్థించిన క్షమింతును.

భ్ర : ఓ మహాజనులారా! నాపతిని రక్షింపరా? ఈతఁ డడవిలో నన్ను రక్షించెను. నేను దాసిని. స్వైరిణి. అయినను గులాంగననై యీతని వివాహముజేసికొన నిశ్చయించితిని. నారాణియగు కోకిలాదేవి నాకుఁ గానఁబడిన తరువాత నిన్ను వివాహము చేసుకొందు నని నే నాతనికి వాగ్దానము చేసితిని. స్వామి కటాక్షముల నా కామె దర్శనలాభము కలిగెను. మీ మహోదారతచే నాఁకు బతిలాభము కలుగవలయును. రక్షింపుఁడు.

(నేపథ్యమున) అతఁడు శిక్షాపాత్రుఁ డయ్యును నేరముచేసిన వారిని గొందరకు మహానందావసరమున క్షమించి వదిలివేయు పూర్వాచారము ననుసరించి యీతని క్షమింపఁదగును.

కో : జనవాక్య మంగీకరింపఁబడినది. సేవకా! విజయసారథిని దింపుము. (అట్లు చేయును.)

విజ : (అపవారించి) నే నిదివఱ కొకని జంపుటయే యాచారముఁ గలవాఁడనుగాని, చంపఁబడు నాచార మున్నవాఁడను గాను. నేనొకరిని రక్షించువాడుక కలవాఁడఁనే కాని యొకరిచే రక్షింపబడు వాడుక గలవాఁడను గాను. అట్టి నాకిట్టిగతి గలిగెను.

భ్ర : ఏమియు విచారింపకుము.

విజ : నాకు భయవిచారము లెన్నఁడును లేవు.

భ్ర : అమ్మా! వసంతుఁ డేఁడీ?

కో : అదుగో! (వసంతుఁడు ప్రవేశించును.)

చం : (కౌగలించుకొని) నాయనా! నాయనా! ఎంత కాలమునకు నాకనులఁ బడితివి! ఇంతవాఁడవై యుండ వెడలి, యింతవాడవై రాఁగ నిన్ను నేను గుర్తింప లేక పోయినను నిన్నుఁ జూచిన తోడనే నా మనసులో నేదియో యనిర్వచ నీయమైన యాందోళనము గలిగినది. నాయనా! నీ మామగారికి నమస్క రింపుము.

వసం: ముందు నీకు నమస్కరించి—(నమస్కరించును.)

చం : శీఘ్రముగ వివాహ మగుఁగాక!

వసం: మామగారూ! నమస్కరించుచున్నాను.

రుద్ర : చెల్లెలా! వివాహాశీర్వచనము నీవు చేసితివికాన శీఘ్రముగ సంతానవంతుఁ డవు కమ్మని నే నాశీర్వదింతును.

చం : నాయనా! అదిగో! చిరవిశ్లేష పరితప్త యగు కోకిల నాశ్వాసింపుము.

వసం: ప్రాణప్రియా! దైవకటాక్షమున నచ్చట నందరము చేరితిమి. నేను బుద్ధిలేని వాఁడనై నీయెడ నాచరించిన దోషమును నీవు దయతో మన్నింతువుగాక! (నమస్కరించును)

కో : లెమ్ము. ప్రమాదమున కింత ప్రార్థనమేల?

వసం; అనుగ్రహింపఁబడితిని. ఆహా! ఎన్నెన్ని చిత్రములు జరిగినవి?

ఆ. వె. కొడుకు కోడలయ్యెఁ; ♦ గోడు కయ్యె బానిన;
అమ్మ యత్తయయ్యె; ♦ నత్త యమ్మ
యయ్యె, వైరి వియ్య ♦ మయ్యెఁ; గోడలు కూఁతు
రయ్యె: బద్ధుఁ డల్లుఁ ♦ డయ్యె నహహ!

విజ : హాహాహా! దాసి సంసారిణి యయ్యెను. సేనాధిపతి దాసి మగఁడయ్యెను. ఈ రెండు మాటలను జెప్ప మరచినాను.

చం : మీరు మూఁడు జోళ్ళుగ వేఱువేఱుగ నిలువఁబడుఁడు. (అట్లు చేయుదురు.)

చం : మోహనా! ఇది పెంకిదయ్యును మిక్కిలి బుద్ధిమంతురాలు. ఇట్టిదానికి నీవంటి బుద్ధిహీనుఁడు పతిగ నుండుట తగదు. మీ దాంపత్యము లోకవిరుద్ధముగ నున్నది.

మో : ఎంతమాత్రమును లోకవిరుద్ధత లేదు. అలాగున నీలాగునఁ గూడ నున్నది.

చం : అలా గీలాగున నేమి?

మో: గీ. ఛాందసాచార పుణ్య ♦ నిష్ఠాభరున కొ
కింత పిత్తశరీర యౌ ♦ నింతి గలుగుఁ,

దలచుచు గుడిసె వ్రేటుల కాళ్ళ • కెఱగు తులువ
కిలమహాపతివ్రత సంభ • వించు నతిగ.

చం : (తనలో) అంతమట్టుతోఁ జాలించుము. (ప్రకాశముగ) అన్నయ్యా! వీరి వివాహములు వెంటనే చేయవలయును. ఎవరిది ముం దెవరిది వెనుకఁ జేయవలయునో యానతిచ్చెదరుగాక!

రుద్ర : మహారాజ వివాహమునకుఁ బూర్వమున సర్వమంగళయుక్తముగ సాలంకారముగఁ గొన్ని కన్యాప్రదానములు జరిగించవలయును. కనుక వీరిద్దఱవివాహములు వెంటనే చేయవలయును. తరువాత — మనము వియ్య మొందవలయును.

చం : అన్నయ్యా! సంతోషమే. వివాహము లిప్పుడే కావలయును. అందరమును లోనికిఁ బోవుదము. (అందరును నిష్క్రమింతురు.)

శ్రీ

కోకిల

పంచమాంకము

ప్రదేశము : శ్రీపురములోని వీధి

(ప్రవేశము - కృష్ణ శంకరులు)

కృ : ఏమండి? చిరకాలమునుండి వివాహదక్షిణకై కనిపెట్టియున్న మీకు నేను బాగుగ లభింపఁ జేసితినా?

శం : అయ్యా! సంతోషించితిని. వివాహము బహుశోభావంతముగ జరిగినది.

కృ : పెండ్లి కొమరుని జూచితిరా?

శం : లేదు. నాయనా. కాని, మిక్కిలి బుద్ధిమంతుఁడని తెలిసినది. సంతోషించితిని.

కృ : మా మహాదృష్టమున మాకట్టి ప్రభుఁడు లభించెను.

సీ. ఫాలభాగంబు వి ♦ శాల మౌటను గొంత
గోలవా టుగుమోము ♦ గ్రాలువాఁడు
నొకసారి కని పల్కు ♦ నొరుస్వరూప స్వభా
వము లిట్టె కనిపెట్టు ♦ ప్రతిభవాఁడు
నిదిగో! యనుచు నర్థి ♦ కిచ్చెడు పర్యంత
మును నిచ్చెద నటంచు ♦ ననని వాఁడు
నెటు పోయి యెటు వచ్చి ♦ యేమైన సరెకాని
యనృతంబు వచియింప ♦ నట్టివాఁడు

చెదరు లేనివాఁడు ♦ స్మితభాషి మితభాషి
కవితయన్నఁ బ్రీతి ♦ గలుగువాఁడు
బహుకలాన్వితుండు ♦ పరమ గంభీరుండు
మాతృభక్తి యుతుఁడు ♦ మా ప్రభుండు.

శం : మహారాజబాలక గుణాకర్ణనమున గర్ణములు మిగులఁ బవిత్రములైనవి.

కృ : కథనమున నాజిహ్వాకంతెనా? అదిగో! అటుచూడు. మన నేత్రములు కూడ సాఫల్య మొందవలసియున్నది. ఊరేగి వధూవరులిప్పుడే సర్వమంగళోత్సవ పరంపరలతోఁ గోటలో బ్రవేశించుచున్నారు. బురుజునొద్ద నిలిచి చూతము రమ్ము. (నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

—*—

ప్రదేశము :- శ్రీపురమున సభాశాల.

ప్రవేశము :- విజయసారథి, జగన్నాథుఁడు, చంద్రిక, కోకిల, వసంతుఁడు, రుద్రదేవవర్మ.

చం : అహా! ఇప్పటికిఁ గృతార్థులమైతిమి. సమస్త వైభవోపేతముగఁ గల్యాణమైనది. ఇఁక నేమియుఁ జింతలేదు. కాని, నాయనా! (వసంతుని గౌగిలించుకొని) నీవు నా పుత్త్రుఁడ వని తెలియక నీ యెడల నే నెంత తొందరపడితిరా? తండ్రీ! నీ మనసెంత నొవ్వజేసితినో?

వసం : అమ్మా! అటు లనెదవేల? నా ప్రాణప్రియమైన కోకిల నాకు బరమశత్రువని భ్రమసి నేను దానిని బాకునఁ బొడువలేదా? భ్రమమువలనఁ గలిగిన యజ్ఞతయే యింతకు హేతువు. విచారింపవలసినది లేశమును లేదు.

రుద్ర : ఇప్పుడు వెనుకటి మాటలతోఁ బనిలేదు. అయినను బ్రస్తావన వచ్చినది కావునఁ జెప్పెదను. తల్లికొడుకులకుఁ గలిగిన వెనుకటి మనఃకాలుష్యమునకును భార్యాభర్తలలోని యీ విపరీత కార్యమునకును మూలకారణ మీ విజయసారథి.

విజ : ఈ దెబ్బ నాపై బెట్టితిరేమి! నేనేమి చేసితిని?

రుద్ర : నీవు యుద్ధము నుండి యిటకు వచ్చిన వెంటనే స్త్రీ రూపమున నున్న వసంతుఁడు నీతో మాటలాడి నీయొద్ద తన గుట్టును వెల్లడించుకొనినాఁడుగదా?

విజ : అఁ!

రుద్ర : ఈ రాజ్యమున నున్న యుద్యోగులలో నీవు పెద్దవాఁడ వనియు, వయసు మీరినవాఁడ వనియుఁ దలయాడించుకొని తిరుగుచుంటివి కదా! కోకిలను జంపుమని నీవు చెప్పినయాలోచనము నీతి బాహ్యముగ నున్నది కాదా? "అమ్మా! ఇదుగో! వసంతుఁడ ననుచు నీతఁడు వచ్చినాఁడు. అయి యుండును. అయినఁ దొందరపడవలదు. నిదానముగ నాలోచింతము" అని సుగుణరాశియైన యీ మహారాజ్ఞిగారితోఁ జెప్పి మాతాపుత్రులను నీవు గలిపిన యెడల నింత క్షోభము రాకయుండునుగదా!

విజ : ఆఁ! ఆఁ! వసంతుఁ డని వచ్చినవానిని, వసంతుఁడని చెప్పినవానిని దెగ నఱుకుమని దేవిగారి యాజ్ఞయైయుండగ—

రుద్ర : అదేమి మాట? అది యొక వంక యని నే నెఱుఁగనా? యథార్థ గ్రహణ పర్యంత మట్టి యాజ్ఞ మపసంహరింపుమని నీ వీరాణిగారితోఁ జెప్పిన రాజ్య కార్యనై పుణ్య ధురంధరయు బుద్ధ్యభిమాన విశేషయు నైన యామె యంగీ కరింపక పోవునా? నీ స్వభావము మంచిదికాదు.

గీ. అమిత ధారాళముగఁ బైకి ♦ నగపడుచును
లోనఁబరమ కుత్సితుఁడైన ♦ వాని వెట్టి
పలుకు లాడుచుఁ బైకి లోఁ ♦ బరమ కఠిన
వృత్తిగలవాని నిన్నె వీ ♦ క్షించినాఁడ.

విజ : (అపవారించి) జగన్నాథా! వింటివా? సేనాధిపతి కట్టిస్వభావమే శ్రేష్ఠము సుమా? పొగగారకాయవలె మీఁదఁ బడువఱకుఁ గనఁబడకుండుటయే పౌరుష లక్షణము.

రుద్ర : వసంతా! నీవజ్ఞబాలుఁడవై మీ తల్లి యొడిలోఁ బాలు ద్రావుచుండ నిన్ను నేఁ దీసికొని వెళ్ళితిని. దైవకృపచే నాకాఁతుతోఁ నిన్ను మీయమ్మ కప్పఁ జెప్పుట తటస్థపడినది. ఈమెను నీ వెఱిఁగియుండవు. కాని, కర్ణములు పావ నములగున ట్లీ మెగుణములు చిరకాలము నుండి వినుచున్నాను.

సీ. శ్రీరామచంద్ర పా ♦ దారవిందాక్రాంత
చింతనాసంసక్త ♦ చిత్త యీమె
బహుదీన జనసంఘ ♦ పరిపాలనాలోల
మృదుదయాపరిపక్వ ♦ హృదయ యీమె
వివిధదేశానీత ♦ విద్వత్కవీశ్వర
సంఘాత శోభితా ♦ స్థాన యీమె
దేవగోబ్రాహ్మణా ♦ దిస్తుత్యసంభార
పాళివినిక్షిప్త ♦ భక్తి యీమె

పరమసాధ్వి యీమె ♦ బహుకీర్తిభర యీమె
తల్లి యీమె నీకుఁ ♦ దండ్రి యీమె
దైవ మీమె గాగఁ ♦ దలఁచి తత్సేవచే
నధికకీర్తి నొందు ♦ మయ్య! వత్స!

వసం : ఎఱిఁగియుండి యనుష్ఠింపఁదలచిన యంశమున కుపదేశ మనావశ్యక మయ్యును మామగారి యుపదేశ మగుటచే గ్రహించి శిరసావహించితిని.

చం : అన్నయ్యా! ఎందుల కిప్పుడీ మాటలు?

విజ : (అప) జగన్నాథా! చూచితివా, రాజ్ఞీగారి ప్రకృతి? స్వస్తోత్ర కథనమును సహింపలేదు సుమా!

జగ : (అప) ఆ శక్తియందు మీయంతవాఁడు లేఁడు.

రుద్ర : చెల్లెలా! ఎందుల కిప్పు డీమాట లనుచున్నావేమి? దైవానుగ్రహమునఁ గళ్యాణోత్సవ మత్యనుకూలముగ జరిగినది. సర్వమనోరథములు ఫలించినవి. ముసలులమైన మన కింక యుబుసుపోక మాటలతోడనే కదా కాలక్షేపము?

చం : (నవ్వుచు) మన మాటలకేమి? భార్యాభర్తల నిద్దఱను—అదిగో! వీరిశయన గృహము. దివ్యముగ సింగారింపఁబడి యున్నది. చూడు!

రుద్ర : ఓహో! ఇంకఁ బవిత్రులగు సువాసినుల మంగళగానాది కృత్యములు జరుగనై యున్నవి కాఁబోలు! నేను బోయెదను.

విజ-జగ : మేముగూడఁ బోయెదము. (నిష్క్రమింతురు.)

చం : నాయనా! నేనుబోయి కప్పురపుటారతి నొక్కసువాసినిచే ఇటకుఁ బంపెదను, అప్పుడు నీవు భార్యాసహితుఁడవై లోనికి రమ్ము. (పోవును.)

వసం : (కోకిలను గౌఁగలించుకొని)

గీ. తలఁచి తలఁచి పందొమ్మిదేఁ ♦ డులకు నొక్క
మాఱు నిన్ను ముద్దుఁ గొనఁగఁ ♦ గోరి, మూతి
నిట్టె పొడుగుసేయఁ గటిక ♦ యినుప కణిక
లడ్డుపడె నిప్పు డడ్డేది ♦ యగునో చూతు.

కో: ప్రాణప్రియా! మన వివాహముతో సమస్త మనోరథములు ఫలించినవి, ఇఁకఁ గోరఁదగినదియే లేదు. ఐన నిట్లు కోరెదను.

గీ. ధరణి యీతిబాధలు లేక ♦ తనరుఁగాక
ప్రజల యన్యోన్య వైరముల్ ♦ పాయుఁగాక
కవిత రాజపోషణమునఁ ♦ గ్రాలుఁగాక
నీతిపాలనమున రాజు ♦ నెగడుఁగాక!

(సువాసిని యొకతె కప్పురపు టారతితోఁ బ్రవేశించి)

సువా—తథాస్తు! తథాస్తు!! (అందరు నిష్క్రమింతురు)

పంచమాంకముతో సర్వమును సంపూర్ణము.

(శ్రీ) (శ్రీ) (శ్రీ)